తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

# జనంసాక్షి

Estd : 2002
www.janamsakshi.org

ఆదివారం 07.12.2025 | సంపుటి :12 సంచిక : 138 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









## మా ప్రభుత్వ హయాంలోనే
# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం

### దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు అందించాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిరంకుశంగా పాలన సాగించారు
- గతంలో ఎవ్వరినీ దగ్గరకు రానివ్వని కేసీఆర్ ఇప్పుడు సర్పంచ్, వార్డు మెంబర్లపై కపట ప్రేమ కురిపిస్తున్నారు
- బీఆర్ఎస్‌కు కేటీఆర్ అతి పెద్ద శత్రువు
- దేవరకొండ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దేవరకొండ (జనంసాక్షి): గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలబెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒవంత్ రెడ్డి అన్నారు.ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా శనివారం ఆయన నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమానికి హాజరై సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో దేవరకొండ మిగతా 2లో..

## హిల్ట్ పాలసీపై
# స్టేకు 'నో'
### హైకోర్టులో ప్రభుత్వానికి ఊరట



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను ఇతర అవసరాలకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌స్టైల్ టౌన్‌షిప్) పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇది కేవలం విధానపరమైన ప్రకటన మాత్రమేనని, ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి కోర్టుకు వివరించడంతో ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ప్రభుత్వం నవంబర్ 22న జారీ చేసిన జీవో మిగతా 2లో..

## సుప్రీంను సామాన్యులకు
# చేరువ చేస్తా
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- సామాన్యుల పిటిషన్లకు ప్రాధాన్యం దక్కేలా దృష్టి సారిస్తానని ప్రకటన



న్యూఢిల్లీ(జనంసాక్షి): సుప్రీంకోర్టు సాధారణ పౌరులకు చెందినది అనే స్పష్టమైన, బలమైన సందేశాన్ని ఇవ్వాలని తాను భావిస్తున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. సామాన్యులు దాఖలు చేసే పిటిషన్లకూ సుప్రీంకోర్టులో తగినంత ప్రాధాన్యత, సమయం లభించి తీరాలన్నారు. సుప్రీంకోర్టులో విచారణ కోసం లిస్ట్ అయ్యే కేసుల జాబితాలో సాధారణ పౌరుల పిటిషన్లు, అప్పీళ్లకూ సముచిత ప్రాధాన్యం దక్కేలా సంస్కరణలు చేయడంపై తాను ఫోకస్ పెట్టానని ఆయన వెల్లడించారు. ఇది తానొక్కడితే అయ్యే పని కాదని, సుప్రీంకోర్టులోని అందరు న్యాయమూర్తుల సహకారాన్ని తీసుకుంటున్నట్లు సీజేఐ చెప్పారు. మిగతా 9లో..

## 'గ్లోబల్' సంబురానికి అతిరథమహారథులు

TELANGANA RISING GLOBAL SUMMIT

- రైజింగ్ సమ్మిట్ ఆరంభ వేడుకలో పాల్గొని ప్రసంగించనున్న ఆర్థికవేత్తలు, పారిశ్రామిక వేత్తలు
- ప్రముఖులు అభిజిత్ బెనర్జీ, జెరెమీ జుర్గెన్స్, కైలాష్ సత్యార్థి, ఎరిక్ స్పైడర్, కిరణ్ మజుందార్-షాల రాక
- తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తాం
- సదస్సు జరిగే ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఎజెండా ఖరారైంది. అంగరంగ వైభవంగా అంతర్జాతీయ ఆర్థిక సదస్సులా నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. రెండు రోజుల సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు జరగనున్నాయి. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు తరహాలో సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 9న తెలంగాణ మిగతా 2లో..

## అమెరికాలో అగ్ని ప్రమాదం..
# హైదరాబాద్ యువతి మృతి
శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



2లో..



## కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా
# కేంద్రంపై పోరాడుదాం

- విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు?
- ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు
- రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ పిలుపు

హైదరాబాద్,డిసెంబరు6(జనంసాక్షి): ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని మిగతా 2లో..

## శభాష్..ధారూ తెగ



కట్నం అడిగినా.. పుచ్చుకున్నా బహిష్కరణే..

దేశానికే ఆదర్శమైన ఓ ఆదివాసీ తెగ

*మన దేశంలో నేటి ఆధునిక యుగంలోనూ వరకట్న వేధింపులకు నవ వధువులు బలి అవుతూనే ఉన్నారు. ఇలాంటి కట్న పిశాచులకు బిహార్‌లోని ఓ గిరిజన తెగ కనువిప్పు కలిగిస్తోంది. పశ్చిమ చంపారణ్ జిల్లాలో విస్తరించి ఉన్న ధారూ తెగ పెళ్లిళ్లలో వరకట్నం ఇచ్చినా, తీసుకున్నా గ్రామం నుంచి బహిష్కరిస్తారు. వివాహమనేది రెండు కుటుంబాలను, రెండు హృదయాలను కలిపే పవిత్రబంధంగా భావించే వీరిలో శతాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వీరు కుమార్తెలను గౌరవంగా భావిస్తారు. పెళ్లిళ్లు కూడా ఎటువంటి హంగూ ఆరాటాలు లేకుండా జరుగుతాయి. గోబర్ధియా పోలీస్‌స్టేషను పరిధిలో ధారూ తెగవారు ఎక్కువసంఖ్యలో ఉన్నారు. ఈ ఠాణా 1996లో ప్రారంభం కాగా.. గత 29 ఏళ్లలో ఒక్క వరకట్న వేధింపుల కేసు కూడా నమోదు కాలేదు.*

– పాట్నా(జనంసాక్షి):

## పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా
# గ్లోబల్ సదస్సు

- విజన్ డాక్యుమెంట్‌తో ప్రపంచాన్ని ఆకర్షిస్తాం
- 8న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మచే ప్రారంభోత్సవం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్(జనంసాక్షి): గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ కు సంబంధించిన సమ్మిట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మిట్ ఉపయోగ పడుతుందన్నారు. గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు.డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. మొత్తం 27 సెషన్లు ఉంటాయన్నారు. తెలంగాణ విజన్ డాక్యుమెంటరీ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తామని చెప్పారు. ఈ మేరకు శనివారం గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కలిసిన భట్టి సమ్మిట్‌కు ఆహ్వానించా రు. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయన్నారు. మ ధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగిస్తారని చెప్పారు . మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగా లపై చర్చ జరుగుతుందని.. 3 గంటల నుంచి 4 గం టల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుందని తెలి పారు. సెమికండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకే షన్ పై చర్చ జరుగుతుందన్నారు. సాయంత్రం 6గం టలకు సమ్మిట్ ముగుస్తుందన్నారు మిగతా 2లో..

## రూపాయి పతనంతో కొంత లాభమేనట
ఎగుమతిదారులకు ప్రయోజనకరమే..

నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

2లో..

## లోక్‌సభ ముందుకు డీప్‌ఫేక్ నియంత్రణ బిల్లు





## పుతిన్ పర్యటన విజయవంతం

న్యూఢిల్లీ(జనంసాక్షి):రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండురోజుల భారత పర్యటన ముగిసింది. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందుకు హాజరయ్యారు. విందు ముగిసిన తర్వాత అక్కడి నుంచి పుతిన్ నేరుగా విమానాశ్రయానికి చేరుకున్నారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విమానాశ్రయానికి వెళ్లి వీడ్కోలు పలికారు. 'కలిసి సాగుదాం, కలిసి ఎదుగుదాం'.. అన్న నినాదంతో పుతిన్ తన భారత పర్యటనకు ముగింపు పలకడం విశేషం. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోడీ మిగతా 2లో..

## కొలిక్కిరాని ఇండిగో సంక్షోభం



### చర్యల దిశగా కేంద్రం • సుప్రీంకోర్టుకు వ్యవహారం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయంతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతోన్న సంక్షోభం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ పరిస్థితులను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ ను పదవి నుంచి తొలగించేలా ఇండిగో బోర్డుకు ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే ఎయిర్‌లైన్‌పై భారీగా జరిమానా విధించేందుకు సిద్ధమవుతోందని సీనియర్ అధికారుల వ్యాఖ్యల బట్టి తెలుస్తోందని సమాచారం. పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగో అధికారులను పిలిపించి మాట్లాడనుంది. అలాగే ఆ కంపెనీ విమాన సర్వీసుల్ని తగ్గించనున్నట్లు తెలుస్తోంది. అనుకోకుండా ఎదురైన అనేక సవాళ్లు ఈ పరిస్థితికి కారణమని ఇప్పటికే ఇండిగో తెలిపింది. సాంకేతిక సమస్యలు, చలికాలం వల్ల షెడ్యూల్‌లో మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో ఇబ్బందులు, సిబ్బందికి సంబంధించిన కొత్త రోస్టర్ నియమాలు కారణమని వివరణ ఇచ్చింది. ఈ కొత్త నియమాల ప్రకారం పైలట్ల సంఖ్యను సరిగా అంచనావేయకపోవడం వల్లే దేశీయ సర్వీసుల్ని నిర్వహించడంలో ఇబ్బందిపడుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీటీఎల్‌లోని వీక్లీ విశ్రాంతి నిబంధనను తాత్కాలికంగా పక్కన పెడుతున్నట్లు ప్రభుత్వం నిన్న వెల్లడించింది. ఈ చర్యలతో మూడురోజుల్లో సాధారణ పరిస్థితులు మిగతా 2లో..



## భారత్‌తో మెరుగైన సంబంధాల కోసం
# ప్రయత్నాలు కొనసాగించాలి

- ట్రంప్ సర్కారు హితవు
- క్వాడ్ కూటమిలో సహకారం ద్వారా ఇండో-పసిఫిక్ భద్రతకు దోహదపడుతుందని వెల్లడి

న్యూయార్క్(జనంసాక్షి): భారత్‌తో వాణిజ్య, ఇతర సంబంధాలను మెరుగుపరచుకోవడానికి అమెరికా ప్రయత్నాలు కొనసాగించాలని డొనాల్డ్ ట్రంప్ సర్కారు పేర్కొంది. క్వాడ్ కూటమిలో సహకారం ద్వారా ఇండో–పసిఫిక్ భద్రతకు ఇది దోహదపడుందని తెలిపింది. 'అమెరికా జాతీయ భద్రతా వ్యూహం' పేరిట ట్రంప్ సర్కారు మిగతా 2లో..

## సాగుకొద్దీ యూరియా



- విస్తీర్ణం ఆధారంగా పంపిణీ
- కీలక నిర్ణయం దిశగా రాష్ట్ర ప్రభుత్వం
- వివరాల కోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి

హైదరాబాద్(జనంసాక్షి):వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్ది కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇక విపక్షాలు అయితే ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రం రాష్ట్రానికి సరిపడా యూరియాను సరఫరా చేయలేదని దుమ్మెత్తిపోశాయి. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకరమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీని కోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ-పాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07.12.2025

## అమెరికాలో అగ్ని ప్రమాదం

# హైదరాబాద్ యువతి మృతి

### శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

**హైదరాబాద్(జనంసాక్షి):**అమెరికాలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో తెలుగు యువతి ఉడుముల సహజా రెడ్డి ప్రాణాలు కోల్పోయింది. ఉన్నత చదువుల కోసం నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఆమె అనుకోని విధంగా చనిపోయింది. గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల ప్రాంతంలోని గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి, శైలజ భార్యాభర్తలు. జయాకర్ రెడ్డి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పని చేశారు. జయాకర్ కుటుంబం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి సెటిల్ అయింది. జోడిమెట్లలో నివాసం ఉంటోంది. జయాకర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు సహజారెడ్డి 2021లో ఎంఎస్ చదవటం కోసం అమెరికాకు వెళ్లింది. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 13 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. 13 మందిలో ఉడుముల సహజా రెడ్డి కూడా ఉంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకున్న సహజారెడ్డి అక్కడికక్కడే చనిపోయింది. అధికారులు ఆమె మరణ వార్తను జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. సహజారెడ్డి మరణ వార్త తెలిసి కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికాలోని భారత ఎంబసీ సహజారెడ్డి మరణంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేసింది. వారితో సంప్రదింపులు జరుపుతోంది. అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

## సాగుకొద్ది యూరియా

మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల.. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం.. ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్ నెలకు సంబంధించిన 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరింది. రాష్ట్రంలో అక్టోబర్ నుండి ఇప్పటివరకు 3.10 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటలు వేసిన రైతులు ఏమేరకు యూరియా వాడకం చేస్తారో పట్టాపాసు బుక్ వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు అధికారులు వివరాల ప్రకారం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం మిగతా యూరియా కోటాను త్వరగా పంపాలని కోరుతున్నారు.

## భారత్‌తో మెరుగైన సంబంధాల కోసం ప్రయత్నాలు కొనసాగించాలి

తాజాగా వ్యూహపత్రాన్ని విడుదల చేసింది. దక్షిణ చైనా సముద్రంలో భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్‌తో బలమైన సహకారం అవసరమని వివరించింది. "మానవజాతి చరిత్రలో అమెరికా అత్యంత విజయవంతమైన, గొప్ప దేశంగా, పుడమిపై స్వేచ్ఛకు నెలవుగా కొనసాగేందుకు ఈ వ్యూహపత్రం ఒక మార్గసూచిగా ఉపయోగపడుతుంది. దేశ సామర్థ్యానికి సంబంధించిన అన్ని అంశాలనూ బలోపేతం చేసుకొని అమెరికాను సురక్షిత, సుసంపన్న, స్వేచ్ఛాయుత, గొప్ప దేశంగా మారుస్తాం" అని ఈ పత్రంలో ట్రంప్ సందేశమిచ్చారు. పశ్చిమార్ధగోళంలో ఉమ్మడి వైఖరులను మరింత బలోపేతం చేసుకునేందుకు ఐరోపా, భారత్ సహా ఆసియాలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని వ్యూహపత్రం నిర్దేశించింది. శాంతియుత అధ్యక్షుడిగా ట్రంప్ గుర్తింపు పొందారని తెలిపింది. భారత్-పాకిస్థాన్, ఇజ్రాయెల్-ఇరాన్, గాజా సహా ప్రపంచవ్యాప్తంగా 8 ఘర్షణలకు ఆయన ముగింపు పలికారని వివరించింది.

## కొలిక్కిరాని ఇండిగో సంక్షోభం

నెలకొంటాయని భావిస్తోంది. ఈ అంతరాయాలపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు.

**సుప్రీంకోర్టుకు చేరిన ఇండిగో సంక్షోభం**

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో తీవ్ర అంతరాయం వల్ల ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాస్తున్నారు ఇప్పుడు ఈ సంక్షోభం సుప్రీంకోర్టుకు చేరింది. విమాన సర్వీసుల రద్దుపై అత్యున్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. దీనిపై తక్షణమే విచారణ జరపాలని పిటిషనర్ కోరారు. స్టేటస్ రిపోర్ట్ సమర్పించేలా పౌరవిమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను సుప్రీం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఐదు రోజులుగా ఇండిగో విమానాల్లో అంతరాయం కొనసాగుతోంది. శనివారం కూడా పలు ఎయిర్‌పోర్టుల్లో దాదాపు 500కు పైగా దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో దిల్లీ ఎయిర్‌పోర్టు ప్రకటన విడుదల చేసింది.

## భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదు: జైశంకర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్-రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రష్యాతో బంధం కారణంగానే అమెరికా- భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. దీనికి విదేశాంగ మంత్రి బదులిస్తూ.. 'వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్-రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతోంది' అని అన్నారు. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు అని వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందన్నారు. భారత ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఇక, ఈ కార్యక్రమంలో పాకిస్థాన్ ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురయ్యింది. దీనికి జైశంకర్ బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు.

## మా ప్రభుత్వ హాయంలోనే ..

# ఎస్ఎల్‌బీసీ పూర్తిచేస్తాం



మున్సిపాలిటీలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాక మెప్మా మహిళా సంఘాలకు 11 కోట్ల 33 లక్షల 46వేల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో, గంజాయిని అరికట్టడంలో, విద్య, వైద్యం, తదితర రంగాలలో తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో ఉందని అన్నారు. డిసెంబర్ 8, 9 తేదీలలో మహేశ్వరంలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లో తెలంగాణ అభివృద్ధి ,సంక్షేమాలను ప్రపంచానికి కళ్ళకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, దేవరకొండ నియోజకవర్గానికి నర్సింగ్ కళాశాలను ఇస్తామని, ఇందుకుగాను వెంటనే అంచనాల రూపొందించి పంపించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. దేవరకొండ నియోజకవర్గం లో తండాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్ కు రహదారులు నిర్మించేందుకు అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి ,అలాగే రోడ్లు ,భవనాలు, పంచాయతీరాజ్ శాఖ మంత్రులను దేవరకొండ కు పంపించి దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ కోరిన విధంగా దేవరకొండ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించేలా పంపిస్తామని తెలిపారు. గిరిజనులు అత్యధికంగా ఉండే దేవరకొండ, అచ్చంపేట ప్రాంతాలలో మద్దిమడుగును పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని మద్దిమడుగులో ఏర్పాటు చేసుకుందామని అన్నారు. దేవరకొండ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి గతంలో నిధులు ఇవ్వడం జరిగిందని, అసంపూర్తిగా నిలిచిపోయిన దేవాలయ పనులను పూర్తి చేసినందుకు రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు .దేవరకొండ జూనియర్ కళాశాల అభివృద్ధికి 6 కోట్ల నిధులు ఇస్తామన్నారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2004- 2014 వరకు లంబాడి తండాలు, ఆదివాసిగూడలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత తమదేనని అన్నారు. రాష్ట్రంలో మూడు కోట్ల 10 లక్షల మంది సన్న బియ్యం తింటున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వటం లేదని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు బాగుపడుతున్నాయని ఆయన చెప్పారు. అవసరమైన, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు వెళ్లడం జరుగుతున్నదని, దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు .మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ 2 ఏళ్లలో దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి ,సంక్షేమం కార్యక్రమాలు తెలంగాణలో జరుగుతున్నాయని అన్నారు. దేవరకొండ నియోజక వర్గానికి రహదారులు మంజూరు చేయాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ దేవరకొండ ఏరియా ఆసుపత్రిని వంద పడకల నుండి 200 పడకలకు పెంచాలని, దేవరకొండకు మో టార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని మంజూరు చేయాలని, పెండ్లి పాకలతో పాటు ,ఇతర పెండింగ్ లిఫ్ట్ ఇరిగేషన్లు అన్ని పూర్తి చేయాలని, దేవరకద్ర జూనియర్ కళాశాలకు నూతన బిల్డింగ్ మంజూరు చేయాలని, నియోజకవర్గంలో 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంచడంతోపాటు, అవసరమైన చోట నూతన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయాలని ,మైదాన ప్రాంతంలో ఐటిఐ మంజూరు చేయాలని, దేవరకొండలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి ఇదివరకే 11 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అది మధ్యలోనే ఆగిపోయిందని , ఎస్డిఎఫ్ నిధులనుండి నిధులు మంజూరు చేసి దేవాలయం పూర్తిచేయాలని, మైనార్టీ ఉర్దూ మీడియం పాఠశాల మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని తాండ నుండి మండలాలకు, మండలం నుండి జిల్లా కేంద్రానికి రోడ్లు మంజూరు చేయాలని ,ఇందుకు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని, కొత్తగా మంజూరైన మూడు మండలాలలో తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు భవనాలు ఇవ్వాలని, విద్యాపారంగా దేవరకొండను అభివృద్ధి చేయాలని ,మిషన్ భగీరథ తాగునీరు దేవరకొండకు రావడం లేదని, ప్రత్యేకంగా మిషన్ భగీరథ ద్వారా డిండి , చందంపేట మండలాలలో తాగునీటిని సరఫరా చేయాలని కోరారు . రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష?, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు ఉన్నారు.దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ రాష్ట్ర ముఖ్యమంత్రిని పూర?కుంభం మొమెంటుతో శాలువాతో సత్కరించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి దేవరకొండ మున్సిపాలిటీలో 13 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ వార్డులలో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలోని 7 ,9 ,10 వార్డులలో రెండున్నర కోట్ల రూపాయలతో మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన .1 వ వార్డు నుండి 20 వ వార్డులకు వరకు 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి డ్రైన్లకు, రెండు కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ట్రాక్ తో సహా స్టేడియం అభివృద్ధి పనులకు,మరో రెండు కోట్ల రూపాయల వ్యయంతో 19వ వార్డులో ఉన్న బిఎన్ ఆర్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి 11 కోట్ల 33 లక్షల 46 వేల రూపాయల విలువ గల బ్యాంకు లింకేజీ చెక్కులను మహిళ సంఘాలకు అందజేశారు.




## పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా

# గ్లోబల్ సదస్సు

డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ మళ్లీ ప్రారంభం అవుతుందని భట్టి చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంద న్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కోరుకునే వారు ఈ సమ్మిట్ లో పాల్గొనవచ్చని చెప్పారు. ఇండిగో విమాన సమస్య ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమైన వాళ్లు రావడానికి ఇబ్బంది ఉంటే వాళ్లకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు' అని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ అజెండా ఖరారైంది. సోమ, మంగళవారాల్లో ఫ్యూచర్‌సిటీ వేదికగా ఈ సమిట్ జరగనుంది. అంగరంగ వైభవంగా అంతర్జాతీయ ఆర్థిక సదస్సు నిర్వహణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రెండ్రోజుల సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. 8, 9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని 'ఫ్యూచర్ సిటీ'లో 100 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు హాజరు కానుండడంతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు సిద్ధమవుతున్నాయి. 9న సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా పాల్గొననున్నారు. క్రియేటివ్ సెషన్‌లో రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గుణీత్ మోంగా, అనుపమ చోప్రా పాల్గొంటారు.

## 'హిల్ట్'పై స్టేకు నో

27 హెచ్ఎండీఏ చట్టానికి, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదిస్తూ, పారిశ్రామిక భూములను నివాస, వాణిజ్య సముదాయాలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. హైదరాబాద్‌ను "గ్రీన్ సిటీ"గా మార్చే లక్ష్యంతోనే కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు ఈ పాలసీని తెచ్చామని తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది కేవలం విధానపరమైన నిర్ణయమని, హెచ్ఎండీఏ చట్టం ప్రకారమే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, అందుకు ఇంకా సమయం ఉందని స్పష్టం చేశారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది.

## లోక్‌సభ ముందుకు డీప్‌ఫేక్‌ను నియంత్రణ బిల్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రస్తుత కృత్రిమమేధ యుగంలో చాలామంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. ఈ డీప్‌ఫేక్ నియంత్రణకు సంబంధించిన బిల్లు లోక్‌సభ ముందుకువచ్చింది. ఇలాంటి కంటెంట్ కట్టడికి అవసరమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేలా ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రతిపాదించారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే ఈ డీప్‌ఫేక్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇలాంటి కంటెంట్ రూపొందించేందుకు వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి చేయాలన్నారు. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం పెరిగిపోయింది. దీని నియంత్రణకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలి' అని శిందే అన్నారు. దురుద్దేశంతో ఇలాంటి కంటెంట్‌ను సృష్టించినా లేదా ఫార్వర్డ్ చేసినా అలాంటివారికి శిక్షలు పడాలన్నారు. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రతగురించి ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ టెక్నాలజీ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరినీ కలవరపెడుతోంది. ఈ డీప్‌ఫేక్‌ను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధాని మోదీ కూడా గతంలో దీనిపై ఆందోళన వ్యక్తంచేశారు. డీప్‌ఫేక్ వీడియోలు సమాజానికి పెనుముప్పుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

## 'గ్లోబల్' సంబురానికి అధిరథమహారథులు

రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్?ను ఆవిష్కరించనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్‌సమ్మిట్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 8 మధ్యాహ్నం ఒంటి గంటకు సదస్సు లాంఛనంగా ప్రారంభం కానుంది. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తరలిరానున్నారు. రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశగా జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు జరుగుతాయి. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ సెమీకండక్టర్లు, విద్య ,వైద్యం, పర్యాటకం, సిక్యా ఎంటర్టైన్మెంట్, తాజ్ హొటల్స్ తదితరులు వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారు. పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గుణీత్ మోంగా, అనుపమా చోప్రా వంటి సినీ ప్రముఖులు క్రియేటివ్ సెంచరీ, సాఫ్ట్ పవన్ అండ్ ఎంటర్టైన్మెంట్ చర్చలో పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు వేదికగా ఈ నెల 9న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తుంది. తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ఈ డాక్యుమెంట్?లో పొందుపరిచారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అన్ని రంగాల్లో భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నూతన ఆవిష్కరణల దిశగా సమగ్ర ప్రణాళికలను పొందుపరిచారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు సదస్సుకు తరలివచ్చే ప్రతినిధులను సమన్వయం చేస్తున్నారు. దావోస్‌లో ఏటా జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌ను తలపించేలా అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సదస్సు ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తున్నారు. అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు.దేవరకొండ నుంచి ఫ్యూచర్ సిటీకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ సమావేశాల వేదికలను పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేదికలు, స్క్రీనింగ్, సీటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గ్లోబల్ సమిట్ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయని అన్నారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్?తులను సమిట్‌కు ఆహ్వానించామని, ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నామని తెలిపారు. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారని అన్నారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని, ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదని భట్టి విక్రమార్క తెలిపారు.

## పుతిన్ పర్యటన విజయవంతం

స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము అధికారికంగా స్వాగతం పలికారు. భారత్- రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్ - రష్యా మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. రక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోదీ వివిధ బహుమతులు అందించారు. ఇందులో రష్యన్ ఎడిషన్ భగవద్గీత, కాశ్మీరీ కుంకుమ పువ్వు, అసోం బ్లాక్ టీ, బెంగాల్ ముర్షీదాబాద్‌కు చెందిన వెండి టీ సెట్, మహారాష్ట్రలో చేతితో తయారు చేసిన వెండి గుర్రం, ఆగ్రా నుంచి తెచ్చిన మార్బుల్ చెస్ సెట్ వంటివి ఉన్నాయి. పుతిన్ పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ మరో కీలక ప్రకటన చేశారు. రష్యన్లకు 30 రోజులపాటు ఉచిత ఇ టూరిస్టు, గ్రూప్ టూరిస్టు ఉచిత వీసాలను త్వరలో ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పుతిన్‌తో కలిసి సంయుక్తంగా జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని మోదీ వెల్లడించారు. అందువల్ల రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలూ బలపడతాయని ఆయన ఆకాంక్షించారు. భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహార భద్రత, నౌకాయానం, ఎరువులు, విద్య, భారత్ నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు ఇవి దోహదపడ నున్నాయి. మాస్కోతో వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో దిల్లీకి సాయపడనున్నాయి. భౌగోళిక రాజకీయాలు ఎన్నెన్నో కుదుపులకు లోనైనప్పటికీ.. భారత్-రష్యా స్నేహం

## కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు.

## రూపాయి పతనంతో కొంత లాభమేనట

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే జీవనకాల కనిష్ఠాలకు పతనమవుతోంది. రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదని, ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని వెల్లడించారు. ఈ మేరకు హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని మంత్రి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉందని వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలను క్రమబద్ధీకరించామన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపాయిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. "రూపాయి విలువ తగ్గినప్పుడు.. మన ఎగుమతిదారులు దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని నేను కచ్చితంగా చెప్పగలను. మన ఉత్పత్తులపై సుంకాల వేళ.. ఇదికాస్త సానుకూలమే. రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కరెన్సీ హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును నిర్ణయించలేవు" అని అన్నారు. కుటుంబాల్లో పొదుపు తగ్గుతోందన్న ఆందోళనలను మంత్రి తోసిపుచ్చారు. పొదుపు, పెట్టుబడులు పెరుగుతున్నాయని వెల్లడించారు.

# నగరంలో తెలంగాణ రైజింగ్ ఆకర్శణలు

- భారీగా ఏర్పట్లతో పాటు..హంగూ ఆర్భాటం
- పలుచోట్ల ప్రత్యేక ఆకర్శణ తోరణాలు




**హైదరాబాద్, డిసెంబరు 6 (జనంసాక్షి) :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్ ను అందంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ హంగులు ఓ వైపు, తెలంగాణ ప్రత్యేక ఎట్రాక్షన్స్ మేళవింపుతో మరో వైపు జరుగుతున్న ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రముఖ ప్రదేశాలు, చెరువులు, రహదారులు, సమ్మిట్ వేదిక.. ఇలా అన్ని చోట్లా హైటెక్ ప్రొజెక్షన్లు, డిజిటల్ రూపంలో ప్రదర్శనలు , ఆధునిక విజువల్ ఎఫెక్టులతో ప్రత్యేకంగా పెట్టుబడుల పండగ వాతావరణం సృష్టించ నున్నారు. చార్మినార్ తో పాటు కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చూపించనున్నారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సెక్రటేరియట్ వద్ద అద్భుతమైన త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా చూపించడానికి ప్రణాళిక రూపొందించారు. రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ డిస్ ప్లేలు ఉండనున్నాయి. దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్ తో అద్భుతంగా ప్రదర్శించనున్నారు. హుస్సేన్ సాగర్ లో వాటర్ ప్రొజెక్షన్ ద్వారా ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువత?రైతు ప్రధాన కార్యక్రమాలు, మూడు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం లాంటి ముఖ్య అంశాలను చూపించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి సమ్మిట్ వేదిక వరకు వెళ్లే అప్రోచ్ రోడ్డుపై భారీ డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్క్రీన్ల మీద భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి.. ఎంత దూరం.. వంటి వివరాలు పొందుపరుస్తారు. నగర వ్యాప్తంగా గ్లోబల్ సమ్మిట్ లోగోతో తయారు చేయించిన 1500 రంగురంగుల జెండాలతో వేడుక వైభవాన్ని చాటనున్నారు. సమ్మిట్ వేదిక వద్ద లోపలికి వెళ్లే మార్గం మొత్తం ఆధునిక త్రీడీ ఎనీమార్ఫిక్ డిజైన్లు రూపొందిస్తున్నారు. 50 మీటర్ల పొడవుతో డిజిటల్ టన్నెల్ ను ఇంటరాక్టివ్ డిస్ ప్లే రూపంలో ఏర్పాటు చేసి, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు పురోగతిని విజువల్స్ ద్వారా చూపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో పది వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక సమాచార స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, డిజిటల్ స్క్రీన్లపై విజువల్స్, సమ్మిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచనున్నారు. అక్కడున్న వలంటీర్లు ప్రజలకు సమ్మిట్ డైలీ షెడ్యూల్ ను వివరించి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి లో తెలంగాణ అందరి దృష్టిని ఆకర్శించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

# మహానటి సావిత్రికి మరణం లేదు

- చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరస్థాయి
- అలాంటి నటులు నేడు లేరు..రారు
- మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు
- సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు



**హైదరాబాద్, డిసెంబరు 6 (జనంసాక్షి) :** మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అని ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్ళు', సుకుమార్ కుమార్తె సుక్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు. మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకినా, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యనాయుడు కోరారు.

# ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం 'తెలంగాణ క్రాంతిదళ్' ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర విభజన అనంతరం పునర్నిర్మాణ దశలో అడుగులు వేస్తునది. తనదైన అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం ఒక్కో పుటను లిఖించుకుంటున్నది. ఈ సమయంలో మళ్లీ చాప కింద నీరులా ఆంధ్రా ప్రముఖుల విగ్రహాలు హైదరాబాద్‌లో పెట్టే కుట్రలు జరుగుతున్నాయి. ఎన్‌టీఆర్, రోషయ్య, బాలసుబ్రహ్మణ్యం ఇట్లా ఒక్కొక్క ఆంధ్రా ప్రముఖుల విగ్రహాలు మళ్లీ ఇక్కడ ఏర్పాటు చేస్తూ, తెలంగాణ బిడ్డల అరవయేండ్ల ఆకలిమంటల పోరాటాన్ని అవమానిస్తున్నారు. ఈ దుశ్చర్యలను తెలంగాణ సమాజం సహించబోదు. తెలంగాణలో ఒక్క ఇంచు నేలను కూడా ప్రాంతేతరుల కోసం వదులుకోవడానికి సిద్ధంగా లేదు. సినీ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం గొప్ప గాయకుడు. అందులో ఎవ్వరికీ ఏ సందేహమూ లేదు. కానీ, తెలంగాణ ఉద్యమకాలంలో ఆయన తెలంగాణ పాటను పాడనని చేసిన అవమానాన్ని ఏ తెలంగాణ బిడ్డా మరిచిపోలేదు. అది కూడా అందెశ్రీ రచించిన పాటే కావడం గమనార్హం. మరి కాంగ్రెస్ సర్కార్ అందెశ్రీని, బాలసుబ్రహ్మణ్యంను ఒకే గాటన కట్టి, తెలంగాణ కవులు, కళాకారులకు గుండెకాయ వంటి రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడాన్ని మేం ఖండిస్తున్నాం. బాలసుబ్రహ్మణ్యం విగ్రహంతో పాటు, ట్యాంక్‌బండ్ మీద గత ఆధిపత్య పాలనకు చిహ్నాలుగా మిగిలిన ఆంధ్రా ప్రముఖుల విగ్రహాలు కూడా ఆంధ్రాకు తరలించి గౌరవించాలని డిమాండ్? చేస్తున్నాం. తెలంగాణ సాంస్క ృతిక పునర్నిర్మాణోద్యమంలో ప్రజలు ఉద్యమకారులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ ఆదివారం 07.12.2025 ఉదయం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా.అంబటి సురేంద్రరాజు, పాశం యాదగిరి, డా.సంగిశెట్టి శ్రీనివాస్, అన్నవరం దేవేందర్, జూపాక సుభద్ర, కాసుల ప్రతాప్‌రెడ్డి, కందుకూరి రమేశ్ బాబు, దెంచనాల శ్రీనివాస్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, ప ృథ్వీరాజ్ యాదవ్, ఎస్.జగన్‌రెడ్డి, డా.జిలుకర శ్రీనివాస్, స్కైబాబ, మెర్సీ మార్గరేట్?, డా. నలిగంటి శరత్?, డా.గుడిపల్లి రవి, విమల కొల్లాపురం, డా.గుర్రం సీతారాములు, హె.రమేష్? బాబు, డా.పసునూరి రవీందర్?, ఎం.ఎం.రహమాన్, కంభాలపల్లి కృషి, సయ్యద్ రఫీ, ప్రేమ్?రాజ్?, దాసోజు లలిత, దాసోజు కృష్ణమాచారి, తెలంగాణ శ్యామ్, తెలంగాణ పరిరక్షణ వేదిక, సింగిడి తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ కవులు, కళాకారులు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, మేధావులు తదితర సంఘాలు, వ్యక్తులు పాల్గొనాలని సూచించారు.

# స్వర్ణ గ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవం



**సారంగాపూర్,డిసెంబర్6(జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో స్వర్ణ గ్రామపంచాయతీ లో బీసీ జనరల్ రిజర్వేషన్ కేటాయించడంతో ఏకగ్రీవంగా కొత్తింటి మల్లేశ్ ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ గా దశాబ్దానికి పైగా రాజకీయ అనుభవం ఉంది ఆయన గతంలో సర్పంచ్ వారి తల్లిని సర్పంచిగా బాధ్యతలు నిర్వర్తించారు. గ్రామస్తుల ఇచ్చిన హామీలను కచ్చితంగా గ్రామ అభివృద్ధి పనులకి తోడ్పడతానని తెలిపారు.

# పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్‌లో విందు

**హాజరైన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్**



**న్యూఢిల్లీ,డిసెంబర్6(ఆర్ఎన్ఎ):** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం నిన్న రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హాజరుకావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. ఇదే కార్యక్రమానికి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం అందకపోవడం ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. ఈ పరిణామాలపై ఎన్డీటీవీతో మాట్లాడిన శశి థరూర్, తాను విందుకు ఎందుకు హాజరయ్యారో స్పష్టతనిచ్చారు. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా తన విధి నిర్వహణలో భాగంగానే తాను వచ్చానని తెలిపారు. "విదేశాలతో సంబంధాలు నెరపడం మా కమిటీ పరిధిలోని అంశం. ఆయా దేశాలతో చర్చల్లో ఏం జరుగుతుందో, అక్కడి వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకోవడం చాలా ఉపయోగపడుతుంది. అందుకే ఇక్కడికి వచ్చాను. అంతకుమించి ఇందులో మరేమీ లేదు" అని ఆయన వివరించారు. విందుకు తనను ఆహ్వానించడాన్ని తాను గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడంపై థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో కొన్ని విషయాల్లో విభేదించినా, మరికొన్నింటిలో ఏకీభవిస్తూ ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలి" అని ఆయన అన్నారు. ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడుతున్న నేపథ్యంలో పార్టీ మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన ఆచితూచి స్పందించారు. "నేను కాంగ్రెస్ పార్టీ ఎంపీని. ఎన్నికల్లో గెలవడానికి చాలా కష్టపడ్డాను. వేరే నిర్ణయం తీసుకోవాలంటే చాలా విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజల కోసం పనిచేయడమే తన ప్రధాన బాధ్యత అని థరూర్ స్పష్టం చేశారు.

# అత్యుత్తమ సేవలందించిన హెూంగార్డ్ బానోతు సీతారాంకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రం



**చిట్యాల, డిసెంబర్ 06( జనం సాక్షి):** 63వ హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను చిట్యాల పోలీస్ స్టేషన్‌కు చెందిన హెూంగార్డ్ బానోతు సీతారాం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తనకు కేటాయించిన కోర్టు ప్రాసెస్ డ్యూటీ లో సీతారాం అత్యుత్తమ సేవలు అందించారు. ఆయన పనితీరును గుర్తించిన జిల్లా పోలీసు యంత్రాంగం, హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎస్పీ ద్వారా ఈ రివార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సీతారాంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్,డిఎస్పీ సంపత్ రావు,హెూంగార్డ్ ఆర్.ఐ పూర్ణ,వెల్ఫేర్ ఆర్.ఐ కాసిరం నాయక్,సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్ కుమార్, తోటి హెూంగార్డ్స్ పెండెల ప్రసాద్, ముత్యాల మొగిలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పురుషుడిపై మహిళ అత్యాచారం

**పూణె, డిసెంబర్ 6 జనంసాక్షి) :** మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, "నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను" అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# ఓటు అడిగే హక్కు ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉంది

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, డిసెంబర్ 6 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.

శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని నిర్వహించిన పరకాల మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సమావేశాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యమత్యంతో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. పరకాల మండలం లోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల జాబితాను తెలిపారు. పాత కొత్త తేడా లేకుండా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఓటు అడిగే హక్కు ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని, గత రెండు సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# క్రికెట్ పోటీలను ప్రారంభించిన సింగరేణి జీఎం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియా, రామగుండం -3 లను కలుపుకొని క్రికెట్ రీజినల్ మీట్ పోటీలను శనివారం భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ గ్రౌండ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం మాట్లాడుతూ డబ్ల్యూపిఎస్ అండ్ జి ఎ క్రీడలు సింగరేణి సంస్థలో ప్రతి ఒక్కరిలో ఒక సెలబ్రేషన్ లాగా నిలుస్తాయన్నారు. క్రీడలు మనందరిలో మానసిక ఉల్లాసం, సానుకూలతను నింపుతాయని, మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ, టీమ్ వర్క్ ను వికసింపజేస్తాయని తెలిపారు. నేటి ఆధునిక జీవన విధానంలో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ కోసం క్రీడల పాత్ర మరింత ప్రాధాన్యతను సంతరించుకుందని చెప్పారు. సింగరేణి సంస్థలో ప్రతి ఏడాది లాగే ఈ క్రీడలను నిర్వహించడం ఆనందదాయకమని, ఉద్యోగులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలు రోజు వారి మన కార్యకలాపాలలో భాగం చేసుకోవాలని సూచించారు. మనం ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన కోల్ ఇండియా కబడ్డీ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులు శ్రీనివాస్ రెడ్డి, భానోత్ రమేష్, గణేష్ లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ , క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, ఐఎన్టీయుసి బ్రాంచి నాయకులు బొడ్డు అశోక్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్వ శ్రీనివాస్, భూపాలపల్లి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పాక దేవయ్య, క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# భారత్ రష్యా సంబంధాలు

## భారత ఆర్థిక దృఢత్వానికి చేయూత!



భారత్ రష్యా సంబంధాలు ప్రపంచ రాజకీయ అస్థిరతను దాటి నిలిచిన ఆత్మీయ బంధం. దశాబ్దాలుగా ఏర్పడిన విశ్వాసం 2030 ఆర్థిక ప్రణాళిక ద్వారా కొత్త దిశను పొందింది. ఐదేళ్ల కాలానికి కుదిరిన ఈ కార్యక్రమం రెండు దేశాల ఆర్థిక సహకారాన్ని శక్తివంతం చేసే దిశలో ముందడుగు. 100 బిలియన్ డాలర్ల వ్యాపార లక్ష్యం ఈ మైత్రికి ఆర్థిక సత్తువను జతచేసింది. ఇంధన రంగం విస్తరణ రెండు దేశాల అవసరాలకు కీలక మద్దతు. శాస్త్ర సాంకేతిక రంగాలలో భాగస్వామ్యం భవిష్యత్ అభివృద్ధికి పునాది. ఉక్రైను సమస్యపై భారత్ తెలిపిన శాంతియుత దృక్కోణం రష్యా విశ్వాసాన్ని మరింత బలపరిచింది. సంభాషణ మార్గం ప్రపంచానికి అవసరమనే భారత ధోరణి అంతర్జాతీయ వేదికలో ప్రతిధ్వనించింది. ఆసియా భద్రతా వ్యవస్థలో ఈ రెండు దేశాల వ్యూహాత్మక సమన్వయం కీలకం. వాణిజ్య రంగం విస్తరించే అవకాశం పెట్టుబడులకు దారి చూపుతోంది. ఆర్కిటిక్ వ్యాపార మార్గాలు కొత్త దిశలను సూచిస్తున్నాయి. రక్షణ రంగ సహకారం పరస్పర స్థిరత్వానికి బలం. ఈ ప్రణాళిక భారత్ రష్యా మైత్రిని భవిష్యత్ తరాలకు స్థిరమైన మార్గంగా నిలబెడుతోంది.

ఆంతర్జాతీయ రాజకీయ రంగం వేగంగా మారుతున్న ఈ శతాబ్దంలో స్థిరమైన మైత్రి సంబంధాలు అరుదుగా మారుతున్న దృశ్యంలో భారత్ రష్యా సంబంధాలు విశేషమైన ప్రత్యేకతను సంతరించుకున్నాయి. దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే మానవతా విలువలు వ్యూహాత్మక సమన్వయం పరస్పర విశ్వాసం వంటి అంశాలపై ఆధారపడిన ఈ బంధం ఎన్నో భౌగోళిక మార్పులకు మధ్య నిలకడగా కొనసాగిన దృశ్యం కనిపిస్తుంది. శీతసమరం కాలంలోనైనా ఏకధృవ ప్రపంచ ఆవిర్భావంలోనైనా ఆసియా భద్రతా వాతావరణ మార్పులలోనైనా ఈ మైత్రి నిలకడ కోల్పోలేదు. ఈ పునాదిపైనే తాజాగా కుదిరిన 2030 ఆర్థిక కార్యక్రమం ఒప్పందం అంతర్జాతీయ వేదికను మరోసారి భారత రష్యా సంబంధాల వైశాల్యంపై దృష్టి సారింపజేసింది.

ఐదేళ్ల ప్రణాళిక 100 బిలియన్ డాలర్ల వ్యాపార లక్ష్యం ఆమోదం పొందిన దశ ఈ రెండు దేశాల మధ్య ఆత్మీయ బంధాన్ని ఆర్థిక శక్తిగా మార్చే దిశలో కీలక మలుపుగా నిలిచింది. వాణిజ్య రంగపు విస్తరణ ఇంధన భద్రతా వ్యవస్థ బలపరిచే ప్రత్యామ్నాయాలు పారిశ్రామిక సహకారం శాస్త్ర సాంకేతిక రంగాలలో భాగస్వామ్యం వంటి అంశాలు ఈ ప్రణాళికలో కేంద్ర దృక్కోణంతో నిలిచాయి. భారత్ ఎదుగుతున్న ఆర్థిక శక్తి. వికాసవంతమైన మార్కెట్. ఇంధన అవసరాలు నిరంతరం పెరుగుతున్న దశలో రష్యా వనరుల ప్రాప్తి కీలకం. రష్యా కూడా ఆసియా మార్కెట్లను వ్యూహాత్మక అవకాశంగా చూస్తోంది. ఈ పరస్పర ఆధారితతే 2030 ప్రణాళిక పునాది. రాజకీయ రంగంలో మరింత ప్రాధాన్యత సంతరించుకున్న విషయం ఉక్రైను సంఘర్షణపై భారత్ ప్రకటించిన శాంతియుత పరిష్కార దృక్కోణం. ప్రపంచ దేశాలు విభజన స్థితిలో చిక్కుకున్న దశలో భారత్ సమన్వయ ధోరణి తీసుకోవడం రష్యా భారత సంబంధాలను మరింత బలపరిచింది. సమాలోచన సూత్రం పాటించే దేశం ప్రపంచానికి అవసరం. భారతి పాత్ర ఈ సందర్భంలో విశిష్టమైంది. ఏ వైపు మొగ్గు చూపకుండా సంభాషణ మార్గం సూచించిన భారత్ దౌత్య పరిమళం రష్యాకు సానుకూల సంకేతాలు ఇచ్చింది. ఈ దృక్కోణం భవిష్యత్ సహకారానికి దృఢతను అందించింది.

2030 వ్యూహాత్మక ప్రణాళిక ఆమోదం పొందిన దశలో భద్రతా రంగం కూడా కీలక అంశంగా నిలిచింది. భారత సైనిక ఆధునీకరణ ప్రయాణంలో రష్యా సహకారం ప్రారంభ దశ నుంచే ప్రముఖం. క్రైస్తవ ప్రపంచం ఏ దిశలో మారుతున్నదన్నది పరిగణనలోకి తీసుకుంటే రక్షణ రంగంలో స్వయం సమృద్ధి ప్రయాణం కొనసాగుతున్న భారత్‌కు అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల ప్రాప్తి కీలక ఘట్టం. రష్యా ఈ సహకారం అందించే శక్తిగా నిలిచింది. సైనిక వాణిజ్య ఒప్పందాలు భద్రతా భాగస్వామ్య దశలకు పునాది.

2030 ప్రణాళిక వాణిజ్య రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించిన దృశ్యం స్పష్టమవుతుంది. ఇంధన వ్యాపారం ప్రధాన అక్షం. చమురు సరఫరా ప్రత్యామ్నాయ మార్గాలు పెరుగుతున్నాయి. ఎల్ఎన్జీ ఒప్పందాలు విస్తరించాయి. కోల్ సరఫరా వ్యవస్థలో స్థిరత్వం కనిపిస్తోంది. ఫార్మాస్యూటికల్ రంగం భారత్ కు ప్రపంచ వేదిక. ఈ రంగానికి రష్యా విస్తారమైన మార్కెట్. ఐటి రంగం సేవలు రెండు దేశాలకు సమానంగా అవకాశాలు అందిస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యం ఉభయ దేశాలకు లాభదాయకం. ఈ రంగాలన్నీ కలిసి 100 బిలియన్ డాలర్ల లక్ష్యం చేరుకునే దిశలో ఉన్న శక్తిని ప్రతిబింబిస్తున్నాయి.

భవిష్యత్ వాణిజ్యం పెట్టుబడి రంగాల్లో కూడా ఈ ప్రణాళిక మార్గనిర్దేశం చేస్తోంది. బహుముఖ పెట్టుబడుల ప్రవాహం పరిశ్రమల ఏర్పాటు సాంకేతిక మార్పింగు కార్యక్రమాలు రెండు దేశాల ప్రయోజనాలకూ మార్గం చూపుతున్నాయి. మౌలిక సదుపాయాల రంగం ఆకర్షణీయంగా మారుతోంది. రవాణా మార్గాలు అభివృద్ధి చెందడంతో వాణిజ్య ప్రవాహం స్థిరపడి విస్తరణ సాధ్యం. దూరప్రాంతాల వ్యాపార సామర్థ్యం పెరుగుతోంది. ఆర్కిటిక్ మార్గాలు భవిష్యత్ వ్యాపారం కోసం కొత్త దిశ. భారత్ ఈ మార్గాన్ని వ్యూహాత్మక అవకాశంగా మార్చుకునే అవకాశం ఉంది. రష్యా సహకారం దీనికి అవసరమైన పునాది.

2030 ప్రణాళిక అసలు బలం రెండు దేశాల ఆత్మీయత. భావోద్వేగ అనుబంధం అనేక కాలాల్లో పరీక్షించబడింది. సంక్షోభ తరుణాల్లో ఏ రాష్ట్రమైనా తాను నిలబడే బలం మైత్రి నమ్మకం. గత దశల్లో రష్యా భారత్‌కు చేసిన సహాయం అనేక సార్లు చరిత్రకు గుర్తు. భారత్ కూడా రష్యా సంబంధాలను శాశ్వత బంధంగా చూసింది. ఈ పరస్పర అనుబంధమే ఆర్థిక ప్రపంచంలో పరస్పర ఆధారితతను బలపరిచింది. ఐదేళ్ల ప్రణాళిక ఈ అనుబంధాన్ని అభివృద్ధి అక్షంగా మార్చే దిశలో ముందడుగు.

ఉక్రైను సంఘర్షణ పరిష్కారానికి శాంతియుత సంభాషణ మార్గం అనుసరించాలనే భారత్ పునరుద్ఘాటించిన సూత్రం అంతర్జాతీయ వేదికకు అవసరమైన స్థిరత్వం అందిస్తోంది. రష్యా ఈ సూత్రాన్ని గౌరవించిన దశ ఈ మైత్రికి దృఢతను అందించింది. ప్రపంచం అనిశ్చితితో కదులుతున్న దృశ్యంలో ఇలాంటి సంబంధాలు స్థిరత్వం సృష్టించే శక్తిగా మారతాయి.

భవిష్యత్ దృష్టిలో చూస్తే భారత్ రష్యా మైత్రి మరింత విస్తరించే అవకాశం ఉంది. ఇంధన రంగం విస్తరణ పరిశ్రమల శ్రేణీకరణ సాంకేతిక వ్యవస్థల పునర్నిర్మాణం ఆహారరంగం ఫార్మా రంగం సేవారంగం విద్య సైనిక సహకారం రవాణా మార్గాలు పెట్టుబడులు వంటి అనేక దిశల్లో అభివృద్ధి అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ అవకాశాల పునాది 2030 ప్రణాళిక. ఈ ప్రణాళికలో ప్రతిఫలించిన ఆత్మీయత రెండు దేశాల భవిష్యత్ శక్తిసామర్థ్యాలను ప్రపంచ వేదికలో వ్యక్తం చేస్తోంది.

ఈ దృశ్యం ప్రపంచానికి చేస్తున్న సందేశం ఒక్కటే %-% మైత్రి సంబంధాలకు విలువ ఉన్నపుడు ఆర్థిక సామర్థ్యాలు బలపడతాయి, రాజకీయ స్థిరత్వం పెరుగుతుంది, భద్రతా వ్యవస్థ బలపడుతుంది. భారత రష్యా అనుబంధం ఈ నేనున్న వాస్తవానికి సజీవ ఉదాహరణ. 2030 ప్రణాళిక రూపుదిద్దుకున్న దశ ఈ బంధాన్ని భవిష్యత్ తరాలకు కూడా శాశ్వత మార్గచిత్రంగా నిలుపుతోంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# విద్యా దీప్తి... జీవన దీపం

## అసాధారణ ప్రతిభావంతుడు డా. ఎన్‌వీఎన్ చారి

విద్యారంగానికి అంకితమైన ఆదర్శవంతుడు డా. ఎన్‌వీఎన్ చారి. జ్ఞాన సాధనకు, సమాజ సేవకు తన జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయుడు. అర్థం కోసం కాదు, అర్థవంతమైన జీవితం కోసం విద్యా రంగాన్ని ఎంచుకున్న అరుదైన వ్యక్తి. ఉపాధ్యాయుడిగా, పరిశోధకుడిగా, కవిగా, నటుడిగా, సామాజిక కార్యకర్తగా విభిన్న రంగాల్లో దేదీప్యమానంగా వెలిగిన చారి... స్నేహశీలి, నిగర్వి. అధ్యాపక వర్గానికి, విద్యార్థులకు, సమాజానికి స్ఫూర్తి ప్రదాత. చిరునవ్వుతో సేవలందించిన ప్రేమమూర్తి.

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంలో శ్రీవైష్ణవ కుటుంబానికి చెందిన ప్రముఖ జ్యోతిష పండితులు, ప్రవచకులు నల్లన్ చక్రవర్తుల చక్రాచార్యులు-వేదమ్మ దంపతులకు 1959 జనవరి 1న జన్మించారు చారి. ఎనిమిది మంది సంతానంలో ముగ్గురు అక్కలు, ఇద్దరు అన్నలు, ఇద్దరు తమ్ములతో పెరిగారు. బాల్యం నుంచే క్రమశిక్షణ, పఠనాభిలాష, వేదికపై వినూత్న వ్యక్తీకరణ ఆయన వ్యక్తిత్వానికి పునాది. అమ్మగారి ప్రభావంతో వ్యాకరణ సూత్రాలు, కావ్యాలు, కథలు, నవలలు చదవడం అలవాటైంది. స్వగ్రామంలో ప్రాథమిక విద్య, 8-10 తరగతులు లష్కర్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. వ్యాసరచన, వక్తృత్వం, ఏకపాత్రాభినయంలో హైస్కూల్‌లోనే అనేక బహుమతులు సాధించారు.

విద్యా ప్రస్థానంలో పరిశోధనా ప్రతిభ... ఎమ్మెఫిల్, పీహెచ్‌డీలతో ఘనతలు ఇంటర్ ఎమ్ఇసీ గ్రూపుతో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బీకాం (1977-80) కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తిచేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఎమ్‌కాం, పీహెచ్‌డీబీ అమరావతి యూనివర్సిటీలో ఎమ్‌ఫిల్‌బీ ప్రొడక్టివ్ కౌన్సిల్ ద్వారా పీజీడీసీఏ పూర్తి చేశారు. 'గ్రామీణాభివృద్ధిలో జిల్లా పారిశ్రామిక సంస్థల పాత్ర'పై ఎమ్‌ఫిల్‌బీ 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్'పై పీహెచ్‌డీ (2005) సాధించారు. యూజీసీ సహకారంతో 'గ్రామీణ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు'పై మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ సమర్పించారు. ఎమ్‌బీఏ (ఇగ్నో), ఎమ్‌ఫిల్ (వినాయక మిషన్) రీసెర్చ్ స్కాలర్లకు మార్గదర్శి. అకౌంటింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, మేనేజ్‌మెంట్‌లో నవీన గ్రంథాలు రచించి విద్యార్థుల అవగాహన పెంచారు. గ్రూప్-1 విద్యార్థులకు 'సైన్స్ అండ్ టెక్నాలజీ' ఆంగ్ల పుస్తకం రాశారు.

ఉద్యోగ జీవితంలో అకడమిక్ సేవా యజ్ఞం... ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ జూనియర్ లెక్చరర్‌గా ప్రారంభించి, అసోసియేట్ ప్రొఫెసర్, కామర్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్ హెడ్‌గా హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాలలో సేవలందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ప్రిన్సిపాల్‌గా 2017 మేలో పదవీ విరమణ చేశారు. తర్వాత అరుణోదయ డిగ్రీ పీజీ కళాశాల భీమారంలో స్పెషల్ ఆఫీసర్, ఎమ్‌జేపీటీబీసీడబ్ల్యూఆర్‌డీసీ సంస్థలో 2023 వరకు పనిచేశారు. సిలబస్ రివిజన్ కమిటీ సభ్యుడిగా ఉద్యోగ విద్యను పరిశ్రమ ధోరణులకు అనుగుణంగా మార్చారు. గ్రామీణాభివృద్ధి, మైక్రోఫైనాన్స్, మెడికల్ టూరిజం, బ్రాండ్ స్టడీస్‌లో శాస్త్రీయ పరిశోధనలు చేశారు. జాతీయ-అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సిలబస్ రివ్యూ కమిటీలు, అకడమిక్ గైడెన్స్ సెల్‌లో చురుకుగా పాల్గొన్నారు. 'ప్రపంచ ఆర్థిక సంక్షోభం-భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం', 'నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయుల పాత్ర', 'ఉన్నత విద్యలో నాణ్యతా సాధనా పద్ధతులు' వంటి 50కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. 'ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం క్వశ్చన్ బ్యాంక్', 'ఫైనాన్షియల్ అకౌంటింగ్ విత్ టాలీ', బీకాం విద్యార్థులకు 'అడ్వాన్స్ అకౌంటింగ్ విత్ టాలీ', 'ఫండమెంటల్స్ ఆఫ్ ఇనార్మేషన్ టెక్నాలజీ', 'కార్పొరేట్ అకౌంటింగ్', 'ఇ-కామర్స్' వంటి అనేక పాఠ్యపుస్తకాలు రచించారు. నాణ్యతా విద్యపై సెమినార్లు నిర్వహించి, పుస్తకాలు సంపాదించారు. నాక్ పరిశీలకుడిగా అనేక కళాశాలలకు మార్గదర్శనం చేశారు. 'నవస్వరాలు' కవితా సంకలనం, 'విజయ గణపతి శతకం', 'అమృత బిందువులు', 'హనుమ శతకం', 'శ్రీవత్సాంకం స్మృతి కావ్యం', 'సమస్యా పూరణం' (2500 పద్యాలు), 'తప్త భారతం తారకరామా శతకం' (టీఏఎన్ఏ ప్రపంచ పద్యకావ్య పోటీలో ఆన్‌లైన్ ప్రచురణ) వంటి స్వీయ రచనలు. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, మన టీవీ ద్వారా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రేడియో పాఠాలు, కవితలు, కథనాలు అందించారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా భారతీయ సంస్కృతి, ఇతిహాస గాథలు, వేదోపనిషత్తుల జ్ఞానాన్ని సప్తాహ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేర్చారు. నాటకరంగంలో 'మృగమైదానం', 'గోగ్రహణం', 'వశీకరణం' వంటి నాటకాల్లో నటించి కటక్ నేషనల్ డ్రామా ఫెస్టివల్‌లో 'బెస్ట్ యాక్టర్', 'బెస్ట్ ప్రొడక్షన్' అవార్డులు పొందారు. రంగస్థలం ఆయనకు కళ కాదు, సమాజానికి అద్దం. తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం (2013), జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (2017), నవభారత్ రత్న, ధర్మనిధి ఉత్తమ పద్యకవితా పురస్కారాలు, ఎన్‌టీఆర్ నేషనల్ అవార్డు (2023/24), జన్మభూమి కోఆర్డినేటర్‌గా బంగారు పతకం సాధించారు. సామాజిక-ఆధ్యాత్మిక సేవల్లో సెంట్రల్ జైలు వరంగల్ ఖైదీలు, సిబ్బందికి 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్' శిక్షణబీ గ్రామీణ విద్యాభివృద్ధి కార్యక్రమాలుబీ 'శ్రీలేఖ', 'పోతన విజ్ఞాన పీఠం' వంటి సాహిత్య, సాంస్కృతిక సంస్థల్లో ప్రముఖ పాత్ర వహించారు. శ్రీవత్సాంక స్మారక చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడిగా కుమారుని స్మృతిని సేవా రూపంగా మార్చారు. ఉపాధ్యాయుడు వృత్తి కాదు, వ్రతమని నమ్మి జీవితాన్ని విద్యార్థులకు అంకితం చేశారు. సాహిత్య రసాస్వాదమే కాదు, విద్యారంగానికి ఆదర్శం, ఆదరణ. విభిన్న రంగాల్లో బహుముఖ సేవలు చిరస్మరణీయం. అధ్యాపక వర్గానికి సన్నిహిత మిత్రుడు. స్నేహానికి, శాంతికి, సహనానికి, సమర్థ వ్యవహార దక్షతకు ప్రతీక. అలసట, చిరాకు, కోపం ఆయనలో లేవు. ఆయనకు వందనం, కృతజ్ఞతలు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## నిష్కళంక బంధనం

నిష్కళంకమైన నా హృదయాగ్నిపై ఎందుకు
ఆ మాలిన్యం నీడను మోపారు
పరాయి పాపము?
నా పుణ్యజీవితంపై పడ్డ
ఈ అన్యాయపు ముద్ర
ఈ కారాగారపు గోడలలో
విధిలిఖితపు క్షాత్రం!
ఏకాంతపు ఈ వేళ,
గతకాలపు మధురిమలు
కళ్లముందు నాట్యమాడును,
స్వర్గతుల్యపు సంతోషాలు.
కానీ, ఈ శిలాకవచపు చెరలో,
ఆశాకిరణం మరుగై,
నలిగిపోయిన నా ఆత్మ,
నిట్టూర్పుల నివేదనై.
నా నయనాల నుండి జారే
ఈ లవణజల ధార,
సాక్ష్యమిస్తుంది, నను బలిగొన్న
కపట నాటకపు భార.
వారి కుటిల బుద్ధి,
ధనాశ పెంచిన ద్రోహం,
నిరాధారమైన ఈ దారుణ
శిక్షకు నన్ను చేసెను బాధితుణి.
"ధర్మదీక్ష ఎక్కడ?"
ఈ మౌన ఘోష నా నాడులలో,
పాతాళమంత లోతుగా దాగిన
దుఃఖాగ్ని ఈ గుండెలో.
బయట స్వేచ్ఛాగానం చేయాల్సిన
నా కల్పనలు, ఇక్కడ లోహపు
కటకటాల వెనుక నిర్జీవ ప్రతిమలు.
ఎవరికి వినిపించను
ఈ మిథ్యా తీర్పు వెనుకటి సత్యవేదన?
ఏ పరాత్పరుడు ఆలకిస్తాడు,
ఈ ఏకాంత బంధనపు నిశ్శబ్దం?
అయిననూ, సత్యశోధనకై
ఈ దీనదృష్టి, ధర్మం విజయం
సాధిస్తుందన్న అచంచల విశ్వాసం నా అస్తి.
ఈ దాస్యపు సంకెళ్లు తెగి,
నిర్దోషినని నిరూపించుకోవాలని,
నిత్య నూతన ప్రభాతం కోసం
ఎదురుచూస్తున్నది నా జీవితం!

- సంటి అనిల్ కుమార్

# రైజింగ్ తెలంగాణ 2047తో విద్యారంగం అభివద్ధి సాధ్యమేనా?

తెలంగాణ ఏర్పాటు దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత, "2047 కల్లా అభివద్ధి చెందిన రాష్ట్రం" అనే భారీ లక్ష్యాల బాటలో ప్రభుత్వం సాగుతోందని ప్రకటిస్తోంది. 'రైజింగ్ తెలంగాణ 2047' అనే దిశానిర్దేశక పత్రం కూడా విడుదల చేసింది. కానీ, ఆ స్వప్నాల్ని నిజం చేసే అసలైన పునాది విద్యారంగం. ఈరోజు ఏ స్థితిలో ఉందో చూస్తే ఆశ కన్నా ఆందోళనే ముందుకు వస్తోంది. ఒక రాష్ట్రం భవిష్యత్తును నిర్ణయించేది పరిశ్రమలు, రహదారులు, బడ్జెట్ గణాంకాలు కాదు. బడులు, గురువు లు, పరిశోధన, విద్యార్థుల భద్రత, సమానమైన అవకాశాలు. ఇవి బలపడ్డప్పుడు మాత్రమే 2047 లక్ష్యాలు నిజం అవుతాయి. తెలంగాణలో విద్యారంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నీ ఈ స్వప్నానికి అడ్డుతగులుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడి కనిపిస్తున్నారు. గురుకులాలు, సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థలు విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టినా, సీట్లు పెరుగుతున్నాయి కానీ బడ్జెట్ కుదిస్తోంది. ఉన్నత విద్యలో పరిస్థితి మరింత క్లిష్టం యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది ఖాళీలు నింపకుండా సంవత్సరాలు గడిచాయి.

విద్యార్థుల కోసం ప్రభుత్వమే రూపొందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం బకాయిలతో ఊపిరి తీసుకోలేని స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో 2047 లక్ష్యాలను మాటలతో కాదు, బలమైన నిర్ణయాలతోనే చేరుకోగలం. విద్యను వ్యయంగా కాకుండా 'పెట్టుబడిగా' చూడాలి. ప్రతి పాఠశాలలో శాశ్వత ఉపాధ్యాయులు, సైన్స్ ల్యాబ్లు, కంప్యూటర్ ల్యాబ్లు, గ్రంథాలయాలు తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనే మొదటి తరగతి నుంచి ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టటం చేసినా, మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన గురువులు లేకుండా అది నామమాత్రం అవుతుంది.

2025-26 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు 23,108 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 7.6 శాతం మాత్రమే. సిఫారసు చేయబడిన 10 శాతం లక్ష్యానికి చేరలేకపోయింది. రాష్ట్రంలోని 25 వేల పాఠశాలల్లో కనీసం మూడొంతుల పాఠశాలలకు భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి ప్రాథమిక సదుపాయాలు సరిగా లేవు. ఇది బడ్జెట్ కేటాయింపుల దయనీయ స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత మరింత తీవ్రమైంది.

రాష్ట్రవ్యాప్తంగా 5,821 ప్రభుత్వ పాఠశాలలు ఒక్కో ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించే పరిస్థితి ఇంకా కొనసాగుతోంది. టీచర్లు లేక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో 1,800కి పైగా పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాలేదు. విద్యార్థుల లేమి, ఉపాధ్యాయుల లోటు, సదుపాయాల కొరత కలిసి విద్యా వ్యవస్థను క్రమంగా పతనం వైపుకి నెడుతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గురుకులాలు సంక్షేమాన్ని మరిచారు.1092 గురుకులాలు నూతనంగా ఏర్పాటు చేస్తే వాటిలో కనీసం 662 భవనాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. వాటిలో కనీస మౌలిక సదుపాయాలు లేవు, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన సరిపోవడం లేదు, పెరుగుతున్న ధరలకనుగుణంగా ఇప్పటివరకు సవరించి మెస్ ఛార్జీలు ఇచ్చింది లేదు.నాణ్యమైన భోజనం, మౌళిక సదుపాయాలు, తరచూ ఆహారం విషపూరితం కావడం విద్యార్థులు మరణించడం, ఆసుపత్రి పాలు కావడం రాష్ట్రంలో నిత్యకృత్యం అయ్యింది.

రాష్ట్రం ఏర్పడిన నుండి ఇప్పటివరకు యూనివర్సిటీలు నిధులు క్రమంగా తగ్గాయి. అభివద్ధి కోసం కేటాయించిన నిధులు శూన్యం. విద్యార్థులకు మెస్, ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు లేవు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో తరగతి గదులు లేక రేకులు షెడ్డు క్రింద ఫార్మసీ, పాత హాస్టల్ భవనాలు నడుస్తున్నాయి. పాలమూరు ,మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గదులు, తలుపులు విరిగి పోయాయి, త్రాగు నీటి సమస్యలు ఉన్నాయి.జెఎన్టీయు ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్సిటీలు విద్యార్థులకు ప్రధానంగా విద్యార్థినీలకు హాస్టల్స్ లేక ఆందోళనలు చేశారు. ఉస్మానియా



యూనివర్సిటీలో నిజాం నిర్మించిన రేకుల షెడ్ల హాస్టల్స్ లోనే వసతి గృహాలు ఉన్నాయి. పాడుబడిన హాస్టల్స్ పెచ్చులు ఊడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. సరైన భోజన సదుపాయాలు లేవు, వైద్య, వసతి సదుపాయాలు లేవు, అనేక సార్లు నాణ్యమైన భోజనం కోసం ఉస్మానియా విద్యార్థినీలు రోడ్డెక్కారు.

2013 నుండి ఇప్పటి వరకు రాష్ట్ర యూనివర్సిటీలలో నియామకాలు లేవు. రాష్ట్ర యూనివర్సిటీలలో కేవలం 24 శాతం మంది మాత్రమే రెగ్యూలర్ పోస్టులు ఉన్నాయి.76 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెగ్యూలర్ పోస్టులు భర్తీ లేకపోవడంతో కాంట్రాక్టు, పార్ట్ టైం పద్ధతిలో అధ్యాపకులను భర్తీ చేశారు. రాష్ట్రంలో 1365 మంది కాంట్రాక్టు,700 మంది పార్టు టైమ్ అధ్యాపకులు వర్సిటీలో పని చేస్తున్న వారికి కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు.రెగ్యూలర్ అధ్యాపకులు లేరని కోర్సులు మూసివేస్తున్న దుస్థితి కనపడుతుంది. 2828 పోస్టులు మంజూరు కాగా 1869 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు కాదు, కనీసం చదువుకునే అవకాశం లేకుండా పోతుంది.

దేశంలో మొట్టమొదటి బాషా యూనివర్శిటీ తెలుగు యూనివర్శిటీలో కేవలం 03 రెగ్యూలర్ పోస్టులే ఉన్నాయి. తెలుగు యూనివర్శిటిలో తెలుగు ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. రైజింగ్ తెలంగాణ 2047 పేరుతో విదేశీ యూనివర్సిటీలను తెలంగాణకు ప్రభుత్వ ఆహ్వానిస్తుంది. ఒక పక్క ఉస్మానియాను స్టాన్ఫోర్డ్, మరోపక్క కాకతీయను ఆక్స్ఫర్డ్ గా మారుస్తామని చెబుతూనే రాష్ట్రంలో విద్య కేంద్రీకరణ విధానానికి కాంగ్రెస్ పూనుకుంటుంది. రాష్ట్రంలో విద్యా కార్పొరేటీకరణ, వాణిజ్యీకరణ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే కుట్రలకు పాల్పడుతుంది. విదేశీ యూనివర్సిటీలను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు చేసుకోవడానికి తలుపులు బార్లా తెరిచి ఆహ్వానిస్తుంది. ఆస్ట్రేలియా, జర్మనీ, యూకే దేశాల నుండి యూనివర్సిటీలను తెలంగాణలో ఏర్పాటు చేయమంటూ విదేశీ యూనివర్సిటీలకు ఆహ్వానాలు పంపి తెలంగాణలో ఆప్ క్యాంపస్లను ఏర్పాటు చేయాలని కోరడమంటేనే తెలంగాణ విద్యా రంగాన్ని కార్పొరేట్, విదేశీ కబంధహస్తాలకు అప్పగించే ప్రయత్నం చేయడమే. ప్రధాన మానవ అభివద్ధి సూచికలైన ప్రభుత్వ విద్య, వైద్యాన్ని పరిగణలోకి తీసుకోకుండాప్రభుత్వాలు ఎన్ని 'విజన్ డెవలప్‌మెంట్' ప్రణాళికలు రూపొందించినా మంచి ఫలితాలు రావని పలు అనుభవాలు చెపుతున్నాయి. ప్రాథమికమైన ప్రజా సేవలు ముఖ్యంగా ఒక వైపు విద్యకు తగిన నిధులు కేటాయించక పోవడం మరో వైపు పెద్ద ఎత్తున నగరాభివద్ధి ప్రణాళికల ప్రాజెక్టులతో సామాన్యులకు ఒరిగేది ఏమి ఉండదు.

విద్యా రంగంలో ప్రైవేటీకరణ పట్టు మరింత బలపడుతోంది. తెలంగాణలో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థులలో 57 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇది 50 శాతానికి పైగా ఉంది. అంటే పేద కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల నాణ్యతపై నమ్మకం కోల్పోయి వాణిజ్య విద్య వైపుకి మళ్లిపోతున్నాయి. ఈ ధోరణి "విద్య అందరికీ" అనే ప్రజాస్వామ్య లక్ష్యాన్ని దెబ్బతీస్తోంది. విద్యార్థి హక్కు మార్కెట్‌లో వస్తువుగా మారిపోతోంది.

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం విద్యలో అసమానతలు, నాసిరకమైన నాణ్యత కొనసాగితే అభివద్ధి అసంపూర్ణంగానే ఉంటుంది. 'రైజింగ్ తెలంగాణ 2047' విజయం విద్య ద్వారానే సాధ్యం.పేద ధనిక తేడా లేకుండా పిల్లలందరూ ఏ నివాస ప్రాంతాలలో నివసిస్తున్నారో అదే పరిసరాలలో ఉన్న విద్యాసంస్థకు మాత్రమేపోవాలనే చట్టం తేవాలి. అంటే ఆ నివాస ప్రాంతంలో నివసించే ముఖ్యమంత్రి మనవడు, ఆ ప్రాంతం లో నివసించే రోజు కూలీ కూతురు ఒకే బడికి ఒకే తరగతి గదిలో చదువుకుని నాణ్యమైన విద్యను అందుకున్నప్పుడే "రైజింగ్ తెలంగాణ 2047"కలను సాకారం చేస్తుంది.

పాఠశాల, యూనివర్సిటీలు, సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వ రంగంలో ఇంగ్లీష్ విద్యలో సౌకర్యాలు కల్పించి నడిపినపుడు, నిధులు అందించినపుడే అసలైన లక్షాలను సాధించగలము.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను సమయానికి విడుదల చేయకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతుంది. విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించే విధానం లేకుండా 2047 వంటి లక్ష్యాలు కాగితాలపైనే ఉంటాయి. కాబట్టి ప్రతి విద్యార్థికి ఫీజులను సకాలంలో విడుదల చేయాలి. విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి. విద్యార్థి సంఘాల ఎన్నికలు పునఃప్రారంభించాలి. విద్యార్థుల అభ్యంతరాలు, అవసరాలు నేరుగా వ్యవస్థకు చేరాలంటే ఇదే ప్రజాస్వామ్య మార్గం.గ్రామీణ, నగర వైషమ్యాన్ని తొలగించాలి. పట్టణాల్లోని కార్పొరేట్ పాఠశాలలు ఒక ప్రపంచం, గ్రామ పాఠశాలలు మరో ప్రపంచంగా విడిపోయిన వాస్తవం కొనసాగితే సమాన అభివద్ధి అసాధ్యం. ప్రతి గ్రామ పాఠశాల కూడా కనీసం జిల్లాలోని మంచి ప్రభుత్వ పాఠశాలకు సమాన మౌలిక సదుపాయాలు కలిగి ఉండాలి.'రైజింగ్ తెలంగాణ' అనే నినాదం ఆకర్షణీయ మే. కానీ ఆ నినాదం భవిష్యత్తును మార్చాలంటే పునాది బలంగా ఉండాలి. రేపటి తెలంగాణను తీర్చిదిద్దేది పరిశ్రమలు కాదు. ఈరోజు చదువుతున్న పిల్లలు, మెరుగైన విద్య కోరుతున్న యువత. వారి విద్య హక్కు కేవలం పత్రాల్లో కాకుండా వాస్తవంగా చేరాలనే సంకల్పం ప్రభుత్వం చూపితేనే 2047 లక్ష్యాలు చేరుకోగలం. టెక్నాలజీ, జ్ఞానం, పరిశోధన, సమాన అవకాశాలపై ఆధారపడిన విద్యా పునర్నిర్మాణం జరిగితేనే తెలంగాణ నిజంగా రైజ్ అవుతుంది. లేకపోతే "2047" కూడా మరో రాజకీయ నినాదంగానే మిగులుతుంది.అమెరికాలో ప్రతి రైతు పొలంలోనే 'గ్రెయిన్ బిన్' ఉంటుంది. ఆక్సిజన్ లెవల్ తగ్గించి ధాన్యాన్ని 5-10 ఏళ్లు కూడా నిల్వ ఉంచుతారు. చైనా గత 10 ఏళ్లలో 1 లక్ష కొత్త ఆధునిక గిడ్డంగులు నిర్మించింది. ఇప్పుడు వారి నిల్వ సామర్థ్యం 20 కోట్ల టన్నులు. బ్రెజిల్, ఆర్జెంటీనాలు పీపీపీ మోడల్‌లో ప్రైవేటు కంపెనీలతో కలిసి 'సిలో బ్యాగ్' టెక్నాలజీని రైతులకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షలతో అందిస్తున్నాయి. థాయ్‌లాండ్, వియత్నాంలో రైతు సొంతంగా గిడ్డంగు లేకపోతే గ్రామంలోని కో-ఆపరేటివ్ సొసైటీ ఉచితంగా నిల్వ సౌకర్యం ఇస్తుంది.



టి. నాగరాజు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
ఫోన్:9490098292

## నన్నా దరి చేర్చు..

బలిపీఠం మీద నేను..
పేగులెండుకు పోయిన
పేదల ఆకలి బతుకుల్ని
ప్రపంచ విఫణిలో
హర్రాజుకు పెట్టిన
బేహారులు పాలకులు...
ప్రజల బిడ్డల
సుందర భవితకు
ఉరి తాళ్ళు బిగిసే తలారులు
సాంప్రదాయ సర్వ సంఘాలు...
కళ్ళ ముందు జరిగే
కిరాతకాలను కళ్ళారా చూస్తూ కూడా
చేష్టలుడిగి శవాలకు తేడాలేకుండా
నిలుచుండి పోయిన
నిర్జీవ నిష్ఫల సాక్షులు.. మార్పును
మాయా మహత్తుగా..
ఆరాధించడంలో
తలమునకలైజి
తరించి పోతున్న
ప్రత్యామ్నాయ
సమైక్య సంఘాలు...
తరాలుగా బందిఖానాలో
పలుపు తెంపుల
పెనుగులాటలో నేను..
ఈ బంధనాలు
బద్దలు కొట్టి.. నా ఖైదును
విముక్తి చేసే నా నిజమైన బిడ్డలకోసం..
కనుమూయక
కొడిగట్టక
మినుకు మినుకు
వెలుగు దివ్వెను..
మిణుగురు ఆశల
ఎనుబది ఏళ్ల భారత
విద్యారంగాన్ని నేను..
దారులన్నీ
బహిరంగ బజారులకు
సంధింపబడిన
సంధికాలంలో..
సంక్షోభ కడలి చిక్కితి
నా వొడి అంతా
గాయాలమయమే..
నా బతుకంతా
ద్రోహాలమయమే..
నన్నెత్తుకు
ఎద హత్తుకు
కన్నీళ్లను కడతేర్చు..
విముక్తి పతాక
రెపరెపలీనే
తండ్రీ నన్నా దరిచేర్చు...

డా. ఇక్బాల్ పాషా
9440775732

# అల్వాల్‌లో అదుపు తప్పుతున్న అక్రమ నిర్మాణాలు

- నోటీసుల హడావిడి చర్యలు శూన్యం
- జనావాసాల మధ్యే భారీ షెడ్‌ల నిర్మాణం
- సీజ్ చేసిన భవనంలోనే మళ్లీ పనులు

**అల్వాల్, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** అల్వాల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు ఆగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు, అదనపు అంతస్తులు, వాణిజ్య శట్టర్లు నిర్మాణం కొనసాగుతున్న మున్సిపల్ శాఖల చర్యలు కేవలం నోటీసుల వరకే పరిమితమైపోయాయని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**జనావాసాల మధ్యే భారీ షెడ్లు..**

మచ్చబొల్లారం స్విమ్మింగ్‌పూల్ రోడ్‌లో అనుమతుల్లేకుండా భారీ స్టీల్ షెడ్ నిర్మాణం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి అక్రమ షెడ్లు అల్వాల్ సర్కిల్‌లో ఇతర చోట్ల కూడా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నివాస ప్రాంతాల్లో ఇలాంటి నిర్మాణాలకు అనుమతులు లేనప్పటికీ పనులు నిర్బంధం



లేకుండా సాగుతుండటం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది.

**సీజ్ చేసిన భవనంలోనే మళ్లీ పనులు**

వెంకటాపురం యాదమ్మనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్, అదనపు అంతస్తు నిర్మాణం కారణంగా జీహెచ్‌ఎంసీ భవనాన్ని సీజ్ చేసినా యజమాని తాళాలు పగులగొట్టి మళ్లీ పనులు మొదలెట్టాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. "సీజ్ చేసిన భవనంలో కూడా ఇంత బహిరంగంగా పనులు జరుగుతుంటే అధికారుల దృష్టి ఎక్కడ?" అని వారు ప్రశ్నిస్తున్నారు.

**నోటీసుల పేరిట వసూళ్ల ఆరోపణలు**

"నోటీసు పెట్టడం తర్వాత డబ్బులు వసూలు చేయడం ఇదే రూటీన్" అని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పెత్తందారీపై ఎవరూ చెక్ వేయకపోవడంతో నివాస ప్రాంతాలు క్రమంగా గోదాంలుగా మారిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహదారి రద్దీ, అగ్ని భద్రత, ప్రజా రక్షణపై తీవ్ర ప్రభావం పడుతోందని చెబుతున్నారు.

**ఉన్నతాధికారుల జోక్యమే మార్గం**

"రాజకీయ అండదండలతోనే ఈ అక్రమాలు పెరుగుతున్నాయి. లేదంటే జనావాసాల మధ్యే ఇంత పెద్ద నిర్మాణాలు ఎలా సాగుతాయి?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, డీసీ, జోనల్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## దేవరయాంజాల్‌లో ఓజోన్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం



**శామీర్‌పేట్, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** దేవరయాంజాల్‌లో ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఆర్టీఏ మెంబర్,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేద మరియు అవసరమైన ప్రజలకు ఎన్నో విధాలుగా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. శిబిరంలో ఓజోన్ హాస్పిటల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ వీరన్న, వైద్యులు బాలాజీ ప్రసాద్,రమేష్, మునిసాహిత్, సంపూర్ణ, అనుష పాల్గొని బీపీ,షుగర్, ఈసీజీ,కంటి సంబంధిత పలు పరీక్షలు నిర్వహించారు.ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.శిబిరాన్ని నిర్వహించిన వైద్య సిబ్బందిని నాయకులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం ధర్మకర్తలు వలందాసు మురళి గౌడ్, గుడిసేని హరికృష్ణ,మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి,నాయకులు బంగారి గళ్ళ శంకర్, మిర్యాలకర్ సాయి కుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్,జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వజ్జల శేశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని పాటించాలి



**మొయినాబాద్, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** నేటి సమాజంలో ప్రజలు సనాతన ధర్మాన్ని పాటించినప్పుడే శాంతిభద్రతలు కాపాడుకొగలుగుతామని, సనాతన ధర్మంతో మానవుల్లో భక్తిభావన, ప్రశాంతత నెలకొంటుందని, తెలంగాణ రాష్ట్ర హిందూదేవాలయాల అర్చకుల సంఘం అధ్యక్షులు, చిలుకూరు బాలాజీ పూజారి రంగరాజన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో కేబీసీ కుటుంబ సభ్యులు నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ రమేష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా విధానాన్ని లంగర్ హౌస్ గణపతి గురుస్వామి, సురేష్ గురుస్వామిల కారకములచే నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుమారస్వామి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించి నైవేద్యంతో మహా మంగళహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజలలో భక్తి పెరిగినప్పుడే మానవుడికి మనశాంతి, ప్రశాంతత నెలకొంటుందన్నారు. పాఠశాలలను దేవాలయాలుగా కొలవడం అందులో క్రమ శిక్షణ, విద్య, విజ్ఞానం నేర్చుకుంటారన్నారు. అదే విధంగా దేవాలయాలలో దైవ దర్శనంతో పాటు ప్రశాంతత, మనశాంతి లభిస్తుందని సూచించారు. ప్రజలు అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమంలో కేబీసీ కుటుంబ సభ్యులు, మండల విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షులు నర్సింహ్మాచారి, రవీందర్ చారి, శంకరాచారి, రమేష్ చారి, సిద్ధప్ప చారి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, మాజీ సర్పంచ్లు అమర్నాథ్ రెడ్డి, నరోత్తంరెడ్డి, బూర్గు రవళిగోపికృష్ణారెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్య, వివిధ ప్రాంతాల నుంచి, గ్రామాల నుంచి వేలాధి మంది భక్తులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సిబ్బంది కొరత

- గంటల కొద్ది రిజిస్ట్రేషన్ ప్రక్రియ

**మల్కాజిగిరి, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యకలాపాలలో సరళీకరణ తెచ్చామని చెబుతున్నా, మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. సిబ్బంది కొరత కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ గంటల కొద్దీ ఆలస్యం అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ రెడ్డిపల్లి శ్రీకాంత్ ఒక్కరే అన్ని పనులు చూసుకోవాల్సి వస్తుండటంతో, ప్రతి రిజిస్ట్రేషన్‌కు సుమారు రెండు గంటల సమయం పడుతోంది. ఉదయం 10 గంటలకు స్లాట్ సమయం ఉన్నా, సబ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యంగా 11:30 గంటలకు కార్యాలయానికి రావడంతో ఆయన కొరకు ప్రజలు వేచి చూడాల్సి వస్తుంది. సిబ్బంది లేకపోవడంతో మార్కెట్ విలువ, ఈసీ, సీసీ, వివాహ ధ్రువపత్రాల జారీలో నాలుగైదు రోజులు, రిజిస్ట్రేషన్ దస్తావేజుల స్కానింగ్‌లో మూడు రోజులు ఆలస్యం అవుతోంది. ఉప్పల్ నుండి ఈ మధ్యనే బదిలీపై వచ్చిన మహేష్ ఈ-కేవైసీ వంటి సాంకేతిక సమస్యలు చూపించి




గంటల తరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్లాట్ విధానం లక్ష్యం పూర్తిగా దెబ్బతింటోందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు కార్యాలయంలో అమలు కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ఈ సమస్యలపై జిల్లా రిజిస్ట్రార్ తక్షణమే దృష్టి సారించి, సిబ్బందిని భర్తీ చేయాలని మరియు విధులను నిర్లక్ష్యం చేస్తున్న సబ్ రిజిస్ట్రార్, ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలి




**చేవెళ్ల, డిసెంబరు 6 (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని, చేవెళ్లపోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు సమగ్రంగా కొనసాగేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ ఉపేందర్ పర్యవేక్షణలో, పోలీసు సిబ్బందితో కలిసితేదీ శనివారం సాయంత్రం 6 గం.నుండి 8 గం. వరకు ఈర్లపల్లి, ఎన్కేపల్లి, గొల్లగూడ, కమ్మేట, గొల్లపల్లి మరియు ధర్మసాగర్ గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు అందరూ భయభ్రాంతులకు గురికాకుండా, ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాల్లో పర్యటన చేస్తూ ప్రజలకు చట్టం చేతిలో ఉందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ ఉపేందర్ హెచ్చరించారు. పోలీసులు ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అనుచిత కార్యకలాపాలు, బెదిరింపులు, గుంపుల గొడవలు సహించబో మన్నారు. మద్యం పంపిణీ, డబ్బు పంపిణీ, ఇతర అక్రమ ప్రయోజనాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణనే ప్రధాన లక్ష్యం



**కొడంగల్, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** ఎన్నికల నేపథ్యంలో ప్రజలలో ధైర్యం నింపడమే ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశంతో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) శ్రీధర్ రెడ్డి రాబోయే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే లక్ష్యంతో, కొడంగల్ మండలంలోని క్రిటికల్ గ్రామాలుగా గుర్తించబడిన ప్రాంతాలలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావులపల్లి, అంగడిరాయచూరు, రుద్రారం, హస్నబాద్, పర్సాపూర్ గ్రామాలలో కొడంగల్ సర్కిల్ పోలీస్ సిబ్బందితో పాటు, టీజీఎస్పీ (తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్) మరియు ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) పోలీస్ సిబ్బంది కలిసి ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా గుర్తించబడిన ఈ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని సీఐ శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు.పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలలో ధైర్యాన్ని పెంచి,చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే వారికి బలమైన హెచ్చరిక పంపడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కలిసికట్టుగా కృషి చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** అంబేద్కర్ ఆశయ సాధనకు కలిసికట్టుగా కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం తాండూరు మండల కోటబాస్ పల్లి మరియు సంగెంకాలాన్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పైలెట్ రోహిత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు భారతదేశంలో రక్షణ కల్పించిన మహానీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. బలహీన వర్గాల రిజర్వేషన్ కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. పేద వర్గాలు కొంతమేర అభ్యున్నతి సాధించారంటే అది అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే సాధ్యం అన్నారు. అంబేద్కర్ లాంటి మేధావి భారతదేశంలో పుట్టడం గర్వకారణ మన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.భారత జాతి ఉన్నంతకాలం అంబేద్కర్ ను గౌరవించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ స్వరూప వెంకట రామ్ రెడ్డి, నాగార్జున, సురేందర్ రెడ్డి, మొగులప్ప సాయి రెడ్డి, రత్నాకర్, రాజేందర్ రెడ్డి తదితరులున్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** డా.బిఆర్.అంబేద్కర్ ప్రపంచ మేధావి అని ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం డా.బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కెద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాతగా డా.బిఅర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగం మన దేశానికి ఆత్మ, ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని, న్యాయాన్ని అందించిన మహనీయుడు సామాజిక విప్లవకారుడిగా అంటరానితనం, కులవివక్ష అనే చీకట్లను పారద్రోలి, కోట్లాది మంది అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఆశాదీపం.?న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా ఆయన మేధస్సు, ఆలోచనలు నేటికీ ఎంతోమందికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.?ఆయన చూపిన మార్గంలో పయనించడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, పార్టీ నాయకులు సున్నపు వసంతం, మర్పల్లి క్రిష్ణా రెడ్డి, మున్సిపల్ పట్టణ



అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, చేవెళ్ల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ కుమార్, నర్సింహులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మోడల్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమం

**చేవెళ్ల, డిసెంబరు 6 (జనంసాక్షి) :** విద్యార్థులు సైన్స పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు సాధించాలని శ్రీహరికోట శాస్త్రవేత్త రఘునందన్ కుమార్ అన్నారు. చేవెళ్ల పట్టణకేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ లో శనివారం తెలంగాణ మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. ఈ కార్య్రమానికి ముఖ్య అతిథిగా శ్రీహరి కోట శాస్త్రవేత్త రాఘునందన్ కుమార్, రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి, జిల్లా విద్యాధికారి శుషిందర్ రావు లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఈ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహరికోట శాస్త్రవేత్త రఘునందన్ కుమార్ జ్యోతిప్రజ్వాలన చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను తిలికించి విద్యార్థులను అభినదించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త రాఘునందన్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు సైన్స పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు సాధించే విధంగా విద్యార్థులు తయారు కావాలని పిలుపునిచ్చారు. భారత అంతరీక్ష పరిశోధన రంగం నూతన ఆవిష్కరణల కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. భారత అంతరీక్ష పరిశోధనలు 2035 సంవత్సరం నాటికి ప్రపంచంలోనే భారత



దేశం మొదటి స్థానంగా రూపాంతరం చెందేవిధంగా కార్యచరణ కొనసాగుతుందన్నారు. ఎంతో మంది శాస్త్రవేత్తల శ్రమ కృషి వలనే ఉపగ్రహలు నింగిలోకి పంపించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి వైర్లెస్ లేకుండానే అంతర్జాల సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. చంద్రయాన్ 1, చంద్రాయన్ 2, చం ద్రయాన్ 3 విజయవంతంగా నింగిలోకి పంపించడం జరిగిందన్నారు. కాగా చంద్రాయన్ 4ను నింగిలోకి పంపి పరిశోధన దిశగా కార్యచరణ శ్రీహరికోటలో సిద్ధం అవుతుందన్నారు. సముద్రంలో వస్తున్న మార్పుల మూలంగానే తుపాన్లు వస్తునాయన్నారు. తుఫాన్లు వలన ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. ఈనెల 15వ తేదిన ఎల్వీఎం మిషన్ (6 లక్షల 40వేల కిలోల) నింగిలోకి పంపబోతున్నమన్నారు. అలాగే 19వ తేదిన 3ఐ అట్లాస్ ను నింగిలోకి పంపబోతున్నామరు. విద్యార్థులకు టీవిల్లో చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఇస్రో ప్రోత్సహిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో స్పేస్ టెక్నాలజీకే ఫ్యూచర్ ఉండబోతుందన్నారు. అంతకు ముందు. రాష్ట్ర తెలంగాణ మోడల్ స్కూల్ అడిషినల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు లు మాట్లాడుతూ...మొత్తం 194 మోడల్ స్కూల్ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్లో పాల్గొంటున్నారని చెప్పారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేయాలని సూచించారు. విద్యార్థులు సాంతికేతిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతోఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధకారి పురంధాస్, రాష్ట్ర స్థాయి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జంగయ్యకు సబితా రెడ్డి నివాళి

**మొయినాబాద్, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** మొయినాబాద్ మండల పరిధిలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన జంగయ్య గుండెపోటుతో మరణించాడని, సమాచారం అందడంతో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పెద్దమంగళారం చేరుకొని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గుండెపోటుతో మృతి చెందిన జంగయ్య మృతదేహం వద్ద శనివారం రాత్రి సబితారెడ్డి



నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి అనేక దశాబ్దాలుగా జంగయ్యతో తమ కుటుంబానికి ఉన్న అనుభందాన్ని గుర్తుచేసుకున్నారు. జంగయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంత్ రెడ్డి,మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తం రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి,టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ నాయకులు కొత్త నర్సింహా రెడ్డి, మాధవ రెడ్డి, మహబూబ్ , మాణిక్య రెడ్డి, శ్రీధర్ గౌడ్, లక్ష్మి నారాయణ, నర్సింహా రెడ్డి, పరమేష్ , ప్రవీణ్, రవి తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07 డిసెంబర్ 2025

# శాంతిభద్రతల పరిరక్షణలో హెూంగార్డుల పాత్ర అపూర్వం

● జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** ప్రజాభద్రత, విపత్తు ప్రతిస్పందన,ట్రాఫిక్ నియంత్రణ,శాంతిభద్రతల నిర్వహణ వంటి విభాగాల్లో హెూమ్ గార్డులు అందిస్తున్న సేవలు అత్యంత అభినందనీయమైనవని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు.శనివారం హెూంగార్డ్స్ 63వ ఆవిరావే దినోత్సవం సందరరేగా జిల్లా పోలీసు కార్యాలయం సమావేశం భవనంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,ఆవిరావే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా హెూంగార్డులు జిల్లా ఎస్పీ కి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందరరేగా ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 137 మంది హెూం గార్డులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖకు బలమైన అండగా నిలుస్తున్నారు.ప్రజల రక్షణ, అంతర్గత భద్రతలో పోలీసుశాఖకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో 1946 డిసెంబర్ 6న స్వఛరేద ఏర్పాటైనదే హెూంగార్డ్ వ్యవస్థని అత్యవసర పరిస్థితుల్లో,శాంతిభద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో పోలీసుశాఖ చేస్తున్న కృషికి అదనపు బలం అందించేందుకు స్వఛరేద సేవాభావంతో పనిచేసే,శిక్షణ పొందిన సిబ్బందే హెూంగార్డ్స్ అని, హెూంగార్డ్స్ కూడా పోలీసువ్యవస్థలో భాగమని,వారిసంక్షేమానికి పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. హెూంగార్డ్స్ సిబ్బంది రోజువారీ వేతనాన్ని 921 నుండి 1000కి పెంచడం, పరేడ్ అలవెన్స్‌ను 100 నుండి 200కు పెంచడం జరిగింది. ఆరోగ్య పరిరక్షణ కోసం ఆక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సహకారంతో 33 లక్షల హెల్త్ కవరేజ్ అందించబడుతోంది.పోలీసు సిబ్బందితో సమానంగా రైన్ కోట్,ఉలెన్ జాకెట్ వంటి అవసరమైన సామగ్రి అందించబడం జరుగుతుంది. యాక్సిడెంటల్ భీమా ప్రయోజనాలు అందిస్తూ,అసాధారణ మరణం పొందిన హెూంగార్డ్ కుటుంబాలకు ఒక్కొక్కరికీ 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయబడం జరుగుతుంద అన్నారు.పోలీసు సాలరీ ప్యాకేజ్‌లో భాగంగా యాక్సిడెంటల్ డెత్‌కు 30 లక్షలు, ఇద్దరు పిల్లల చదువుకోసం ఒక్కొక్కరికి 2 లక్షలు ఆర్థిక ప్రయోజనం కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.అలాగే రాజీవ్ ఆరోగ్య శ్రీ మెడికల్ సర్వీసుల కోసం ప్రతిపాదన పరిశీలనలో ఉందని అన్నారు. అర్హత కలిగిన హెూంగార్డ్ సిబ్బందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మంజూరుపై పరిశీలన కొనసాగుతోందని, త్వరలో కొత్త హెూంగార్డ్స్ నియామకాలు చేపట్టడానికి సన్నహకాలు జరుగుతున్నాయని అన్నారు.పోలీసు కానిస్టేబుళ్లకు ఏమాత్రం తీసిపోకుండా, మీకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాలని, విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన హెూంగార్డ్ సిబ్బందిని రివార్డ్స్ ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్ నివారణ,కమ్యూని టీ పోలీసింగ్, విపత్తు నిర్వహణ వంటి విభాగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తు అత్యవసర పరిస్థితుల్లో హెూమ్ గార్డులు చూపే అంకితభావం ప్రశంసనీయం అన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు.ఈ యొక్క కార్యక్రమం హెూమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పి,వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పి,బాలాజీ నాయక్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, వినోద్, హెూంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకై కృషి చేద్దాం

● ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.అంబేద్కర్ వర్ధంతి సందరరేగా వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదనిఅంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

● జిల్లా విద్యాధికారి విజయ



**మెదక్, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా విద్యాధికారి విజయ అన్నారు. జిల్లాలోని కొల్చారం మండలంలో మూడో విడతలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా విద్యాధికారి విజయ సందర్శించారు. ఈ సందరరేగా జిల్లా ఎన్నికల మాస్టర్ శిక్షకులు జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ పోలింగ్ రోజుకు ఒకరోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 9 గంటల లోపు చేరుకొని సంబధిత పోలింగ్ కేంద్రం యొక్క మెటీరియల్లు తీసుకుని చెక్ చేసుకోవాలి. అనంతరం పోలీస్ ఎస్కార్ట్ సాయంతో జోనల్ ఆఫీసర్ వెంబడి సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి అదే రోజు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. పోల్ డే రోజు ఉదయం 7 గంటలకు పోలింగ్ ను ప్రారంభించాలి మధ్యాహ్నం 1 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ ను సీలు వేయాలి అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారి సమక్షంలో కౌంటింగ్ ను ప్రారంభించాలి. అదే రోజు పోలింగ్ పూర్తయిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తి చేసుకున్న తర్వాత బ్యాలెట్ బాక్స్ లను మెటీరియల్లు రిసెప్షన్ సెంటర్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మాస్టర్ శిక్షకులు వరప్రసాద్ మండల విద్యాధికారి సత్యనారాయణ రావు లు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాలు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

● అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** మీసేవ కేంద్రాల నిర్వహకులు నిబంధనలు అతిక్రమించి ప్రజలు,రైతులు, విద్యార్థుల నుండి అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ హెచ్చరించారు. శనివారం ఈడియం వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 72 మీసేవ కేంద్రాల నిర్వహకులు నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు.అలా కాదని నిబంధనలు అతిక్రమించి ప్రజలు, రైతులు, విద్యార్థుల నుండి అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.అదనపు వసూళ్లకు పాల్పడి మీ సేవ కేంద్రాలను రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.మీసేవ కేంద్రాల నిర్వహకులు తమ కేంద్రాలకు వచ్చే రైతులతో సహృదయంతో మెలిగి వారికి మంచి సేవలు అందించాలన్నారు. ప్రతి మీ సేవ కేంద్రంలో రేట్ చార్టు (ధరల పట్టిక) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.త్వరలోనే ఈడీఎం ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేసి మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు.ఎక్కడైనా నిబంధనలను విరుద్ధంగా వసూళ్లు చేస్తున్నట్లు తేలితే మీ సేవ రద్దు చేయడమే కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.నిర్వాహకులు సమయపాలన పాటిస్తూ గ్రామస్థాయిలో ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో డిఎం,మీసేవ కేంద్రాలు నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఒక్కసారి అవకాశమివ్వండి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా...
● తాళ్లగొమ్మూరు సర్పంచ్ అభ్యర్థి గుమ్మడి కృష్ణవేణి



**బూర్గంపహాడ్, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యమని బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుమ్మడి కృష్ణవేణి తన నివాసంలో శనివారం ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఆమె వెల్లడించారు. ప్రజా బలంతోనే సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను గెలిపిస్తే పంచాయతీలో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వే ఫర్ యు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు గుమ్మడి కృష్ణవేణి తన ట్రస్టు ద్వారా వృద్ధులకు, అనాధ పిల్లలకు తన వంతు సహాయ సహకారాలను అందించడమే కాకుండా అనాధ పిల్లలు కొందరిని తన సొంత ఖర్చులతో చదివిస్తూ తన ఉదారతను చాటుకుని ప్రజలకు అత్యంత చేరువయ్యారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పర్యటిస్తున్న గుమ్మడి కృష్ణవేణి కి ప్రజల నుంచి విశేషంగా ఆదరణ లభిస్తుంది. బీఆర్ఎస్ హయాంలో 500 జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్ అని, మాది కొత్త పంచాయతీ కావడం తనకు కలిసి వచ్చే అంశంగా చెప్పారు. ఒక్కసారి నాకు అవకాశం ఇస్తే ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దుతా.. అంతేకాకుండా ప్రజలకు ఎటువంటి సమస్యలనైనా తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామానికి డ్రైనేజీ వ్యవస్థను, రోడ్లు, వీధిలైట్లు, మంచినీటి సౌకర్యం కల్పిస్తానని, స్మశాన వాటికను నిర్మిస్తానని, పంచాయతీలో నిర్మించిన ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించి వారి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అలాగే ఒక ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడతామని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. తన ఎన్నికల గుర్తు ఉంగరం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గెలిపించాలని కోరారు. తాళ్ల గుమ్మూరు పంచాయతీకి సంబంధించిన వివిధ వర్గాల నాయకులు, ప్రజలు తన ప్రచారంలో పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పంచాయతీ ఒకటవ వార్డు మెంబర్లు 1వ వార్డు చల్ల కోటి జ్యోతి, 3వ వార్డు పసునూటి వీరన్న, 4వ వార్డు ఇర్పా ఆదిలక్ష్మి, 6వ వార్డు సున్నం అశోక్ కుమార్, 7వ వార్డు కొయ్యల ముత్తమ్మ, ఎనిమిదవ వార్డు వడ్డాణపు తిరుపతమ్మ లను మీ అమూల్యమైన ఓటు ముద్రను వేసి గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 11న జరిగే ఎన్నికలలో ఇదే తరహాలో తమ అమూల్యమైన ఓటును ఉంగరం గుర్తుపై వేసి గెలిపించి తద్వారా గ్రామ అభివృద్ధికి కృషి చేసేందుకు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో వార్డు అభ్యర్థులు చల్లకోటి జ్యోతి, పసునూటి వీరన్న, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎన్నికల కోడ్ అమలు

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించ నున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఈ నెల18 వరకు జిల్లా అంతట ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నా యక్ శనివారం ఒక ప్రకట నలో తెలిపారు.మొదటి దశ పోలింగ్ తో పాటు రెండవ దశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందని తెలిపారు.అందువల్ల మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు,ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిం చరాదని ఆమె సూచించారు.ఏకగ్రీవమైన గ్రామపంచా యతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుం దని పేర్కొన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమ య్యేలా చర్యలు తీసుకోవ డంతో పాటు, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ఎన్ని కల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, చివరి దశ ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, అలాగే ప్రజలు ఎంసీసీ నిబంధనలు పూర్తిగా పాటించి సహకరిం చాలని కలెక్టర్ కోరారు.

# నల్గొండ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్..

● అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ బి.ఆర్.ఎస్ నాయకుల రాస్తారోకో



**చండూరు, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** దేవరకొండ లో జరుగుతున్న సీ.ఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు నిరసన వ్యక్తం చేయడానికి బయలుదేతునారని సమాచారం అందుకున్న పోలీసులు నల్గొండ మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డిని చండూరు మండలం అంగడిపేట వద్ద అరెస్టు చేశారు. అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ... బీ.ఆర్.ఎస్ నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీ.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. వెంటనే భేషరతుగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఎన్నికల నియమావళిని పాటించాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** పాపన్నపేట మండల కేంద్రం లోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈసందరరేగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికల కోసం నామినేషన్ పూర్తయ్యాయని,ఆయా గ్రామాల్లో ప్రచారం నడుస్తుందన్నారు. మొదటి విడత ఎన్నికల కోసం డిసెంబర్ 11 న పోలింగ్ ఉన్నందున డిసెంబర్ 10 న ఎన్నికల సిబ్బంది పంపిణీ కేంద్రంకు చేరుకోవాలని ఆదేశించారు. మొదటి విడత లో ఆరు మండలాలో సర్పంచి వార్డు సభ్యులకు జరిగే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా జరగాలని తెలిపారు. మొదటి విడతలో 14 గ్రామపంచాయతీల సర్పంచి,వార్డుసభ్యుల,ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తయిన కూడా ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళి కొనసాగుతుందన్నారు. ఫిర్యాదులు అందితే తనిఖీ నిర్వహించే ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి ఎన్నికల నియమాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో ఎన్నికల నియమాలు పాటించి నిబంధనల మేరకే ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో శాతశాతం ఓటింగ్ జరిగిన పంచాయతీలను ఘనంగా సన్మానించి,ప్రత్యేక బహుమతులు అందిస్తామని తెలియజేశారు. ఓటింగ్ లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. డబ్బు,మద్యం లాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామ,వార్డు అభివృద్ధికీ ఎవరైతే తోడ్పడేవారు ఉంటారో వారిని నిజమైన సర్పంచ్ గా,వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలన్నారు. తహసీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష?వర్ధన్ తదితరులు ఉన్నారు.

# జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలి


● వర్క్ షాప్ చైర్మన్ డాక్టర్ పి. రాములు
● వర్క్ షాప్ కరపత్రం విడుదల



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** ఈ నెల 12 నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెంలో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో ఐక్యూఏసీ, లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఒక్కరోజు జాతీయ వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ పి. రాములు అన్నారు. శనివారం సీసీఈ ఆదేశానుసారం అకాడమిక్ ఆడిట్ నిర్వహణకు హాజరైన మహబూబ్‌నగర్ ఎంవిఎస్ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ హెచ్ఓడి డాక్టర్ కృష్ణ మూర్తి, పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటప్రసాద్‌లతో కలిసి కళాశాల ఆవరణలో వర్క్‌షాప్ బ్రోచర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వర్క్ షాప్ చైర్మన్ డాక్టర్ పి. రాములు మాట్లాడుతూ భారతీయ జ్ఞాన వ్యవస్థపై (ఐకెఎస్) ఒకరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్ తత్వశాస్త్రం, సైన్స్, కళలు, విద్య, ఆరోగ్యం, సాహిత్యం వంటి విభిన్న విభాగాలను కవర్ చేస్తూ భారతదేశపు గొప్ప సాంప్రదాయ జ్ఞానంపై అవగాహన మరియు ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ యొక్క ప్రాథమికాలను పరిచయం చేయడం, ఆధునిక విద్య మరియు పరిశోధనలలో ఐకెఎస్ యొక్క ఔచిత్యాన్ని అన్వేషించడం,ఉన్నత విద్యలో ఐకెఎస్ యొక్క ఏకీకరణ గురించి చర్చించడానికి విద్యావేత్తలు మరియు విద్యార్థులకు ఒక వేదికను అందించడం జరుగుతుందని వివరించారు. వర్క్ షాప్‌లో పాల్గొని విద్యార్థులు అధ్యాపకులు ఈ నెల 11వ తేదీ లోపు తమ పేర్లను https://forms.gle/wy1mk8Dfaorkuav49 లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ సుష్మ, లైబ్రేరియన్ వర్క్ షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వర్కాల శ్రీనివాసులు అధ్యాపక బృందం డాక్టర్ నాగరాజు,శివ, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ స్వప్న, డాక్టర్ నాగలింగం,వెంకటేష్,రమేష్, ప్రవళిత, మహేష్, యాదగిరి, ప్రకాష్, రాములు, నరసింహ,స్వప్న, సీనియర్ అసిస్టెంట్ కవిత, అధ్యాపకేతర బృందం అక్బర్,కురుమయ్య, బాలస్వామి,కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపన కోసం అంబేద్కర్ కృషి

● మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్



**జహీరాబాద్, డిసెంబర్ 6 (జనం సాక్షి) :** భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేత్కర్ సమసమాజ స్థాపనకోసం,అందరికి సమాన హక్కుల కోసం ఎంతో కృషి చేసారని మాజీ మంత్రి జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్. అన్నారు.శనివారం డాక్టర్ అంబెద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ సమాన విద్య,ఆరోగ్యం,ఉపాధి, రక్షణ, నివాసం మరియు భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సమ సమాజనిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు మరియు ఐక్యరాజ్య సమితి సింబల్ ఆఫ్ నాలెడ్జ్ గా గుర్తించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కండెం నర్సిములు,నరసింహారెడ్డి,భీమయ్య ,ఖాజామీయా ,నరేష్ గౌడ్ ,మొయిస జనార్ధన్, జమీల్ ,యూనుస్,రాములు నేత ,జయరాజ్ ,శేఖర్ మాజీ కౌన్సలర్ లు,యూత్ కాంగ్రెస్ నాయకు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఓ, ఎపిఓలు తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శనివారం మామడ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఓ, ఎపిఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. శిక్షకులు అందిస్తున్న శిక్షణ సరళిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో పిఓ ల పాత్ర కీలకమని తెలిపారు. మండలాలవారిగా పీఓలకు, ఎపిఓ లకు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పిఓ లు బాధ్యతాయుతంగా తమ విధులు పూర్తిచేయాలన్నారు. పీఓలకు ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. అధికారులకు సమయపాలన, క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఎన్నికల విధులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ఖచ్చితత్వంతో నిర్వర్తించాలని వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా పైఅధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులపై పీఓలకు పలు ప్రశ్నలు అడిగారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికలు జరగాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పారదర్శక, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం గణపురం మండలంలోని రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, స్టేజి 2 అధికారులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణలో ఏమైనా సందేహాలుంటే సిబ్బంది శిక్షణా తరగతుల్లో నివ్రుత్తి చేసుకోవాలని సూచించారు. 10న పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు అదేరోజు చేరుకుని, 11న పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. 11న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉంటుందని, పోలింగ్ ప్రారంబానికి ముందు ముగిసిన తదుపరి ఏజెంట్లు సంతకాలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ వంటి గంట వరకు ముగుస్తుందని అప్పటికే ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగానికి వేచి ఉన్నట్టుయితే క్యూ లైన్ వెనుక నుండి ముందు వరకు సీరియల్ నంబర్ల స్లిప్పులు జారీ చేయాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తదుపరి 2 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభం కావాలని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డా కుమారస్వామి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు ఎస్ శ్రీధర్, బి.రఘునాధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రెండో దశ ర్యాండమైజేషన్ నిర్వహణ

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా, శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, పలిమెల మండలాలకు సంబంధించి రెండవ దశ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందరేగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విధులు కేటాయించిన పోలింగ్ సిబ్బందికి సకాలంలో నియామక ఉత్తర్వులు అందేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ 9న అన్ని మండలాలలో పోలింగ్ విధులు నిర్వహించే పిఓ, ఓపిఓలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. భూపాలపల్లి 26 సర్పంచ్, 216 వార్డులు, చిట్యాల 26, 218, పలిమెల 8, 62, టేకుమట్ల 25, 198 మొత్తం 85 గ్రామ పంచాయతిలకు, 694 వార్డులకు కలిపి 20 శాతం రిజర్వ్ సిబ్బందితో కలిపి 833 పిఓలకు, 924 ఓపిఓలకు, మొత్తం 1757 మందికి రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్ నందు ర్యాన్డమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ శ్రీలత, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జీపీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ

# ఎన్నికల కోడ్ అమలు

- ఏకగ్రీవ గ్రామాల్లోనూ అమలులో ఎన్నికల కోడ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 6 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నందున, చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఏకగ్రీవ గ్రామ పంచాయతీల్లోను ఎన్నికల కోడ్ యధాతదంగా అమల్లోనే ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చివరి దశ ఎన్నికల ప్రక్రియ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున ఎవరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించవద్దని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు చివరి దశ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించకుండా ఉండేలా ఎన్నికల విధులను నిర్వర్తిస్తున్న అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, చివరి దశ ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్ ను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

# వరంగల్ సీపీని కలిసిన ములుగు ఎస్పీ ఓఎస్డీ



**ములుగు బ్యూరో, డిసెంబర్06 (జనం సాక్షి) :** ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామనాధ్ కేకన్ వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను శనివారం వరంగల్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల మధ్య పోలీసింగ్ సమన్వయం,న్యాయ మరియు శాంతి వ్యవస్థల బలోపేతం,నేరాలు నివారణ చర్యలు మరియు ప్రధాన అపరేషన్ల సమయంలో సమన్వయంతో పనిచేయడం తీసుకోవాల్సిన జాగ్రత్తలు భద్రతా వంటి అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా వచ్చే నెలలో జరుగు మేడారం జాతర ఏర్పాట్లు పోలిసింగ్ ట్రాఫిక్ నిర్వహణ వంటి కీలక అంశాలపై చర్చించారు. మేడారం జాతర విజయవంతం అయ్యేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఎస్పి తెలియచేసారు.

సైబర్ నేరాలు అన్ని వర్గాల ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు,కమ్యూనిటీ పోలీసింగ్,టెక్నాలజీ ఆధారిత దర్యాప్తు పద్ధతులు,మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి విషయాలపై చర్చ జరిగింది. ములుగు జిల్లా పోలీస్ విభాగం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, చురుకైన పోలీసింగ్ ను కమీషనర్ సన్ప్రీత్ సింగ్ అభినందించారు. ప్రజా భద్రత,నేర నియంత్రణ మరియు సమర్థవంతమైన పోలీస్ సేవల కోసం ఇరు జిల్లాల మధ్య పరస్పర సహకారం ఉండాలని అభిప్రాయపడ్డారు.

## మేడారం దేవాలయం పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్

- జాతర సమయంలో పోలీస్ అత్యవసర సేవలకు అనుకూలంగా సూచనలు...



**ములుగు బ్యూరో, డిసెంబర్06 (జనం సాక్షి) :** ములుగు జిల్లా పోలీసు అధికారి కేకాన్ సుధీర్ రామనాధ్ శనివారం రోజున మేడారం గ్రామంలో నిర్మాణం జరుగుతున్న దేవాలయ పునర్నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముందుగా ఎస్పి సమ్మక్క సారలమ్మల దర్శనం అనంతరం పునర్నిర్మాణ పనుల పురోగతిని వివరంగా పరిశీలించారు మేడారం జాతర సమయంలో భారీగా వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవాలయ ఆవరణలో భద్రతా ఏర్పాట్లు,ప్రవేశ నిష్క్రమణ మార్గాలను పోలీసింగ్ అవసరాలు మరియు అత్యవసర సేవల సమన్వయం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పనుల నాణ్యత నిర్మాణ వేగం భద్రతా ప్రమాణాలు అన్నింటిని అడిగిన ఎస్ పి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు. మేడారం జాతర సమయంలో పోలీసులు చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలకు అనుగుణంగా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్ పస్రా సిఐ దయాకర్ సిసిఎస్ సిఐ బండారి కుమార్ సీఐ శ్రీనివాస్ ఇతర ఎస్ఐ లు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 6, (జనంసాక్షి) :** ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో అవినీతి నిరోధక శాఖ డి.ఎస్.పి. జి.మధు, ఇన్స్పెక్టర్ లు ఎం.స్వామి, ఎన్.కిరణ్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 3వ తేది నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ సేవలను పొందడం ప్రతి పౌరుడు హక్కు అని, దేశ పౌరులకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 నంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు గరిష్ట ఖర్చు పరిమితులపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు

- ములుగు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 06(జనంసాక్షి) :** 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల మందికి పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు, అలాగే 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు పోటీ చేయు సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులకు అభ్యర్థుల గరిష‘ ఖర్చు పరిమితులపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు అందిన విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం, గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల మందికి పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీ సర్పంచ్ 2,50,000, 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ 1,50,000, 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల మందికి పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ 50,000, 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీ - ఉపసర్పంచ్ 30,000 ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలని, నిర్ణయించిన పరిమితులకు లోబడి ఖర్చు చేయాలని, ఎన్నికల నియమాలు ఉల్లంఘన చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఖర్చుల పరిశీలన మరియు సంబంధిత పత్రాలు సమర్పణపై సంబంధిత రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామస్థాయిలో ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## రాష్ట్ర, జాతీయ స్థాయిలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ





**గూడూరు, డిసెంబర్ 6 (జనంసాక్షి):** రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగిన గేమ్స్ లో జాతీయ స్థాయిలో ఎంపిక కావడంపై గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. అమృత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ 9వ, తరగతి చదువుతున్న కున్ సాత్ నందిని కబడ్డీ పోటీలలో సబ్ జూనియర్ మరియు జూనియర్ స్థాయిలో నిజామాబాద్ నాగార్జునసాగర్ లలో ప్రతిభ కనబరచి,ఎస్ జీ ఎఫ్ ఐ అండర్ 14 సంవత్సరాల విభాగంలో హైదరాబాదులో ఆడి జాతీయస్థాయిలో సెలెక్ట్ ఐ, జనవరిలో జరిగే జాతీయ టీం తరఫున ఆడుతుందని ఆమె అన్నారు. అదేవిధంగా 7వ,తరగతి చదువుతున్న జాటోత్ హైమావతి అండర్ 14 సంవత్సరాల విభాగంలో షార్ట్ పుట్ ప్రతిభ కనబరిచి, వాలీబాల్ లో పెద్ద పెల్లి లో జరిగిన పోటీలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. 9వ, తరగతి చదువుతున్న వాంకుడోత్ చైతన్య నిజామాబాద్ లో కబడ్డీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయిలో ఆడిందని, అదేవిధంగా జూనియర్ రాష్ట్రస్థాయిలో హైదరాబాద్, నాగార్జునసాగర్ లలో ఆడి మంచి ప్రతిభను కనబరిచిందని అన్నారు. తమ పాఠశాల విద్యార్థినిలు రాష్ట్ర జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.అమృత వార్డెన్ వరలక్ష్మి,ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు జి లక్ష్మి, ఉపాధ్యాయ బృందం అంతా ప్రోత్సహించి అభినందించారు.

# పెరిక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాధాకృష్ణ
- వరంగల్ జిల్లా పెరికకుల అధ్యక్ష, కార్యదర్శులుగా అచ్చ వినోద్ కుమార్, చింతం యాదగిరి ఎన్నిక



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 06 (జనం సాక్షి) :** సకల సామాజిక రంగాల్లో పెరిక కులస్తులు అభివృద్ధి చెందడం కోసం తెలంగాణ పెరిక కుల రాష్ట్ర కమిటి కృషి చేస్తుందని, ప్రభుత్వ పెద్దల సహకారం తీసుకొని ప్రతి జిల్లాకు ఒక పెరిక కుల ఆత్మగౌరవ భవనం నిర్మించి అందులో విద్యార్థుల కోసం వసతి గృహాలను నిర్మించి పెరిక కుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆక రాధాకృష? తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రం పెరిక వాడ ప్రతాపరుద్ర ఫంక్షన్ హాల్ లో దిడ్డి నరేందర్ అధ్యక్షతన జరిగిన వరంగల్, హనుమకొండ జిల్లాల పెరిక కమిటి ఎన్నిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐక్యత ద్వారనే ఏదైనా సాధించవచ్చని, రాష్ట్ర కమిటి చొరవతో పెరిక కుల ప్రజలను విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. రాజకీయ రంగంలో బి.సి వాటా కోసం జరిగే పోరాటంలో పెరిక కులస్తులను ముందుంచుతామని రాష్ట్ర ముఖ్య సలహాదారు చింతం లక్ష్మీనారాయణ అన్నారు.

### పెరిక కుల వరంగల్ జిల్లా కమిటి

వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం ముఖ్య సలహాదారుగా దిడ్డి నరేందర్, అధ్యక్షుడుగా అఛే వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చింతం యాదగిరి, గౌరవ అధ్యక్షులుగా బొలుగొడ్డు శ్రీనివాస్, కోశాధికారిగా బేరె శంకర్, ఉపాధ్యక్షులుగా బేరి శరత్, బిళ్ళ కిషోర్, అక్కల రమేష్, ప్రచార కార్యదర్శిగా పోతరాజు రాజేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నంద్రె అమర్, సంయుక్త కార్యదర్శిగా బొలుగొడ్డు ప్రభాకర్, న్యాయ సలహాదారుగా బరుపటి రవిరాజు, మీడియా ప్రతినిధిగా ముద్దసాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా సుంచు జగదీష్, కానుగంటి రాజు, బేర కిషన్, బిల్లా రమేష్, గౌరవ సలహాదారుగా సుంచు కట్టమల్లులను ఎన్నుకున్నారు.

### పెరిక కుల హనుమకొండ జిల్లా కమిటి

హనుమకొండ జిల్లా పెరిక సంఘం అధ్యక్షులుగా న్యాయవాది, సామాజిక ఉద్యమకారులు సాయిని నరేందర్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బోల్ల వీరప్రతాప్, ఉపాధ్యక్షులుగా వనపర్తి రాజన్న, కెత్తె రవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అచ్చ పరమేశ్వర్, కోశాధికారిగా పూజారి జితేందర్, ప్రచార కార్యదర్శిగా ఆడిటర్ పూజారి సత్యనారాయణ, కార్యదర్శులుగా సంగని సాంబయ్య, ఆక జగదీష్, ప్రచార కార్యదర్శిగా అప్పని వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన రెండు జిల్లాల కమిటీ నాయకులకు ప్రొఫెసర్ వద్దే రవీందర్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ సంగని మల్లేశ్వర్, పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి ముత్తయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లక్కర్సు ప్రభాకర్ వర్మ, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ధనేకుల కృష్ణ ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి రంగారావు, కర్రె సురేందర్, అసోసియేట్ అధ్యక్షులు సంగని హరికిషన్, కోట మల్లికార్జున్, ఆర్థిక కార్యదర్శి బోడకుంటి సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బుయ్యాని శివకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పని సతీష్, ములుగు జిల్లా అధ్యక్షులు పల్నాటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకు చిడెం మోహన్ రావు, దిడ్డి మోహన్ రావు, గంప నాగరాజు, నట్టే మోహన్ రావు, కానుగంటి శ్రీనివాస్, అప్పని మాధవరావు, చింతం రమేష్, మీశెట్టి రాజేశ్వర్ రావు



## వేటగాళ్ల ఉచ్చులకు పాడి గేదెలు మృత్యువాత



**మహదేవపూర్, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** అన్నారం అటవీ ప్రాంతమైన ఓడ బండల ఒర్రే ఫారెస్ట్ కుంట సమీపమున వేటగాళ్లు అమర్చిన ఉచ్చులకు రెండు పాడి గేదలు మృత్యువాతపడ్డాయి. మృతి చెందిన పడిగేదెల రైతులసమాచారం మేరకు అన్నారం గ్రామానికి చెందిన రైతుల పాడి గేదెలు గత రెండు రోజుల క్రితం అన్నారం శివారులోకి మేత మేయడానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో రైతులు గేదెలను వెతకడం కోసం చూసుకుంటూ వెళ్లడం జరిగిందనీ అన్నారం సమీపంలోని అటవీ ప్రాంతమైన ఫారెస్ట్ కుంట సమీపములో వేటగాళ్లు పెట్టిన ఉచ్చులు బిగించి అన్నారం రైతులకు చేందిన కుసుమ సమ్మయ్య. ముల్కల్ల బాపు రైతులవి గల రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందినవని. మరికొందరి రైతులకు సంబంధించిన ఎనిమిది పాడి గేదెలు ప్రాణపాయము నుండి బయటపడినట్లు గ్రామ రైతులుతెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం 07 డిసెంబర్ 2025

# అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



హయత్‌నగర్, డిసెంబర్ 6 (జనం సాక్షి) : భారత రాజ్యాంగ పితామహుడు, సంఘసంస్కర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి, దేశ తొలి న్యాయశాఖ మంత్రి అయిన డా. బి.ఆర్. అంబేద్కర్ అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం అలుపెరుగని పోరాటం చేశారని వారు అన్నారు. ఆయన కృషి ఫలితంగానే దేశంలో సామాజిక సమానత్వానికి, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగ భద్రత లభించిందని వారు కొనియాడారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, ఆయన ఒక గొప్ప ఆర్థికవేత్త, రాజకీయవేత్త, మానవ హక్కుల పరిరక్షకుడని వారు తెలిపారు. వర్తమాన సమాజం లోను సామాజిక అసమానతలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదని, ఈ నేపథ్యంలో, ప్రతి పౌరుడు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందనివారు నొక్కి వక్కనిచ్చారు. అంబేద్కర్ సేవలకు గుర్తింపుగా 1990లో భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను ఆయనకు మరణానంతరం ప్రకటించారని భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన ఆ మహనీయుడి ఆశయ సాధనకు సిపిఐ పార్టీ కట్టుబడి ఉంటుందని వారు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమం లో మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, వివిధ శాఖ కార్యదర్శులు సరిత, అరుణ, పారిజాత, సౌజన్య, అనిత, సౌజన్య, అలివేణి, రజిత, సరిత, పద్మ, ప్రజా సంఘాల నాయకులు గోల్కొండ నాగరాజు, మందుల కృష్ణ, వీరస్వామి, జానీ, శేఖర్, రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విహార యాత్రలో ఎర్రగుంట విద్యార్థులు




అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 6 (జనం సాక్షి) : పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత అవగాహనకు, అడవులు మరియు చెట్ల గురించి తెలుసుకొనుటకు శనివారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎర్రగుంట విద్యార్థులు తల్లాడ రక్షిత అటవీ ప్రాంతములోని పులిగిండాల పర్యావరణ విహార ప్రాంతాన్ని సందర్శించారు. సత్తుపల్లి డివిజన్ అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ సురేష్ కుమార్ వారి సిబ్బంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అడవుల ఆవశ్యకతను, పర్యావరణ పరిరక్షణలో రక్షిత అటవీ ప్రాధాన్యతను తెలియజేశారు. వృక్షాలు లేకుంటే నేల ఎలా కోతకు గురవుతుందో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ ప్రాంతములో సుమారు 200 రకాల పక్షి జాతులు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పుష్పం తంగేడు, పక్షి పాలపిట్టలు అధికంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఇతర సిబ్బంది కలిసి మొత్తం 153 మంది ఈ ప్రకృతి విహార యాత్రలో భాగంగా పులిగుండాలను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు శాంత కుమారి, రాజ్యలక్ష్మి, బి. వెంకటేశ్వర రావు, బాబూరావు, సునంద రెడ్డి, బాలు, జయరాం, మోతిలాల్, సుశీల, పద్మ, ప్రమీల రాణి, ప్రసాద్, శిరీష, బోధనేతర సిబ్బంది మీరా సాహెబ్, శ్రీనివాస్, ఖాసిం, సులోచన , అబేద, షాహిన, షాకీర్, ఆరు నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ సమతుల్యతకు ఒక ప్రాంతములో 33% అడవులు ఉండాలని విద్యార్థులు గుర్తు చేసుకున్నారు.

## వెంపటి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..

- సర్పంచ్ అభ్యర్థి చిటుపాక శైలజ మహేష్



తుంగతుర్తి డిసెంబర్ 6 (జనం సాక్షి) : మండల పరిధిలోని వెంపటి గ్రామంలో బిజెపి తరపున సర్పంచ్ అభ్యర్థి చిటుపాక శైలజ మహేష్ శనివారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి బీజేపీ గెలుపుపై ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని, గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లగల శక్తి బీజేపీకి మాత్రమే ఉందని ఆమే తెలిపారు.ఓటు కాదు ఆశీర్వాదం ఇవ్వండి. అభివృద్ధి హామీగా మీ ముందున్నానీ అన్నారు. బీజేపీని గెలిపిస్తే గ్రామం ఎదుగుతుంది మన పిల్లల భవిష్యత్తు బలపడుతుందన్నారు. తనకు గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తనను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు



మల్కాజిగిరి, డిసెంబర్ 6 (జనంసాక్షి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ పేర్కొన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్, మల్లికార్జున నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, మిర్జాలగూడ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్ నాయకులు కార్యకర్తలు మహిళా నేతలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభ్యర్థులు ప్రతి రూపాయి లెక్క చెప్పాల్సిందే..

- ఎన్నికల వ్యయ అధికారి వీరేష్ బాబు



పినపాక, డిసెంబర్ 6 (జనం సాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి చేస్తున్న ప్రతి ఖర్చు వివరాలను కచ్చితంగా తెలియజేయాలని పినపాక మండల ఎన్నికల వ్యయ అధికారి వీరేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన పినపాక మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 77(1) ప్రకారం, అభ్యర్థుల తమ ప్రచార ఖర్చుకు సంబంధించిన లెక్కలను పక్కాగా నిర్వహించాలన్నారు. నామినేషన్ వేసిన తేదీ నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు వీటిని కొనసాగించాల్సి ఉంటుందన్నారు సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలకు సంబంధించిన వ్యయాన్ని నమోదు చేయాలన్నారు అభ్యర్థులంతా తమ వ్యయ ప్రకటనలను ఎన్నికలు ముగిశాక ఎన్నికల అధికారులకు సమర్పించాలన్నారు. అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారా నిర్వహించాలన్నారు. ప్రచార సామగ్రిని సరఫరాదారులు, ముద్రణదారుల ఫొటోలతో ఒక డిక్లరేషన్ ఫారంను సమర్పించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నగదు మించిన అనుమానాస్పద లావాదేవీల గురించి బ్యాంకులు సంబంధిత జిల్లా కలెక్టర్లకు తెలియజేయాలన్నారు. సమర్పించిన ఖర్చు వివరాల్లో తేడాలున్నా లేక నిర్దేశించిన పరిమితిని దాటినా, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10(ఎ) కింద సంబంధిత అభ్యర్థిపై అనర్హతవేటు పడుతుందన్నారు.

## పెద్దవూర మండలంలో భారీగా బీఆర్ఎస్ చేరికలు



హాలియా, డిసెంబర్ 6 (జనం సాక్షి) : పెద్దవూర మండలంలోని గేమ్యా నాయక్ తాండ, జగ్యరాం తాండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం కాంగ్రెస్‌ను వీడి నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమావత్ మంగ్త, వడిత్య దళపతి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ వేసినప్పటికీ తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకొని, బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపించడానికి నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వారు కూడా నోముల భగత్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలోకి చేరిన కొత్త సభ్యులకు మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్ను సుందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రాయల్‌కాంట రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

- బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఈర్షాద్



తాండూరు, డిసెంబర్ 6 (జనంసాక్షి) : పట్టణంలో ని రాయల్ కాంట రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈర్షాద్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఈర్షాద్ మాట్లాడుతూ రాయల్ కాంట సమీపంలో రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. గత 21 రోజుల క్రితం ఇక్కడ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు నిరసన చేపట్టారు.ఈ నిరసనకు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఈర్షాద్ తో పాటు ఇతర నేతలు, కాలనీ వాసులకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి, నెల రోజుల్లోగా రోడ్డు పనులు ప్రారంభిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారుల హామీతో ఆందోళనకారులు తమ నిరసనను విరమించుకున్నారు.అయితే అధికారులు హామీ ఇచ్చి 21 రోజులు గడిచినా ఇప్పటివరకు రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఈర్షాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని అధికారులు వెంటనే నిలబెట్టుకోవాలనిడిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాయల్ కాంట రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు రవి నాయక్



సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 6 (జనంసాక్షి) : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏవైనా సమస్యలు, సమాచారాన్ని తెలియజేసేందుకు తన ఫోన్ నెంబర్ 9676845846కు తెలియజేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి రవి నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన,అలాగే ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలను, ఫిర్యాదులను నేరుగా తన ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని కోరారు.

## ప్రజా పంపిణీలో అక్రమాలపై ఉక్కుపాదం

- పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డి.టీ మాచన రఘునందన్..



చండూరు, డిసెంబర్ 6 (జనం సాక్షి) : ప్రజా పంపిణీ ప్రతిష్టాత్మకమైనదని దాన్ని ప్రహసనం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డి.టీ మాచన రఘునందన్ హెచ్చరించారు.శనివారం నాడు ఆయన చండూరులో పౌర సరఫరాల సంస్థ గిడ్డంగి ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ... రేషన్ బియ్యం రవాణా చేసే లారీలకు జీ. పి. ఎస్ వ్యవస్థ ఉందా? లేదా? అని ప్రశ్నించారు.సి.సి కెమరాలు ఎప్పటినుంచి పని చేయడం లేదని ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా చౌక దుకాణాలకు రేషన్ చేసేయాలని రఘునందన్ సూచించారు.గిడ్డంగి లో ఉన్న నిల్వలను పరిశీలించారు. గిడ్డంగి ని పొరుగు సేవల వ్యక్తి నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

## బెల్లం శ్రీనివాస్‌పై కేసు కొట్టివేత

తిరుమలాయపాలెం, డిసెంబర్ 6 (జనం సాక్షి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్‌పై పెట్టిన అక్రమ కేసును శనివారం కొట్టివేశారు. ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయమూర్తి కేసును కొట్టేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రామసహాయం అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలి

- సత్ప్రవర్తన కోసం బైండ్ ఓవర్
- సీఐ చరమంద రాజు



హుజూర్ నగర్, డిసెంబర్ 6 (జనంసాక్షి) : నియోజకవర్గంలోని హుజూర్ నగర్ సర్కిల్ పరిధిలో ఐదు పోలీసు స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో సిఐ చరమంద రాజు మాట్లాడుతూ సత్ప్రవర్తన కోసం బైండ్-ఓవర్ గురించి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన దగ్గరి నుండి గ్రామ పంచాయితీ ఎన్నికలు సజావుగా జరగాలని, గతంలో నేరాలకు పాల్పడి కేసులు అయిన వారిని, బెల్ట్ షాప్ లు నడిపే వారిని, ఎన్నికలలో సమస్యలను సృష్టించే వారిని, శాంతి భద్రతలకు విఘాతము కలిగించేవారిని, ఎన్నికలు సజావుగా నడవకుండా అడ్డుకునే వారిని హుజూర్ నగర్ సర్కిల్ లో ఐదు పోలీసు స్టేషన్ పరిదిలలో ఇప్పటి వరకు అన్నివర్గాల వారిని మొత్తం 226 మందిని సంబందిత మండల ఎమ్మార్వో ఎదుట బైండ్-ఓవర్ చేశారు. ఈ బైండ్-ఓవర్ లలో భాగంగా హుజూర్ నగర్ మండల పరిధిలో గల శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ముగ్గురిని, గోపాలాపురం కి చెందిన ముగ్గురిని, మర్రిగూడెంకి చెందిన మరో వ్యక్తిని అందరినీ హుజూర్ నగర్ మండల తాసిల్దార్ వద్ద హాజరుపర్చి 2 లక్షలకు గాను హుజూర్ నగర్ ఎస్ఐ బి. మోహన్ బాబు బైండ్-ఓవర్ చేశారు.

# మూడో విడత పోలింగ్‌కు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 6 (జనంసాక్షి) : మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలక్షన్ విధులు కేటాయించిన సిబ్బంది సర్పంచ్, వార్డు సభ్యుల స్క్రూటీని, ఉపసంహరణ అనంతరం పోలింగ్ కు సక్రమమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.పోలింగ్ స్టేషన్ లో మౌలిక సదుపాయాలు చూసుకోవాలని, ఫెసిలిటేషన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, మెటీరియల్ పంపిణీ, వాహనాలు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి స్టేజి 1 ఆర్ఓలు 37ఏ రిజిస్టర్ లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలని అన్నారు. స్టేజి 2 ఆర్ఓలు 37సి రిజిస్టర్ లో ఎన్నికలలో విధులు నిర్వహించే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.రిటర్నింగ్ అధికారులు సంబంధిత గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అన్ని మౌలిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని అన్నారు.పోలింగ్ తరువాత ఓట్లను కౌంటింగ్ చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# రుణగ్రహీతలకు ఊరట

- రెపోరేటులో 0.25% కోత
- 2025లో 1.25% తగ్గిన వడ్డీ రేట్లు
- ఇల్లు కొనాలనుకునే వారికి తగ్గనున్న భారం

**న్యూఢిల్లీ:**ఇల్లు, కారు కొనాలనుకునే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త వినిపించింది. తాజా పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2024 డిసెంబరు 6న రెపో రేటు 6.50% కాగా.. ఏడాది తర్వాత ఇప్పుడు 5.25 శాతానికి దిగివచ్చింది. అంటే 2025లో రెపో రేటు 1.25% (ఫిబ్రవరిలో 0.25%, ఏప్రిల్‌లో 0.25%,



జూన్‌లో 0.50%, డిసెంబరులో 0.25% చొప్పున) తగ్గింది. ఇది సామాన్యులకు ముఖ్యంగా ఇప్పటికే గృహ, వాహన రుణాలు తీసుకున్న వారికీ, కొత్తగా తీసుకోవాలని ఆలోచిస్తున్న వారికీ ఎంతో ప్రయోజనం కలిగించే అంశం ప్రస్తుతం బ్యాంకులన్నీ రెపో ఆధారిత రుణ వడ్డీ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్)ను తమ ప్రామాణిక వడ్డీ రేటుగా పరిగణిస్తున్నాయి. రెపో రేటుపై బ్యాంకులు 2.50% - 2.75% అదనంగా తమ ఖాతాదారుల వద్ద వసూలు చేస్తుంటాయి. ప్రస్తుతం రెపో రేటు 5.25% పై అదనంగా 2.5% బ్యాంకు వసూలు చేస్తే.. వడ్డీ రేటు దాదాపు 7.75% అవుతుంది. ఆర్‌బీఐ ప్రకటన తరవాత బ్యాంక్ ఆఫ్ బరోడా తన వడ్డీ రేటును 8.15% నుంచి 7.90 శాతానికి తగ్గిస్తున్నట్లు, ఈనెల 6 నుంచి కొత్త రేటు అమల్లోకి వస్తున్నట్లు వెల్లడించింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో ఆధారిత రుణ రేటును 8.35% నుంచి 8.10 శాతానికి తగ్గించామని, ఈనెల 5 నుంచే అమల్లోకి తెచ్చినట్లు వివరించింది.మిగిలిన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు రెపో రేటు తాజా తగ్గింపు ప్రయోజనాన్ని త్వరలోనే తమ రుణగ్రహీతలకు అందించేందుకు సిద్ధం అవుతున్నాయి. 800 పాయింట్లకు మించి క్రెడిట్ స్కోరున్న వారికి బ్యాంకులు 0.25% వడ్డీ రాయితీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో రుణ చెల్లింపు చరిత్ర బాగున్న వారికి 7.50% వడ్డీకే రుణం లభించే అవకాశం లేకపోలేదు. కొవిడ్ సమయంలో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పుడు, అధిక మొత్తంలో రుణ అర్హత లభించింది. ఆ తర్వాత వరసగా వడ్డీ రేట్లు పెరగడంతో, అప్పుడు రుణం తీసుకున్న వారందరికీ ఇటీవల వరకూ వడ్డీ భారంగా మారింది. ఇప్పుడు రెపో రేటు దిగి రావడంతో ప్రధానంగా వీరికి ఊరట లభించనుంది.

# లగ్జరీ హౌసింగ్ మార్కెట్ రయ్.. రయ్..

**భారత లగ్జరీ మార్కెట్ గతేడాది 17 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2030 నాటికి 103 బిలియన్ డాలర్లకు చేరుతుందని మ్యాజిక్ బ్రిక్స్ అంచనా వేసింది. ప్రీమియం వ్యయాలకు కస్టమర్లు ఏమాత్రం వెనుకడుగు వేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.భారత లగ్జరీ హౌసింగ్ మార్కెట్ పరిపక్వత దశకు చేరుకుందని, సంప్రదాయ మెట్రో కేంద్రాల నుంచి కొత్త భౌగోళిక ప్రాంతాలు, శివార్లకు లగ్జరీ గృహ విపణి విస్తరిస్తుందని పేర్కొంది.ప్రధాన నగరాల్లో లగ్జరీ ప్రైజ్ ఇండెక్స్(ఎల్‌పీఐ) 2021లో 2.32గా ఉండగా.. 2025 నాటికి 2.27కి తగ్గింది. ఇదే కాలంలో కొత్త ప్రాంతాలు, శివార్లలో ఎల్‌పీఐ 1.00 నుంచి 1.44కి పెరగడమే దీనికి సూచన అని వివరించింది.**

- కమ్యూనిటీ లివింగ్‌కు జోన్ కేటాయించండి
- డెవలపర్లకూ పన్ను రాయితీ కల్పించాలి
- ప్రభుత్వాన్ని కోరుతున్న డెవలపర్ల సంఘాలు



**హైదరాబాద్(జనంసాక్షి):**మెరుగైన మౌలిక వసతులు, కనెక్టివిటీ, టౌన్‌షిప్‌ల అభివృద్ధితో శివార్లలో లగ్జరీ గృహాల పెరుగుదలకు దోహదపడుతున్నాయి. మధ్యస్థ లగ్జరీ గృహాల ధరలు ముంబైలో అత్యధికంగా రూ.9.66 కోట్లుగా ఉండగా.. గుర్‌గావ్‌లో రూ.5.46 కోట్లు, బెంగళూరులో రూ.2.91 కోట్లు, హైదరాబాద్‌లో రూ.2.20 కోట్లు, చెన్నైలో రూ.2 కోట్లు, పుణెలో రూ.1.97 కోట్లు, కోల్‌కతాలో రూ.1.50 కోట్లుగా ఉన్నాయి.2021 నుంచి దేశంలో లగ్జరీ హౌసింగ్ గణనీయంగా విస్తరిస్తోంది. డెవలపర్లు పెద్ద లేఅవుట్లు, ప్రీమియం వసతులు, ఇంటిగ్రేటెడ్ లైఫ్ స్టైల్ సౌకర్యాల వైపు మొగ్గు చూపుతుండటంతో లగ్జరీ గృహాల సరఫరా పెరుగుతోంది. ప్రస్తుతం మొత్తం ఇళ్ల సప్లయిలో లగ్జరీ యూనిట్ల వాటా 27 శాతంగా ఉంది. 2021లో ఈ విభాగం వాటా 16 శాతంగా ఉండేది. అద్భుతమైన డిజైన్, సౌలభ్యం, మెరుగైన జీవనశైలి కోరుకునే కస్టమర్లు పెరుగుతుండటంతో లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లు 14 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో అఫర్డబుల్ జోన్.. సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల.. ఎకరం రూ.100 కోట్లు పలుకుతున్న హైదరాబాద్‌లో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కల సాకారం కావాలంటే ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఏర్పడింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకూ విస్తరించింది. ఇలాంటి తరుణంలో గ్రేటర్‌లో అందు బాటు గృహాల నిర్మాణం డెవలపర్లకు లాభసాటిగా లేకపోవడంతో క్రమంగా అఫర్డబుల్ హౌసింగ్(చౌక ధరల ఇళ్లు) తగ్గుముఖం పట్టాయి.తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నగరానికి దక్షిణ భాగంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఫోర్త్ సిటీలో అఫర్డబుల్ హౌసింగ్‌కు కూడా ప్రత్యేకంగా జోన్ కేటాయించాలని డెవలపర్ల సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. సంస్థలకు, క్రీడలకు, విద్యా, వైద్యం, వినోద కేంద్రాలకు ఎలాగైతే ప్రత్యేకంగా జోన్లను కేటాయిస్తున్నారో.. చౌక గృహాల నిర్మాణాలకు కూడా స్థలాలను కేటాయించాల్సిన ఆవశ్యకత ఉందనేది నిపుణుల అభిప్రాయం.ఆకాశాన్నంటిన ధరల నేపథ్యంలో 90 శాతం మంది ఉద్యోగ వర్గాలు ఇల్లు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం రూ.కోటి లేనిదే ఇల్లు కొనలేని విధంగా తయారైంది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్ ఏర్పడింది. డబ్బు ఉండి, ఇల్లు ఉన్నవారు అద్దెలను విపరీతంగా పెంచేస్తున్నారు. వేతనజీవులు తమ సంపాదనలో 40-45 శాతం అద్దెలకే చెల్లిస్తున్నారు. మిగిలిన సొమ్ములో ఇల్లు, సంసారం గడపడం గగనమైపోయింది. మార్కెట్‌లో గృహ యజమానులు ఎక్కువ, అద్దెదారులు తక్కువగా ఉంటేనే సమతుల్యత. లేకపోతే అద్దెలు విపరీతంగా పెరిగి, జేబులు ఖాళీ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం 'అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ'ని తీసుకురావడం అత్యవసరం.ముంబై తరహాలో హైదరాబాద్‌లోనూ పాత స్థలాలు, ప్రాంతాలను రీ-డెవలప్‌మెంట్ చేయాల్సిన అవసరం ఉంది. పాత పౌర మౌలిక సదుపాయాలు నగరాభివృద్ధికి అత్యంత కీలకం. అందుకే ఆయా ప్రాంతాలను క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలి. రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు నిర్మాణ రుసుములు, పన్ను రాయితీలు, జీఎస్టీ మినహాయింపులతో ప్రోత్సహించాలి. రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గిస్తే కొనుగోలుదారులు ఉత్సాహంగా ముందుకొస్తారు. అయితే ఈ తగ్గింపులతో ప్రభుత్వానికి ప్రత్యక్ష రాబడి తగ్గినా.. నిర్మాణ సామగ్రి కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు పెరగడం, ఉద్యోగ అవకాశాలు పెరగడం వంటి వాటితో పరోక్షంగా అంతకు రెట్టింపు ఆదాయమే సమకూరుతుంది.కో-ఆపరేటివ్ సొసైటీ, ఎంప్లాయిస్ యూనియన్లుగా ముందుకు రావాలి. భారత్ ఫ్యూచర్ సిటీలో సామాన్య, మధ్యతరగతికి స్థలాలను కేటాయించాలి. కమ్యూనిటీ లివింగ్‌కు ప్రత్యేకంగా జోన్ కేటాయించాలి. ప్రభుత్వ భూములను మ్యాపింగ్ చేసి, అఫర్డబుల్ హౌసింగ్‌కు అనువైన ప్రాంతాలను గుర్తించాలి. ప్రభుత్వం నీరు, డ్రైనేజీ, విద్యుత్, ప్రజా రవాణా, ఆస్పత్రులు, పాఠశాలలు వంటి మౌలిక, సామాజిక అవసరాలను కల్పిస్తే చాలు.. అందుబాటు ధరల్లో డెవలపర్లకు భూములను అందిస్తే అఫర్డబుల్ హౌసింగ్‌లను నిర్మించే వీలుంటుంది. పెరీ అర్బన్ ఏరియాలో భూమార్పిడి, కన్వర్షన్ల ప్రక్రియను సులభతరం చేయాలి. అర్హులైన లబ్ధిదారులకు వడ్డీ రాయితీ, తొలిసారి ఇల్లు కొనుక్కునేవారికి స్టాంప్ డ్యూటీలో రాయితీ అందించాలి. అఫర్డబుల్ ప్రాజెక్టులను నిర్మించే డెవలపర్లకు పన్ను రాయితీలను అందజేయాలి.గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలను పాటిస్తూ.. ప్రీ-ఫ్యాబ్, త్రీడీ ప్రింటింగ్, మాడ్యులర్ టెక్నాలజీలతో ఇళ్లను నిర్మిస్తే త్వరితగతిన పూర్తవుతాయి. ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ప్లేస్కూళ్లు, పార్కులు, కమ్యూనిటీ స్పేస్‌లు వంటి సదుపాయాలను అందించాలి. ప్రస్తుతం భవన నిర్మాణ అనుమతులు పొందాలంటే మున్సిపల్, ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్విరాన్‌మెంటల్.. ఇలా 15 విభాగాలు, 170 డెస్కుల ద్వారా వెళ్లాలి. ఇదే అనుమతుల జారీలో జాప్యానికి ప్రధాన కారణం.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.35 | ₹ 6.37 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,19,350 (22 క్యారెట్లు) | ₹ 1,30,200 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,96,000

## 'లాక్మే' సృష్టికర్త సిమోన్ టాటా కన్నుమూత

**న్యూఢిల్లీ:**ప్రసిద్ధ వ్యాపారవేత్త, ప్రముఖ కాస్మొటిక్ బ్రాండ్ లాక్మే సృష్టికర్త సిమోన్ టాటా కన్నుమూశారు. లాక్మేను భారతదేశపు అత్యంత గుర్తింపు పొందిన బ్యూటీ బ్రాండ్లలో ఒకటిగా మార్చిన ఆమె 95 ఏళ్ల వయస్సులో శుక్రవారం తుది శ్వాస విడిచారు.ముంబైలోని స్విట్జర్లాండ్ కాన్సులేట్ జనరల్ తమ ఎక్స్ హ్యాండిల్ లో ఈ విషయాన్ని వెల్లడించింది. లాక్మే బ్రాండ్‌ను భారతదేశంలో ప్రముఖ కాస్మెటిక్ కంపెనీగా అభివృద్ధి చేయడంలో సిమోన్ టాటా కృషిని గుర్తు చేసుకుంటూ ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసింది. సిమోన్ టాటా కన్నుమూతపై లాక్మే ఇండియా కూడా సంతాపం తెలియజేసింది. లాక్మే వెనుక దార్శనికురాలిని కోల్పోయామంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.సిమోన్ టాటా.. ప్రసిద్ధ టాటా ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటాకు తల్లి, టాటా గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ టాటాకు సవతి తల్లి. 1930లో జన్మించిన సిమోన్ డునోయర్ జెనీవాలో పెరిగారు. 1953లో పర్యాటకురాలిగా భారత్ వచ్చిన ఆమె నావల్ హెచ్ టాటాను వివాహమాడి ఇక్కడే స్థిరపడ్డారు. 1962లో టాటా ఆయిల్ మిల్స్‌కు చిన్న అనుబంధ సంస్థగా ఉన్న లాక్మే బోర్డులో చేరారు. అందం లగ్జరీ కాకూడదని, ప్రతి భారతీయ మహిళకూ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో లాక్మే ఉత్పత్తులను అందరికీ చేరువ చేసే ప్రయత్నం చేశారు.





## రేట్ల తగ్గింపు బాటలో బ్యాంకులు

**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ పాలసీ రేట్లను తగ్గించడంతో ఆ ప్రయోజనాలను కస్టమర్లకు బదలాయించే పనిలో పడ్డాయి ప్రభుత్వ రంగ బ్యాంకులు. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) రెపో ఆధారిత రుణ రేటును 8.15 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గించినట్లు ప్రకటించింది.డిసెంబర్ 6 నుంచి ఈ రేటు అమల్లోకి వస్తుందని తెలిపింది.అటు బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తమ రెపో ఆధారిత రుణ రేటు (ఆర్‌బీఎల్‌ఆర్)ను 8.35 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గించినట్లు పేర్కొంది. మరో ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ఇటీవలే ఏడాది కాలవ్యవధికి సంబంధించిన ఎంసీఎల్‌ఆర్‌ని (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు) 5 బేసిస్ పాయింట్లు కట్ చేసి 8.80 శాతానికి తగ్గించింది.

## 87 ఏళ్ల క్రితం 'జై భీమ్' పుట్టిందిలా..

**న్యూఢిల్లీ:**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి నేడు(డిసెంబర్ 6). 1956లో ఇదే రోజున ఆ మహనీయుడు కన్నుమూసినప్పటికీ, ఆయన స్ఫూర్తిని గుర్తుకు తెచ్చే 'జై భీమ్' నినాదం నేటికీ ఆయన వారసత్వాన్ని, దళితుల ఐక్యతను చాటుతోంది.డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్‌పై గల అపారమైన గౌరవాన్ని, దళిత సమాజపు ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన నినాదం 'జై భీమ్' ఆవిర్భావం వెనుక ఆసక్తికర కథనం ఉంది.సుమారు 87 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని నాటి ఔరంగాబాద్ (నేటి ఛత్రపతి శంభాజీనగర్) జిల్లా, కన్నడ్ తెహ్సీల్‌లోని మక్రాన్‌పూర్ గ్రామంలో చారిత్రక తొలి పరిషత్ సమావేశం జరిగింది.



మరాఠ్వాడ షెడ్యూల్డ్ కులాల సమాఖ్య మొదటి అధ్యక్షుడు భౌసాహెబ్ మోర్, డిసెంబర్ 30, 1938న ఈ మొదటి మక్రాన్‌పూర్ పరిషత్‌ను నిర్వహించారు. ఈ చారిత్రక సందర్భాన్ని గురించి భౌసాహెబ్ మోర్ కుమారుడు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ మోర్ వివరించారు. నాటి సమావేశంలో డాక్టర్ అంబేద్కర్ పాల్గొని, ఆనాటి హైదరాబాద్ రాచరికపు రాష్ట్రానికి మద్దతు ఇవ్వవద్దని ప్రజలను కోరారు.అనంతరం భౌసాహెబ్ మోర్ మాట్లాడుతూ ప్రతి సమాజానికి ఒక ఆరాధ్య దైవం ఉంటాడని, ఆ పేరుతో వారు పలకరించుకుంటారని పేర్కొన్నారు. డాక్టర్ అంబేద్కర్ మనకు పురోగతి మార్గాన్ని చూపించారని, ఆయన మనకు దేవుడిలాంటివారని, కాబట్టి ఇక నుండి మనం ఒకరినొకరు కలిసేటప్పుడు 'జై భీమ్' అని పలుకరించుకోవాలని పిలుపునిచ్చారు. పరిషత్‌కు హాజరైన జనం ఈ కొత్త నినాదంపై ఉత్సాహంగా స్పందించి, వెంటనే ఆ నినాదాన్ని తమ సమాజ నినాదంగా అంగీకరిస్తూ, ఈ తీర్మానాన్ని ఆమోదించారు.మక్రాన్‌పూర్ వేదిక ఎంపిక వెనుక బలమైన రాజకీయ కారణం ఉంది. నాటి నిజాం పాలకులు దళితులపై మతమార్పిడి ఒత్తిళ్లతో సహా పలు దురాగతాలకు పాల్పడేవారు. వీటిని భౌసాహెబ్ మోర్.. డాక్టర్ అంబేద్కర్ దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన సమావేశానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. అయితే రాచరిక రాష్ట్రాలను వ్యతిరేకించిన కారణంగా హైదరాబాద్ రాష్ట్రంలో డాక్టర్ అంబే ద్కర్ ప్రసంగాలు ఇవ్వకుండా నిషేధించారు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ భూభా గంలో ఉన్న మక్రాన్‌పూర్ గ్రామాన్ని సమావేశ వేదికగా ఎంచుకున్నారు. అంబేద్కర్ అనుచరులు నిజాం పోలీసుల నుండి తప్పించుకుని ఈ సభకు హాజరయ్యారు.

# ఒక్క 'ఇండిగో'పేనే ప్రభావమెందుకు?

- భారీ సంఖ్యలో సర్వీసులు, రాత్రి పూట విమానాలు
- పైలెట్లు, సిబ్బంది సంఖ్య పరిమితం
- ఎఫ్‌డీటీఎల్ నిబంధనలకు సిద్ధం కానందునే సర్వీసుల రద్దు, జాప్యం
- దిద్దుబాటుకు ఎంత సమయం పడుతుందో?

**జనంసాక్షి:**దేశీయ అగ్రగామి విమానయాన సంస్థ ఇండిగో సర్వీసులు రోజూ వందల సంఖ్యలో రద్దవుతున్నందున, వేలమంది ప్రయాణికుల మీద ప్రభావం చూపుతోంది. పర్యాటకులతో పాటు వ్యాపార, వ్యక్తిగత, విద్య, వైద్య అవసరాల కోసం ప్రయాణించాలనుకున్న వారికి అనూహ్య ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెళ్లిళ్లూ రద్దవుతున్నాయి. పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) అమల్లోకి తెచ్చిన ఎఫ్‌డీటీఎల్ (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) నిబంధనలను పాటించలేకపోవడం వల్లే ఇండిగో సర్వీసులు భారీగా రద్దవుతున్నాయి. దేశంలో మిగిలిన విమానయాన సంస్థల కంటే ఇండిగో కే ఎందుకీ సమస్య తలెత్తింది? అనేదే అందరి సందేహం. పరిశ్రమ వర్గాల ప్రకారం.. ఇండిగో తన దగ్గర ఉన్న విమానాలతో పెద్ద సంఖ్యలో విమాన సర్వీసులు నిర్వహిస్తోంది. అది కూడా పరిమిత సంఖ్యలో ఉన్న సిబ్బంది, పైలెట్లతోనే. సిబ్బంది, విమానాల సద్వినియోగానికి.. తక్కువ ధరకు ప్రయాణికులను చేరవేసేందుకు ఈ సంస్థ నడిపే రాత్రి పూట సర్వీసులూ అధికమే. మొత్తం దేశీయ విమాన ప్రయాణికుల్లో 63% మందిని ఈ సంస్థ చేరవేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొద్ది సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయినా గందరగోళం తప్పదు. అలాంటిది వందల సంఖ్యలో సర్వీసులు రద్దవుతున్నందున, తీవ్ర ఆందోళన తలెత్తింది. ఏడాది క్రితమే డీజీసీఏ ఈ నిబంధనలను ఖరారు చేసి, దశల వారీగా అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా విమాన పైలెట్లు, సిబ్బందికి తగిన విశ్రాంతి ఇవ్వాలనేది ఈ నిబంధనల సారాంశం. ఇందుకు తగినట్లుగా తగినంతమంది సిబ్బంది, పైలెట్లను సమకూర్చుకోలేక ఇండిగో ఇబ్బందుల్లో పడింది. కొంత కాలంగా ఈ సంస్థ అధిక సంఖ్యలో పైలెట్లు, సిబ్బంది




నియమకాలను చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు సమకూర్చుకోవడం సాధ్యం కాని పరిస్థితి. ఇతర విమానయాన సంస్థలు పరిమిత సంఖ్యలోనే సర్వీసులు నిర్వహిస్తున్నందున, సులువుగానే కొత్త నిబంధనలు పాటించగలుగుతున్నాయి.

ఇవీ ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు

డీజీసీఏ 2024 జనవరిలో కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను జారీ చేసింది. మొదటి దశ నిబంధనలు 2025 జులై నుంచి అమలవుతున్నాయి. రెండో దశ నిబంధనలను నవంబరు 1 నుంచి పాటించాల్సి వచ్చింది. ఈ నిబంధనలు ప్రధానంగా పైలెట్లు, కేబిన్ సిబ్బంది అలసిపోకుండా విశ్రాంతి నివ్వడం, రాత్రి డ్యూటీలకు సంబంధించినవే. పైలెట్లు, సిబ్బందికి వారాంతపు విశ్రాంతి 36 గంటల నుంచి 48 గంటలకు పెంపు.రాత్రి ల్యాండింగ్ పరిమితులు వారానికి ఆరు నుంచి రెండుకు కుదింపు.'రాత్రి గంట'లకు కొత్త నిర్వచనం ఇచ్చారు. అర్ధరాత్రి నుంచి ఉదయం 6 గంటల వరకూ సమయాన్ని రాత్రి గంటలుగా పేర్కొన్నారు. పైలెట్లకు వరుసగా రెండు రాత్రి డ్యూటీలు మాత్రమే వేయాలి. విమానయాన సంస్థలు తప్పనిసరిగా అలసట నివేదికలను మూడు నెలలకోసారి సమర్పించాలి.

ఇండిగో ఏం చేసింది...

మొదటి దశ నిబంధనల్లో ముఖ్యమైనదైన పైలెట్లు, సిబ్బందికి వారాంతపు విశ్రాంతి గంటల పెంపు అంశాన్ని ఇండిగో తేలికగానే అమలు చేసింది. రెండోదశలో, రాత్రి ల్యాండింగ్ పరిమితిని వారానికి ఆరు నుంచి రెండుకు తగ్గించడాన్ని అమలు చేయాల్సి రావడంతో ఇండిగోకి ఇబ్బంది తలెత్తింది. ఈ సంస్థ ఇతర సంస్థలతో పోల్చితే, తన సిబ్బందితో ఎంతో ఎక్కువ గంటలు పనిచేయిస్తుంది. అందుకే రాత్రి పూట ఇండిగో విమాన సర్వీసులు అధికంగా ఉంటాయి. ఇండిగోతో పోల్చితే ఎయిర్ ఇండియా సగం విమాన సర్వీసులే నిర్వహిస్తోంది. కొత్త నిబంధనల ఫలితంగా పైలెట్లు, సిబ్బంది అందుబాటులో లేక ఇండిగో నవంబరులోనే 755 విమాన సర్వీసులు రద్దు చేసింది. ఈనెలలో రోజూ వందల సర్వీసులు రద్దయ్యాయి.

తాత్కాలిక చర్యలు...

ఇండిగో సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, డీజీసీఏ తాత్కాలికంగా కొన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనల్లో ముఖ్యమైనదైన 'వారాంతపు విశ్రాంతికి సెలవు ప్రత్యామ్నాయం కాదు' అనే నిబంధనను ప్రస్తుతానికి వాయిదా వేసింది. రాత్రి డ్యూటీ నిబంధనలను కూడా సవరించింది. పండుగలు, వివాహ వేడుకలు, శీతాకాల రద్దీని పరిగణనలోకి తీసుకుంటే విమాన ప్రయాణికుల సంఖ్య ఎంతో పెరిగే అవకాశం ఉందని, పైలెట్ అసోసియేషన్లు, విమానయాన సంస్థలు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని డీజీసీఏ ఛీఫ్ ఫయాజ్ అహ్మద్ కిద్వాయ్ సూచించారు. మంచు వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను తాత్కాలికంగా పక్కన పెట్టడం అంటే, విమానయాన సంస్థల ఒత్తిడికి డీజీసీఏ తలొగ్గినట్లు అవుతోందనే విమర్శలు వస్తున్నాయి. కొత్త నిబంధనలు అమలు చేయడానికి రెండేళ్ల గడువు ఇచ్చినా ఇండిగో



## దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

**దేశంలో బంగారం, వెండి ధరలు క్షీణించాయి. క్రితం రోజున ఎగిసిన పసిడి ధరలు నేడు దిగివచ్చాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు.అందులో భాగంగా బంగారం ధరలలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. శుక్రవారంతో పోలిస్తే శనివారం బంగారం ధరలు తగ్గాయి. ఇక వెండి ధరలు మరోసారి క్షీణించాయి అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా దేశీయంగా పసిడి ధరలు పెరిగాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం 10 గ్రాముల ధర రూ.1,300 పెరిగి రూ. 1,32,900కి చేరింది. అటు వెండి సైతం కేజీకి రూ. 3,500 పెరిగి రూ. 1,83,500 పలికింది.అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ధర ఒక దశలో సుమారు 15.10 డాలర్లు పెరిగి 4,223.76 డాలర్లకు చేరింది.**

## సుప్రీంను సామాన్యులకు చేరువ చేస్తా

కోర్టు కేసుల పరిష్కారానికి నిరీత అంచనా గడువులను నిర్దేశించడం, ప్రతిపాదిత జాతీయ న్యాయ విధానానికి అనుగుణమైన రీతిలో పెండింగ్ కేసుల్లో శరవేగంగా తీర్పులు వచ్చేలా చేయడం తన ప్రాధాన్యతలు అని ఆయన స్పష్టం చేశారు. శనివారం న్యూదిల్లీలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు."న్యాయం పొందే హక్కు అందరికీ ఉంది. కోర్టు కేసుల వేళ సాధారణ పౌరులకు అయ్యే ఖర్చులను తగ్గించడంపై నేను దృష్టి పెడతాను. ఏయే రకాల కోర్టు కేసుల పరిష్కారానికి, ఎంతెంత మేరకు నిర్ణీత అంచనా గడువులు ఉండాలి, వాటిని ఎలా నిర్దేశించాలి అనే దానిపై నా ప్రత్యేక ఫోకస్ ఉంటుంది. ఈ అంశంపై ప్రత్యేకించి జిల్లాస్థాయి కోర్టులను ఉత్తేజితం, చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉంది. అన్ని పెండింగ్ కేసులకు వెంటనే పరిష్కారాల్ని చూపాలని నేను అనడం లేదు. అది సాధ్యం కాదు. ఎందుకంటే కోర్టు కేసుల విచారణ అనేది ఒక పెద్ద ప్రక్రియ. ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం, నమ్మకం ఉన్నాయి. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించగల శక్తివంతమైన విధానం మధ్యవర్తిత్వం (మీడియేషన్). దాన్ని కూడా పిటిషనర్లు పరిశీలించాలి" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు."భవిష్యత్తులో చాలా సవాళ్లు ఎదురు కాబోతున్నాయి. వాటికి అనుగుణంగా మనం న్యాయ వ్యవస్థను అప్‌డేట్ చేసుకోవాలి. కొత్త సవాళ్లకు అనుగుణంగా న్యాయమూర్తులకు శిక్షణ అందించాలి. డిజిటల్ అరెస్ట్, సైబర్ క్రైమ్ కేసులను ఎలా డీల్ చేయాలో నేర్పించాలి. న్యాయ వ్యవస్థలోని మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలి. ఇక ఇదే సమయంలో ప్రతిభావంతులైన వారిని గుర్తించి, ప్రోత్సహించాలి. దేశంలోని విభిన్న ప్రాంతాలు, వర్గాలకు చెందిన వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించే ప్రయత్నాలు ఇప్పుడు బలంగా జరుగుతున్నాయి.

# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగ

- రాష్ట్ర యోగా పతక విజేతలకు మంత్రుల అభినందన
- జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి
- మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 06(జనంసాక్షి):** భారతీయ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక యోగా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం ఉదయం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపీ అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులను అభినందిస్తూ జాతీయస్థాయిలో కూడా పథకాలు సాధించాలని కోరినారు. ప్రపంచానికి భవద్గీతను అందించిన భారతదేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేయడం భారతదేశము యొక్క కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా , బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... యోగా సాధన వలన సార్వత్రిక శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుందని వ్యక్తి పరిపూర్ణతకు యోగా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వా ములు కావాలని ఆయన కోరారు. యోగాను ముందు తరాల వారికి అందించాలనే లక్ష్యంతో యోగా క్రీడాకారుల సంక్షేమాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చారని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాంచి లో ఈనెల 27 నుంచి 30 వరకు జరుగు జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు డా. కవంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వి. అంజనీ కుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కార్యదర్శి గుంటి రామకృష, కోశాధికారి పి. స్వరూప చారి, బండ రమణారెడ్డి, యోగ కోచులు కిష్టయ్య, ఆనంద కిషోర్, ప్రవీణ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలనపై కృషి చేయాలి



**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 6 జనంసాక్షి :** బాల్యవివాహాల నిర్మూలనపై అన్ని మత పెద్దలతో అవగాహన సమావేశం.. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బిబేటీ బచావో - బేటీ పడావోలి కార్యక్రమంలో భాగంగా, జిల్లా మహిళా-శిశు-వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి ఎస్.కె. రసూల్ బీ మేడం నేతృత్వంలో బాల్యవివాహాల నిర్మూలనపై అన్ని మత పెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ శ్రీసాయి చైతన్య విచ్చేసి మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడంలో మత పెద్దలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. పిల్లల వయస్సు నిర్ధారణలో తప్పుడు ఆధార్, పాన్ కార్డులు సమర్పించే ఘటనలు పెరుగుతున్నాయని, బాల్య వివాహ నిషేధ చట్టం - 2006 ప్రకారం కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని మత పెద్దలు గుర్తించి సమాజంలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్.కె. రసూల్ బీ మేడం మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనలో మహిళా-శిశు సంక్షేమ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలిం చడంలో మత పెద్దల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఏఆర్కే ఎడ్యుకేషన్ సొసైటీ సునీత మేడం బాల్య వివాహాల నిర్మూలనపై మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా మహిళా కమిషన్ సభ్యురాలు సుదం లక్ష్మి, అలాగే జిల్లా మహిళా మరియు శిశు అభివ ృద్ధి శాఖాధికారి కృష్ణవేణి, దేవాదాయ శాఖ నుండి కార్యనిర్వాహక అధికారి, ఏఆర్కె విద్యా సంస్థ నుండి సునీత, ప్రాజెక్ట్ సిడిపిఓ, సూపర్‌వైజర్లు, సమగ్ర బాలల కాపాడు కార్యక్రమం, చైల్డ్‌లైన్ యూనిట్, సఖి బృందం, పోషణ్ అభియాన్ బృందం తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించిన అదనపు కలెక్టర్

### కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో తనిఖీ

**రుద్రంగి డిసెంబర్ 6 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ లో ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన వసతులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు.రుద్రంగి లోని హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలించి,అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి,భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పై ఆరా తీశారు. పీఏసీ ఎస్,డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి,రైతులతో మాట్లాడారు.రుద్రంగి ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.వివరాలు అడిగి తెలుసుకున్నారు.పరిశీలనలో రుద్రంగి తహసీల్దార్ పుష్పలత,ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కారుణ్య నియామకాల రద్దుకు కుట్ర చేస్తోంది

- టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్
- అనారోగ్యంతో మెడికల్ బోర్డుకు వెళ్లే కార్మికులను అన్‌ఫిట్ చేయాలి
- నిరసన దీక్షలో మాజీ మంత్రి..టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు ఈశ్వర్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి మెడికల్ బోర్డు తీరుపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ముందు శనివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు.దీక్షలో పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి వర్యులు, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు.గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కారుణ్య నియామకాలు జరుగకుండా సింగరేణి యాజమాన్యం మొండికేస్తుందని ఈశ్వర్ పేర్కొన్నారు.9 నెలల నుంచి మెడికల్ బోర్డు పెట్టలేదని, మొక్కుబడిగా పెట్టిన రెండు మెడికల్ బోర్డులు వాటిలో కేవలం ఈ బోర్డు ఉన్నదని చూపించుకోడానికి నిర్వహించారు. అంతేకాని, కార్మికులకు ఎలాంటి న్యాయం జరుగుతుందన్నారు.ఎందుకంటే ఇప్పటికే నడవలేని స్థితిలో ఉన్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారన్నా రు. కనీసం వాళ్ళు సొంత పనులు చేసుకోలేని స్థితిలో కార్మికులున్నా రని పేర్కొన్నారు.కేసీఆర్ పదేండ్ల పాలనలో అడగకుండానే సింగరేణి కార్మికులకు హక్కులను కల్పించి, గౌరవించారని ఈశ్వర్ తెలిపారు. కానీ కాంగ్రెస్ సర్కార్ అన్యాయం చేస్తున్నదన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు 80శాతం సింగరేణి కార్మిక వర్గానికి కారుణ్య నియామకం కింద ఇన్వాల్యుడేషన్ చేయడం జరిగిందన్నారు.

**మెడికల్ బోర్డుకు వెళ్లే కార్మికులను వెంటనే అన్‌ఫిట్ చేయాలి:**

2 సంవత్సరాల కాలంలో 6 బోర్డులు మాత్రమే నిర్వహించి అందులో ఒక బోర్డు రిఫరల్ ఫర్ హైయర్ సెంటర్ వారికి నిర్వహించారని ఈశ్వర్ తెలిపారు.8 నెలలు పైబడి అన్‌ఫిట్‌లో ఉంచబడిన కార్మికులను 55 మందిలో ఐదుగురు మాత్రమే అన్ఫిట్ చేయడం అన్యాయమన్నారు.గుండె జబ్బులు, పెరాల్సిస్, మూత్రపిండ వ్యాధులు లాంటి దీర్ఘకాల వ్యాధులతో 15 నెలల పైబడి అన్ఫిట్‌లో ఉన్న కార్మికులను నవంబర్ నెలలో 123 మందిని బోర్డుకు పిలిచి 23 మందిని మాత్రమే అన్ఫిట్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.తీవ్ర దీర్ఘ కాయలకు వ్యాధులతో నడవలేని స్థితిలో మరియు కదలలేని స్థితిలో ఉన్నకార్మికులను ఫిట్ చేయడం,ఫిట్ ఫర్ సర్ఫేస్ ఇవ్వడం అన్యాయమన్నారు.2023-24లో సింగరేణి వాస్తవ లాభాల్లో కేవలం 16శాతం వాటా ఇచ్చి మోసం చేసిందని, అభివృద్ధి పేరిట రూ.2289 కోట్లు పక్కనబెట్టింద న్నారు. కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయించాలని, అలవెన్స్‌లపై ఆదాయ పన్నును యాజమాన్యమే భరించాలన్నారు. టిబిజికెఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో మెడికల్ బోర్డును పునరుద్ధరించాలన్నారు.నెలకు 2 బోర్డును నిర్వహించి అనారోగ్యంతో ఉన్న కార్మికులందరిని అన్ ఫిట్ చేయాలన్నారు.జులై, నవంబర్ నెలలో నిర్వహించిన బోర్డులలో అనారోగ్యంతో ఉండి డ్యూటీలు చేయలేని పరిస్థితిలో ఉన్నవారికి రీ-మెడికల్ నిర్వహించాలని సింగరేణి యాజమాన్యాన్ని రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్, వ్యాళ్ళ హరీష్‌రెడ్డి, కౌశిక్ హరి, సురేంధర్‌రెడ్డి, కాపు కృష్ణ, మాదాసి రాంమూర్తి, నూనె కొమురయ్య, పర్లపెల్లి రవి, వద్దెపల్లి శంకర్, నాగెల్లి సాంబయ్య, బడికెల సంపత్, మేడిపల్లి సంపత్, బండి రమేష్, ఐలి శ్రీనివాస్, నాగెల్లి శంకర్, చెల్పూరి సతీష్, మంగిలాల్, సంపత్ రెడ్డి, జాహిద్‌పాష, ప్రభాకర్‌రెడ్డి, పొలాడి శ్రీనివాస్‌రావు, ఐ.సత్యం, అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, చల్ల రవీందర్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, పొగాకు రమేష్, బొడ్డు రమేష్, పెద్ద ఎత్తున టీబీజీకేఎస్ శ్రేణులు, వివిధ ఏరియా నుండి సింగరేణి బొగ్గు గని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని

# అంకితం చేసిన అంబేద్కర్



### బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్

**ఖమ్మం (జనం సాక్షి) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం అంబేద్కర్ సెంటర్ వద్ద బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ , పలు సంఘాల నేతలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా లింగాల రవికుమార్ మాట్లాడుతూ కుల మత ఆర్థిక అసమానతలతో నిండి ఉన్న భారతీయ సమాజంలో అన్యాయం అణచివేత దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ఉద్యమించి దేశ ప్రజలకు సమానత్వపు హక్కులు సాధించి తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేసిన సాంఘిక విప్లవ మూర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని చీకటిలో మగ్గి మగ్గిపోతున్న కోట్లాది మంది ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన త్యాగశీలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన సమసమాజ స్థాపనకై ప్రతి ఒక్కరూ క ృషి చేయాలని లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బహుజన కులాల సమన్వయకర్త కత్తి నెహ్రూ గౌడ్ మాల మహానాడు సీనియర్ నేత గుంతేటి వీరభద్రం మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్ మహాత్మ జ్యోతిరావు పూలే సంఘం అధ్యక్షులు పెళ్లూరి విజయ్ కుమార్ దళిత నాయకులు గౌరవరపు డేవిడ్ రాజ్ బుద్దిస్ట్ సంఘం బసవయ్య టీఎన్జీవో నాయకులు ఎర్ర రమేష్ పాగి వెంకన్న పమ్మి రవిబాబు ఎర్ర గంగాధర్ దారా ఆనంద్ కుమార్ మాల మహానాడు నేతలు దాసరి శ్రీనివాస్ గుమ్మడి కనకరాజు

## ఈశ్వర చారి మృతి బాధాకరం: ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం( జనం సాక్షి) :** బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం ఈశ్వరా చారి ఆత్మబలిదానం చేసుకోవడం బాధాకరమని బీసీ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్ల పట్ల అనుసరిస్తున్న వైఖరికి ఆందోళన చెందిన ఈశ్వరా చారి ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందని అన్నారు.బీసీలు ఎవరూ క్షణికావేశానికి లోనుకావద్దని కోరారు.పోరాటాల ద్వారా రిజర్వేషన్లను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు.భవిష్యత్‌లో ఇటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా పార్టీలు కృషి చేయాలని కోరారు.లేని యెడల భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొమ్మా రాజేశ్వర రావు, కూరాకుల నాగభూషణం, కత్తి నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్: దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో సంక్షోభం కొనసాగుతున్నది. వరుసగా ఐదో రోజూ పెద్ద సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. శంషాబాద్‌కు రావాల్సిన 26 విమానాలు, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 43 విమానాలు క్యాన్సల్ అయ్యాయి. విమానాలు ఎప్పుడు నడుస్తాయో సరైన సమాచారం లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

## హోంగార్డుల పాత్ర శాంతిభద్రతలు,

# ప్రజాభద్రతలో ముఖ్యం

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జనంసాక్షి :** హోంగార్డుల పనితీరు బాగుందని, విధి నిర్వహణలో హోం గార్డుల త్యాగం, బలిదానాలు మరువలేనివని, ప్రశంసనీయం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల సందర్భంగా హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించడం జరిగింది.ఈ పరేడ్ కి కమాండర్‌గా హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న వ్యవహరించారు.పరేడ్‌కి పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్యఅతిథులుగా హాజరై గౌరవ వందనం స్వీకరించి తరువాత సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు.అనంతరం పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ హోంగార్డుల సేవలు ప్రశంసనీయం, పనితీరు ప్రశంసనీయమని శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్ నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్, విపత్తు నిర్వహణ వంటి విభాగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తు అత్యవసర పరిస్థితుల్లో హోమ్ గార్డులు చూపే అంకితభావం ప్రశంసనీయం అన్నారు.జిల్లా హోమ్ గార్డ్ సిబ్బంది ప్రతి డ్యూటీని బాధ్యతగా నిర్వహించే వారి క్రమశిక్షణ,సేవాస్ఫూర్తి పోలీస్ శాఖకు గర్వకారణం అన్నారు.విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంస పత్రాలను అందజేశారు.కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అధికారులతో కలిసి సీపీ పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ పరేడ్ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసిపి ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఆర్ఐలు దామోదర్ శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, సంపత్, ఆర్ఎస్ఐలు, హోంగార్డ్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకగ్రీవ సర్పంచులను అభినందించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ




**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 06(జనంసాక్షి):** మానకొండూర్ నియోజకవర్గం వ్యాప్తంగా రెండో విడుత నామినేషన్ల ఉప సంహరణ శనివారంతో ముగిసింది. 35 గ్రామ పంచాయతీలు కలిగి ఉన్న ఇల్లంతకుంట మండలంలో 8 గ్రామాల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని చోట్ల బరిలో ఒక్కరే మిగలడంతో ఏకగ్రీవం కాగా, చాలా వరకు ప్రత్యర్థులు బరిలో ఉన్నప్పటికీ బుజ్జగింపులు, ఇతర కారణాలతో పోటీ నుంచి తప్పుకొన్నారు. దీంతో ఏకగ్రీవం అనివార్యమైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచుల్లో కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి (ముస్కానీపేట), బొల్లం మంజుల -రమేశ్ (తిప్పాపూర్), బద్దం శేఖర్ రెడ్డి (గాలిపెల్లి), పందుగ అనిత-తిరుపతి (జంగంరెడ్డిపల్లి), జక్కుల మల్లవ్వ (కిష్టారావుపల్లి), జుట్టు శేఖర్ (పత్తికుంటపల్లి), కంకటి కళ్యాణ్ (చిక్కుడువానిపల్లె), పోతరాజు చంటి (కేశన్నపల్లి) ఉన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులంతా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు కావడం విశేషం.

అలాగే గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామ సర్పంచుగా సామ రాజిరెడ్డి, బెజ్జంకి మండలం నర్సింహులపల్లి గ్రామ సర్పంచుగా జెట్టి రమేశ్ లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్ మండలాల్లో ఒక్క పంచాయతీ కూడా ఏకగ్రీవం కాలేదు. దీంతో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఇదిలా ఉండగా, ఇల్లంతకుంట మండలంలో 8 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కావడంపై మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం ప్రకటించారు. ఏకగ్రీవ సర్పంచులను ఆయన అభినందించారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్





### రేషన్ దుకాణం ఆకస్మిక తనిఖీ

**ఎడపల్లి, డిసెంబర్ 6 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని నవీపేట్ మండలం అభంగపట్నం, ఎడపల్లి మండలం జానకంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృషారెడ్డి శనివారం సందర్శించారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య, సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలకు మినహాయించి, మిగిలిన స్థానాలకు మాత్రమే ఎన్నిక జరపాలని, పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు స్వేఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ముగిసిన తరువాత జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటించాలని, కోరంను సరిచూసుకుని ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించాలని, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. జానకంపేటలో సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న ప్రక్రియను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలలో కూడా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి, ఓటర్లకు వారి ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందనే వివరాలు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల తహసీల్దార్ దత్తాద్రి ఉన్నారు.

**రేషన్ దుకాణం ఆకస్మిక తనిఖీ**

అనంతరం కలెక్టర్ ఎడపల్లి మండలం నెహ్రూనగర్ లోని రేషన్ దుకాణాన్ని కలెక్టర్ టి.వినయ్ కృషారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్దిదారులకు సన్న బియ్యం సజావుగా పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలలోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం నిల్వలు కేటాయించబడ్డాయా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో బియ్యం పంపిణీ జరిగింది, ఇంకా ఎంత మందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని రేషన్ డీలర్ కు సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా

# 63వ హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 06(జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం 63వ హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం హోంగార్డుల అమూల్య సేవలను ప్రశంసిస్తూ ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, హోంగార్డ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని ఉదాటించారు. మన దేశంలో ఈ వ్యవస్థను 1946లో బాంబేలో ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితులలో తక్షణ స్పందన, సమర్థవంతమైన బందోబస్తు విధులు, ప్రజా రక్షణ చర్యల్లో హోంగార్డుల సేవలు అమూల్యమని సీపీ కొనియాడారు. విధుల్లో అంకితభావం, ప్రతిభ కనబరిచిన హోంగార్డులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్, ఇతర క్రీడా పోటీల్లో విజయం సాధించిన సిబ్బందికి ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా కార్యక్రమాలు సిబ్బందిలో శారీరక సామర్థ్యం, మానసిక ఉల్లాసం పెంపొందించడంలో తోడ్పడతాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు విజయకుమార్, వెంకటస్వామి, యాదగిరిస్వామి, హోం గార్డు ఆర్.ఐ.శ్రీధర్ రెడ్డితో పాటు ఇతర ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ.లు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సాయంపై జిల్లాలో ప్రత్యేక చర్యలు

**డీఆర్‌డీవో సాంబశివరావు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 06 (జనం సాక్షి) :** దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విభాగాల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు జిల్లా డీఆర్‌డీవో దామోదర్ సాంబశివరావు తెలిపారు. "సామాజిక పురోగతికి దివ్యాంగులతోపాటు సమాన అవకాశాలు కల్పించే సమగ్ర సమాజాన్ని నిర్మించడం ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల గుర్తింపు, సేవల విస్తరణ, హక్కుల రక్షణ దిశగా పలు కీలక కార్యక్రమాలు జిల్లా పరిధిలో చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రతి దివ్యాంగుని ఖచ్చితంగా గుర్తించేందుకు ఇంటింటికీ ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామని, అర్హులైన వారందరికీ యూడీఐడి కార్డులు తప్పనిసరిగా జారీచేయాలని శాఖలు ఆదేశించాయని ఆయన వివరించారు. బాలల దివ్యాంగత తొలిదశ పర్యవేక్షణలో భాగంగా అంగన్‌వాడీ, విద్యాశాఖ సిబ్బందితో సమన్వయం చేసి తక్షణ సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో పాటు దివ్యాంగుల వైద్య పరీక్షలు, ధృవీకరణ, శాతం నిర్ణయం పారదర్శకంగా జరిగేలా కమిటీలు పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాక, తీవ్ర దివ్యాంగతతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రత్యేక సంరక్షణ, పునరావాస సేవలను అందించేందుకు సంబంధిత విభాగాలకు సూచనలు జారీ చేసినట్లు సాంబశివరావు వివరించారు. పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయులు, మార్గదర్శక సేవలను మరింత బలోపేతం చేయాలని విద్యాశాఖతో చర్చించినట్లు



తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన ఆధార పరికరాలు, గుర్తింపు కార్డులు, పింఛన్లు, ప్రయాణ సౌకర్యాలు, చికిత్సలు వంటి అన్ని విధాల సహాయం విస్తృతంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు మండలస్థాయి పర్యవేక్షణ కమిటీలను మరింత చురుకుగా పనిచేయించనున్నామని తెలిపారు. జిల్లాలో దివ్యాంగ సంక్షేమ సేవలు మరింత వ్యవస్థీకృతంగా, పారదర్శకంగా అందేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, దివ్యాంగుల హక్కుల రక్షణకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని డీఆర్‌డీవో దామోదర్ సాంబశివరావు స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రగతి ప్రపంచ దేశాలతో పోటీ

- అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ
- రోల్ మోడల్‌గా తెలంగాణ
- ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుదారులను ఆహ్వానిస్తున్నాము
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు పనులను పరిశీలించిన.. రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**మహేశ్వరం, డిసెంబర్ 6 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీలో ఉంటుందాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రపంచ దేశాల ప్రముఖులను, దిగ్గజాలను, పెట్టుబడుదారులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే తెలంగాణ రోల్ మోడల్ అవుతుందన్నారు. రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు 2037విజన్, 2047విజన్ సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు ఆలోచనలను గ్లోబల్ సమ్మిట్ లో వివరిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ అథారిటీ డెవలప్ మెంట్ కమిషనర్ శశాంక, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి : ఏసీపీ

**ముత్తారం డిసెంబర్ 06(జనంసాక్షి):** స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రామగుండం ఏసీపీ మాదత రమేష్ ప్రజలకు సూచించారు. శనివారం ముత్తారం ముత్తారం ఇప్పలపల్లి గ్రామంలో ముత్తారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసులు కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గ్రామంలో పార్టీల నాయకులు, గ్రామస్తులతో సమన్వయము చేస్తుంకుంటూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని సిఐ రాజు గౌడ్, ముత్తారం ఎస్సై రవికుమార్ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ అబద్ధపు హామీలకు
# మోసపోయి గోస పడొద్దు

- సంగెం కలాన్ లో అరాచకాలు, దౌర్జన్యాలు ఈ ఎన్నికలతో అంతం
- అభివృధి పనులకు నిధులు మంజూరు చేస్తే తీర్మానాలకు అడ్డు
- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే : మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి




**తాండూరు డిసెంబర్ 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ అబద్ధపు హామీలకు మోసపోయి గోస పడొద్దని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పైలెట్ రోహిత్ రెడ్డి శనివారం తాండూరు మండలం సంగెం కలాన్ గ్రామంలో పర్యటించి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తరపున ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మీనాక్షి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృధి పనులకు నిధులు మంజూరు చేస్తే తీర్మానాలు ఇయ్యకుండా అడ్డుకున్నారు. సిమెంట్ కంపెనీలతో కుమ్మక్కై వరదనీటితో గ్రామాలను ముంచుతున్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల పరిధిలోని మల్కాపూర్, సంగెంకలాన్, ఐనెల్లి, జిన్గుర్తి, మిట్టబాస్పల్లి, గుంతబాసుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పోలీసుల అదుపులో జేబు దొంగల ముఠా

**ఉప్పల్, డిసెంబర్ 6 (జనం సాక్షి):** ఆర్టీసీ బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల జేబులు, బ్యాగులు ఖాళీ చేస్తున్న ఐదుగురి జేబు దొంగల ఇంటర్‌స్టేట్ ముఠాను ఉప్పల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితులను దాసర్ల యాదగిరి (28), కొమ్ము ప్రశాంత్ (31), పాశం యాదగిరి (26), బండారి సాంబ రాజు (34), మబ్బు రాజు (29)గా గుర్తించారు. వీరంతా వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందినవారు. గత నెల డిసెంబర్ 1న జనగాం జిల్లాకు చెందిన సేనా రాము సికిందరాబాద్ నుంచి ఉప్పల్‌లో బస్సు ఎక్కాడు. అతడి బ్యాగ్‌లో 6 తులాల బంగారు నగలు, 87 తులాల వెండి ఆభరణాలు ఉన్నాయి. బస్సు రద్దీగా ఉండటంతో ఈ ముఠా సభ్యులు ఒకరు బాధితుడి దృష్టి మరల్చగా, మరొకరు బ్యాగ్ జిప్ తెరిచి నగలు ఎత్తేశారు. ఇంటికి చేరుకుని బ్యాగ్ తెరిచిన సేనా రాముకు షాక్ తగిలింది. వెంటనే ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# సాయి ఈశ్వర్ చారి అంత్యక్రియలు పూర్తి

- రాజకీయ నాయకులు, ప్రజాసంఘాలు నివాళు లర్పించారు
- కాంగ్రెస్, బీజేపీలపై ఆగ్రహం... బీసీ రిజర్వేషన్ల నిర్లక్ష్యమే మరణానికి కారణమని ఆవేదన
- జగద్గిరిగుట్టలో కన్నీటి వీడ్కోలు

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 6 (జనం సాక్షి):** బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతూ ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర్ చారి (35) అంత్యక్రియలు శనివారం జగద్గిరిగుట్ట స్మశానవాటికలో కన్నీటి మయంగా జరిగాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీ రిజర్వేషన్ల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గతంలో ఆత్మహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ చారి మృతదేహానికి రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, సీనియర్ జర్నలిస్ట్ పల్లె రవికుమార్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, బీసీ సంఘాల నేతలు దూదిమెట్ల బాలరాజు యాదవ్, గణేష్ చారి, హరిశంకర్ గౌడ్,



కిషోర్ తదితరులు హాజరయ్యారు. వీరంతా పార్థివదేహానికి పూలమాలలు వేసి, స్మశానవాటిక వరకు భుజంపై మోసుకెళ్లారు. అదే విధంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఏసురత్నం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, సిపిఐ మండల కార్యదర్శి హరినాథ్ రావు, సిపిఐ నాయకులు నరసింహారెడ్డి, వెంకటేష్ సహా ఇతర ప్రజాసంఘాల నేతలు హాజరై నివాళులర్పించారు. అంత్యక్రియల సందర్భంగా హాజరైన నాయకులు మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చూపున్న నిర్లక్ష్య వైఖరి వల్లే యువకుడు ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం ఇకనైనా రెండు పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్

**ఆకట్టుకున్న పెయింట్స్**




**చేవెళ్ల, డిసెంబరు 06 (జనంసాక్షి) :** నాచారం సెయింట్ పయిస్ఎక్స్ డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాల, తువక్కం ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) యూనిట్ 1,2 ఆధ్వర్యంలో చేవెళ్ళ మండల పరిధిలోని కమ్మెట, గొల్లపల్లి, గ్రామాల్లో డిసెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల పరిశుభ్రత, రైతు వేదిక, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని ప్లాస్టిక్ తొలగింపు, గ్రామాల్లోని ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన, విద్యార్థులకు పరిశుభ్రత, సెల్ఫ్ కంట్రోల్, ఆహార పోషక విలువలు, విటమిన్ల ప్రాముఖ్యత, మహిళలకు సబ్బులు, దూప్‌స్టిక్స్, కొవ్వొత్తుల తయారీ విధానం నేర్పించడం, బస్ స్టాప్, పాఠశాల, వైద్యశాల ఆవరణలో ఆర్ట్ వర్క్ (పెయింటింగ్) వేయడం, తెలంగాణ సంప్రదాయం, వాటి గొప్పతనం తెలియచేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం కమ్మెట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణను శుభ్రం చేసి గోడలపై వేసిన పెంయింటింగ్‌లు ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వేసిన పెయింటింగ్‌ను తిలకించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యునిట్ 1,2 అధికారులు జి.ప్రీతి, డా.స్వప్నప్రియ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని ట్రాక్టర్ రెండు ముక్కలు

- డ్రైవర్ అక్కడికక్కడే మృతి - హెల్పర్‌కు తీవ్రగాయాలు
- రాజీవ్ రహదారిపై ఘోర ప్రమాదం - రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- అతి వేగమే దుర్ఘటనకు కారణమని పోలీసుల అంచనా



**శామీర్‌పేట, డిసెంబర్ 6 (జనం సాక్షి):** హైదరాబాద్–కరీంనగర్ రాష్ట్ర రాజీవ్ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొన్న ట్రాక్టర్ రెండు ముక్కలైంది. ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, హెల్పర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా సమీపంలో సాయంత్రం 4.20 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు అతి వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న లారీ... ముందుగా ట్రాలీతో వెళ్తున్న ట్రాక్టర్‌ను సైడ్ నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ భారీ ఢీకొన్న దెబ్బకు ట్రాక్టర్ ఇంజన్‌తో సహా రెండు ముక్కలై రోడ్డుపై చెల్లాచెదురైంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆకాశ్ ఉత్తం సోన్ కాంబ్లే (31, మహారాష్ట్రకు చెందినవాడు) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ట్రాక్టర్‌పై ఉన్న హెల్పర్ జగదీష్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన జగదీష్‌ను పోలీసులు తక్షణం లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడైన కాంబ్లే శరీరాన్ని పంచనామా నిర్వహించి మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి పంపారు. డ్రైవర్, హెల్పర్ ఇద్దరూ మహారాష్ట్రకు చెందినవారైనప్పటికీ గత కొన్నేళ్లుగా అలియాబాద్‌లోనే నివసిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రాజీవ్ రహదారిపై దాదాపు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. గంటన్నర పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో రెండు ముక్కలైన ట్రాక్టర్‌ను పక్కకు తొట్టి రోడ్డును క్లియర్ చేశారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# లోక్‌అదాలత్‌లో బలవంతపు రాజీలు చేయొద్దు

- న్యాయవాది సమక్షంలోనే రాజీ జరగాలి
- ఈ నెల 21న జాతీయ లోక్‌అదాలత్
- న్యాయ చైతన్య సదస్సులో జిల్లా కోర్టు జడ్జి భారత లక్ష్మి




**ఆర్మూర్, డిసెంబర్ 6 ( జనంసాక్షి):** ఇరువర్గాలు స్వచ్ఛందంగా రాజీ పడితేనే లోక్ అదాలతో కేసులను పరిష్కరించాలని, బలవంతపు రాజీలు చేయొద్దని జిల్లా కోర్టు జడ్జి భారత లక్ష్మీ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ సివిల్ జడ్జి శ్రీదేవి అధ్యక్షతన న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధికి మాత్రమే వీడిసిలు పనిచేయాలని, చట్టాలను చేతిలోకి తీసుకోవద్దని హితవు పలికారు. పోలీసులు ప్రాథమిక కర్తవ్యంలో భాగంగా వచ్చిన ఫిర్యాదుకు స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బాగానే ఉందని, వెనువెంటనే లోక్ అదాలతో రాజీకి ప్రోత్సహించద్దని చెప్పారు. ఇలాంటి పనులతో పోలీస్ వ్యవస్థ మీద నమ్మకం పోతుందన్నారు. లోక్ అదాలత్ లలో ఏ కేసు రాజి కైనా న్యాయవాదికి నోటీసులు ఇచ్చి, న్యాయవాది సమక్షంలో ఇరు వర్గాలకు రాజీ చేయాలని చెప్పారు. ప్రజలు రాజీ పడితే విలువైన డబ్బు, కాలం వృధా కాకుండా ఉంటుందన్నారు. ఫోక్సో కేసుల్లో ఆడపిల్లలే కాకుండా మగ పిల్లలు బలవుతున్నారన్నారు. ఇలాంటి కేసులపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈనెల 21న జరిగే లోక్ అదాలత్ స్వచ్ఛందంగా రాజీ పడాలని కోరారు. ఈ సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి నవ్యశ్రీ, న్యాయమూర్తి గట్టు గంగాధర్, ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి, ఎస్బిఐ ఏరియా మేనేజర్ కార్తీక్ గౌడ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాందేశ్ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, న్యాయవాదులు కొండి పవన్, జిజి రామ్, ఖాందేశ్ సంగీత, మురళి, ప్రవీణ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్
# సమీక్షించిన కలెక్టర్ అబ్జర్వర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 6 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మిన్ బాష సమక్షంలో నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. రెండవ విడత 7 మండలాలకు సంబందించి 175 గ్రామా పంచాయతీలకు ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు 1823, ఓపీఓ 2249 లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. మొదట విడత పోలింగ్ కోసం మైక్రో అబ్జర్వర్ల ను ర్యాండమైజేషన్ ద్వార మండలాలకు కేటాయించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగి లాల్, డీపీఓ జయసుధ, డి ఆర్‌డిఓ శ్రీనివాస్, నోడల్ అధికారి మాధవ రెడ్డి, డిఇఓ రేణుకా దేవి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం

- ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను పాటించాలి
- రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ సుధీర్





**తాండూరు డిసెంబర్ 6(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. తొలి విడతగా కొడంగల్, బషీరాబాద్, బొంరాస్ పేట్ దౌల్తాబాద్, దుద్యాల్, పెద్దేముల్, తాండూర్, యాలాల్ మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ఆ డివిజన్ కు చెందిన ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు తాండూర్ పట్టణంలోని ఎం పి డిఓ కార్యాలయంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పాటిస్తూ, అప్రమత్తతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ఎక్కడ కూడా తప్పిదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగల్గుతారని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. శిక్షణా తరగతులలో సూచించిన అంశాలను ఆకళింపు చేసుకుని, విధిగా పాటించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హోంగార్డులు పోలీస్ శాఖకు వెన్నుముక

- రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి
- హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీనియర్ హోంగార్డులతో కేక్ కట్ చేపించిన డీజీపీ



హైదరాబాద్, డిసెంబర్ 6 (జనంసాక్షి) : హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని డిజిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేశారు. డిజిపి కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డిజిపి బి.శివధర్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమానికి విచ్చేసిన డిజిపి బి.శివధర్ రెడ్డి హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్ధం చేసిన కేకును సీనియర్ హోంగార్డులతో కట్ చేయించారు. 30 సంవత్సరాలకు పైగా హోంగార్డు సేవలందిస్తున్న హోంగార్డులు, మహిళా హోంగార్డులు కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందరరేగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని హోంగార్డులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో హోంగార్డులు ప్రధాన పాత్రను పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. పెద్దగా ప్రతిఫలం ఆశించకుండా హోంగార్డులు సేవలందిస్తున్నారని కొనియాడారు. తాను ఉద్యోగంలో చేరినప్పటి తో పోలిస్తే ప్రస్తుతం హోంగార్డుల పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీస్ శాఖకు వారు వెన్నెముక గా ఉన్నారని ప్రశంసించారు. హోంగార్డులకు సంబంధించిన కొన్ని విషయాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, కారుణ్య నియామకాలకు సంబంధించిన అంశం త్వరలో పరిష్కరించాల్సి ఉందన్నారు. తద్వారా, విధి నిర్వహణలో చనిపోయిన హోంగార్డులకు శ్రద్ధాంజలి కార్యక్రమం తరహాలో ఈ నియామకాలు చేపట్టాల్సి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. హోంగార్డులకు లైఫ్ ఇన్సూరెన్స్ చేసేందుకు కొన్ని బ్యాంకులు ముందుకు వస్తున్నాయని, ఆయా బ్యాంకు అధికారులతో తాను ఇప్పటికే చర్చించానని పేర్కొన్నారు. హెచ్డిఎఫ్సి, యాక్సిస్ బ్యాంకులు ఇప్పటికే విధి నిర్వహణలో చనిపోయిన హోంగార్డులకు ఎక్స్ గ్రేషియా అందజేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న అంశాలలో శు భవార్తను హోంగార్డుల త్వరలో వింటారని ఆశిస్తున్నానని డిజిపి అన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ అడిషనల్ డిజిపి స్వాతి లక్రా మాట్లాడుతూ.... ప్రభుత్వం ఇప్పటికే హోంగార్డులకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. 15, 075 రైన్ కోట్స్, 4700 ఉలెన్ జాకెట్స్ ఇటీవల హోంగార్డులకు అందజేశామని, ప్రభుత్వ పరిశీలనలో ఉన్న అంశాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామన్నారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, సిఐడి అడిషనల్ డిజిపి చారుసిన్హా, ఐజిపిలు ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ భద్రత ఏర్పాట్లపై సమీక్షించిన డిజిపి బి.శివధర్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అడిషనల్ డిజిపిలు మహేష్ ఎం భగవత్, డీఎస్ చౌహాన్, అగ్నిమాపక శాఖ బిజీ విక్రమ్ సింగ్ మాన్, టిజిఐఐసి ఎండి శశాంక్, ఐజిపి (పి అండ్ఎల్) ఎం.రమేష్ లతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ కు అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సుమారు 3 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు గ్లోబల్ సమ్మిట్‌కు రానున్నారని తెలిపారు. ఆహ్వానితులకు మాత్రమే డిసెంబర్ 8, 9 తేదీలలో అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులు మాత్రం సాధారణ ప్రజలకు కూడా అనుమతి ఉంటుందని అన్నారు. విఐపి ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుందని గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేస్తామని తెలిపారు. రేపు సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయనీ ఆయన అన్నారు.బందోబస్త్ విషయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించామని పేర్కొన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమిం చనున్నామని వివరించారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ పనిచేస్తారన్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, సాధారణ ప్రజలు, ఇతర వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు.

# సమన్వయం చేయడానికి టీసీసీసీ నియామకం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మీనాక్షి నటరాజన్‌తో పార్టీ శ్రేణులతో వివిధ ప్రజా సంబంధిత, పార్టీ కార్యక్రమాలలో సమన్వయపడుటకు, రోజు వారి కార్యక్రమాల్లో సహాయపడుటకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌తో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణు గోపాల్‌లను నియమించారు. పైన పేర్కొన్న ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా తమ పై ఉంచిన నమ్మకం, బాధ్యత ని పాటిస్తాం అని కొప్పుల ప్రవీణ్ కుమార్, గంప వేణుగోపాల్ లు తెలుపుతూ, అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు ధన్యవాదాలు తెలిపారు.



గంప వేణుగోపాల్



కొప్పుల ప్రవీణ్ కుమార్

# గాంధీ, నెహ్రూలపై విషప్రచారం

- విషప్రచారం చేస్తున్న బీజేపీ
- మండిపడ్డ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి




హైదరాబాద్, డిసెంబరు 6 (జనంసాక్షి) : మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెగా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీపై బీజేపీ నాయకులు విషప్రచారం చేస్తుంటే బీజేపీ నేతలపై ప్రజలు తిరగబడుతున్నారని.. దీంతో గాంధీనీ కాకుండా ఇప్పుడు నెహ్రూపై విష ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజల్లోకి బ్యాంక్ సేవలు తీసుకువచ్చిందే ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. చరిత్రను రూపుమాపాలని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నెహ్రూ కుటుంబం ఎప్పుడూ కుట్రా రాజకీయాలు చేయలేదు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసమే నెహ్రూ కుటుంబం పని చేసిందన్నారు. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలని నెహ్రూ కుటుంబం శాంతియుత పోరాటం చేసి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీనే.. ఇది చరిత్ర.. దీనిని ఎవరూ మార్చలేరు. అప్పుడు బీజేపీ లేదు కదా అందుకే నెహ్రూ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు. నెహ్రూ ప్రధాని కావాలని స్వాతంత్ర్యం పోరాటం చేయలేదు. నెహ్రూ ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఆయన ప్రధాని అయిన తర్వాత ప్రణాళిక బద్ధంగా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 'లౌకిక వాదాన్ని నెహ్రూ విశ్వసించేవారని.. వారి త్యాగాలను మరిపించడానికి బీజేపీ నేతలు చెడు ప్రచారం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై కావాలని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానిగా దేశంలో నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పుడు ప్రజలు ఏక తీర్మానంతో నెహ్రూను ప్రధానిగా ఉండాలని చెప్పారు. ఇప్పుడు రెండు పర్యాయాలు ఓటింగ్ మిషన్‌లు తమంతట తాము ఓటు వేసుకున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో నెహ్రూ హయాంలో ఆకలి చావులు లేకుండా చేశారు. తాగు, సాగు నీరు ప్రజలకు అందించడం కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులను నెహ్రూ నిర్మించారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# షామీర్‌పేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ..డ్రైవర్ మృతి



హైదరాబాద్, డిసెంబరు 6 (జనంసాక్షి) : మేడ్చల్ జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అలియాబాద్ చౌరస్తా దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అలియాబాద్ నుంచి శామీర్ పేట వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను శామీర్ పేట నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ అదుపు తప్పి రాంగ్ రూట్‌లోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆకాష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ధాటికి ట్రాక్టర్ ఇంజన్ రెండు ముక్కలైంది. ఈ ప్రమాదంతో రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపుల కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్?ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్?ను క్లియర్ చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రయాణికుల డబ్బు వెంటనే వెనక్కి..

- ఇండిగో సంక్షోభంతో ధరలు పెంచకుండా చర్యలు
- పరిస్థితిపై పూర్తిస్థాయిలో చర్యలు: రామ్మోహన్ నాయుడు




న్యూఢిల్లీ, డిసెంబరు 6 (జనంసాక్షి) : ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమాన టికెట్ల ధరలు పెంచకూడదని ఆదేశాలు ఇచ్చామని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ పరిస్తితి ఆధారంగా సంస్థలు ధరలు పెంచితే ఊరుకోబోమని అన్నారు. విమాన టిక్కెట్ గరిష్ఠంగా రూ.18వేలు మించొద్దని ఆదేశాలు జారీ చేశారు. టికెట్ ధరలను నాలుగు కేటగిరీలుగా మంత్రిత్వ శాఖ విభజించారు. 500 కిలోమీటర్లకు ఒక రేటు, 500 నుంచి 1000 కిలో మీటర్లకు ఒక రేటు ఉంటుందని మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఇండిగో విమానాల రద్దు, ప్రయాణికుల అవస్థలపై కేంద్రమంత్రి మాట్లాడారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు అందరూ పాటిస్తున్నారు. ప్రత్యేకంగా కమిటీ వేసి విచారణకు ఆదేశించాం. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఇండిగో కచ్చితంగా సమాధానం చెప్పాల్సిందేనని అన్నాఉ. మా మంత్రిత్వశాఖ పూర్తి దృష్టి ప్రయాణికులపైనే ఉందన్నారు . ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించాం. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. 24గంటల్లోగా అంటే ఆదివారం రాత్రి 8గంటల్లోపు రీఫండ్ చేయాలని ఇండిగోను ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండిగో సంక్షోభంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులందరికీ రేపటిలోగా డబ్బులు రిఫండ్ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అంశం పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని హెచ్చరించారు. కేవలం ఇద్దరే ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఉండటంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పుకొచ్చారు. డీజీసీఏ తరపున ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని ప్రస్తావించారు. దీనికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నితీశ్ కుమార్



పాట్నా, డిసెంబర్6 (జనంసాక్షి) : బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందన లేఖను పంపింది. ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. "1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం" అని ప్రశంసించింది. సుపరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కృషి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్

అమరావతి, డిసెంబరు6 (జనంసాక్షి) : విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే ధృడ సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషక ఆహారాన్ని, నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంత్రి నారాలోకేష్ చేస్తున్న కృషికి అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేలా నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో మహిళా శక్తికి జేజేలు

- ప్రధాన ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి స్టాల్






హైదరాబాద్ (జనంసాక్షి) : భారత్ ఫ్యూచర్ సిటిలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో మహిళా సాధికారతకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజాప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న విధానాలకు ఈ స్టాల్ అద్దం పడుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల శక్తి, సాధికారత, వ్యాపార నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల ముందు సమగ్రంగా ప్రదర్శించే వేదికగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (సెర్ప్), తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాల నమూనాలు ప్రదర్శిస్తున్నారు. మహిళలే నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి పెట్రోలు బంకు, హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన ఇందిరా మహిళా శక్తి భవనాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, అలాగే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి విభిన్న వ్యాపారాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు ఈ స్టాల్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి గ్లోబల్ వేదిక వరకు మహిళల ప్రయాణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన డాక్యుమెంటరీలను ప్రదర్శన కోసం ప్రత్యేక స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. మహిళా స్వయం సహాయక బ ృందాలు ఎలా వ్యాపారవేత్తలుగా ఎదిగాయి, ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి ఎలా సుస్థిర ఆదాయ మార్గాలుగా మారింది అనే అంశాలు ఈ డాక్యుమెంటరీల ద్వారా సందర్శకులు తెలుసుకోగలగుతారు. అలాగే మహిళా-శిశు సంక్షేమం కోసం ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన నూతన కార్యక్రమాల వివరాలను కూడా స్టాల్‌లో సమగ్రంగా ప్రదర్శిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ స్టాల్‌లో ప్రతిఫలిస్తోంది. వేల కోట్ల రూపాయల బ్యాంకింగ్ లింకేజ్ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలాన్ని అందించడం, వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపులతో మహిళలపై రుణభారాన్ని తగ్గించడం, మహిళా సభ్యులకు రూ.10 లక్షల లోన్ బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమా వంటి భద్రతా చర్యలు రేవంత్ రెడ్డి నేత ృత్వంలోని ప్రజా పాలనలో, మంత్రి సీతక్క మార్గదర్శనంలో.. మహిళల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే 20కు పైగా విభిన్న వ్యాపార రంగాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ, మహిళలను యజమానులుగా, నాయకులుగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళుతోంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్, మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి అన్న ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలిచి, దేశం ప్రపంచం ద ృష్టిని ఆకర్షిస్తోంది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలి

- ఆహ్వానానికి కృతజ్ఞతలు తెలిపిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



కోల్‌కతా (జనంసాక్షి) : డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకుగాను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లా పర్యటనలు ఉండటం వల్ల, కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమం ఘన విజయం సాధించాలని మమతా బెనర్జీ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించే బాధ్యతను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కకు అప్పగించారు. దీనిలో భాగంగా మంత్రి సీతక్క, బెంగాల్ సీఎం మమతా బెనర్జీని సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే జిల్లాల్లో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో మమతా బెనర్జీ బిజీగా ఉండటంతో, వ్యక్తిగతంగా కలవడం కష్టమని ఆమె ఆదేశాల మేరకు ఆహ్వాన పత్రాన్ని ఇ-మెయిల్ ద్వారా పంపించాలని మమతా బెనర్జీ కార్యాలయం సూచించింది. అనుగుణంగా మమతా బెనర్జీ కార్యాలయంతో సమన్వయం సాధించిన మంత్రి సీతక్క తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అధికారిక ఆహ్వాన పత్రికను ఇ-మెయిల్ ద్వారా పంపించారు. ఆహ్వాన పత్రిక అందుకున్న అనంతరం మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు. ఈ సందరరేగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370